




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


రూ. కోటి పరిహారమివ్వండి

గుర్తించబడిన ఫుట్‌పాత్‌పై.. నడిచే హక్కు ప్రాథమిక హక్కు : సుప్రీం కోర్టు

నీట్ రీ-ఎగ్జామ్‌కు లైన్ క్లియర్ 07


సంపుటి 09, సంచిక: 200 | శనివారం | 20-06-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## విద్యా వ్యవస్థ విధ్వంసం

# వందేళ్ల నష్టం

### రాష్ట్రంలో గత పదేళ్లలో దెబ్బతిన్న విద్యను వికాసం వైపు తీసుకెళ్తున్నాం

- సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు తెలంగాణ, దేశ పునర్‌నిర్మాణంలో భాగస్వాములు కావాలి
- విద్యార్థులకు సకల సౌకర్యాలతో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నాం
- ప్రైవేట్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను పునరుద్ధరిస్తున్నాం
- సర్కార్ బడుల్లో నో అడ్మిషన్ బోర్డు పెట్టడం ఎప్పుడైనా చూశారా?
- ఆరుట్ల పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో అసాధ్యం సుసాధ్యమైంది
- విద్యాభివృద్ధికి రూ.26,600 కోట్లు ఖర్చుచేస్తున్నాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- యంగ్ ఇండియా స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ




ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలలు మూసివేసి, విద్యా వ్యవస్థను విధ్వంసం చేశారని, తద్వారా రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విమర్శించారు. గత పదేళ్ల కాలంలో విధ్వంసమైన విద్యను వికాసం వైపు తీసుకెళ్తున్నామన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు తెలంగాణ,దేశ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని, దేశాన్ని నడిపించే, పాలించే శక్తులుగా, అంబేద్కర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. అందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తుందని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామని, భవిష్యత్తులో విద్యార్థులకు రవాణ సౌకర్యాన్ని కూడా కల్పిస్తామని సిఎం ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఎల్.బి స్టేడియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా,డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క,

తరువాయి 12లో

### మంచి చేస్తే మద్దతిస్తా

గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే మంచి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలబడాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. ప్రభుత్వం తీసుకునే మంచి నిర్ణయాలను స్వాగతిస్తూనే మద్దతుగా నిలుస్తానని, అదే సమయంలో లోపాలను, తప్పులను ఎత్తిచూపుతూ సరైన సూచనలు చేస్తానని గవర్నర్ అన్నారు. 'మత్తు వద్దు.. జీవితమే ముద్దు' అనే నినాదంతో ముందుకెళ్లాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ ఏర్పాటుకు అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తరగతి గదికే పరిమితం కాకుండా, దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.




## 'సర్'కు వ్యతిరేకంగా

# 23న భారీ ప్రదర్శన

### 24న రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల వారీగా అవగాహన సదస్సులు : అఖిలపక్ష నేతల నిర్ణయం

- అర్హుల ఓటు హక్కులకు భంగం కలగకుండా కలిసికట్టుగా ఉద్యమాలకు సంసిద్ధంగా ఉండాలి
- ఓటు హక్కును కాపాడుకునే విధంగా ప్రజలను చైతన్యవంతులను చేద్దాం
- రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, విద్యావేత్తలు ప్రతిన
- సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 'జీవించే హక్కును కాలరాస్తున్న 'సర్'కు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

అర్హులైన ఏ ఒక్కరి ఓటు హక్కుకు భంగం కలగకుండా కలిసికట్టుగా ఉద్యమాలకు సంసిద్ధం కావడంతో పాటు ప్రజలు తమ ఓటు హక్కును కాపాడుకునే విధంగా చైతన్యవంతులను చేద్దామని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, విద్యావేత్తలు ప్రతిన చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా ఈనెల 23న అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారీ ప్రదర్శనను నిర్వహించి ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు. ఈ నెల 24వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల వారీగా అవగాహన సదస్సులను నిర్వహించి ప్రజలు తమ ఓటు హక్కును కాపాడుకునేలా సన్నద్ధం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. 'జీవించే హక్కును కాలరాస్తున్న ఎస్ఐఆర్'కు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో

తరువాయి 8లో

### ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి

మహేశ్ కుమార్ గౌడ్

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) అనే ప్రక్రియ ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన పద్ధతి అని, కానీ ప్రస్తుతం ఓట్లు తొలగించే కార్యక్రమంగా మారిందని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్మార్గాన్ని కమ్యూనిస్టులు, కాంగ్రెస్, లౌకికవాద శక్తులన్నీ కలిసికట్టుగా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటు అనేది ప్రజాస్వామ్యంలో ఒక బ్రహ్మాస్త్రమని, అలాంటి ప్రతి ఒక్కరి ఓటును భద్రపరిచి జతచేయడమే ఎస్ఐఆర్ ముఖ్య ఉద్దేశం కావాల్సి ఉండగా, లౌకికవాద పార్టీలకు ఓటు వేస్తారనే అనుమానం ఉన్న ప్రతి ఒక్కరి ఓటు తొలగించే ప్రక్రియగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తరుపున తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో ఇప్పటికే 108 నియోజకవర్గాల్లో బిఎల్ఎలకు శిక్షణ పూర్తి చేశామని వెల్లడించారు. వరంగల్, ఆందోల్ తదితర ప్రాంతాల్లో త్వరలోనే శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 'బిఎల్ఎ2 వ్యవస్థ ద్వారా ప్రతి పేదవాడి ఓటును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని వెల్లడించారు.

## 'గాంధీ సరోవర్'కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగానికి వర్కింగ్ పర్మిషన్ మంజూరు
- మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కీలక ముందడుగు
- రక్షణ మంత్రికి, ఆర్మీకి సిఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టుకు కీలక ముందడుగు పడింది. మూసీ పునరుజ్జీవ కార్యక్రమంలో భాగంగా బాపూఘాట్ వద్ద నిర్మించనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ అధికారిక అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల రక్షణశాఖ భూమిని ప్రాజెక్టు అభివృద్ధి కోసం వినియోగించుకునేందుకు వర్కింగ్ పర్మిషన్ జారీ చేసింది. గోల్కొండ ఆర్టిలరీ సెంటర్ పరిధిలోని భూమిలో అభివృద్ధి పనులకు కేంద్రం అనుమతులు ఇవ్వడంతో గాంధీ సరోవర్ ప్రాజెక్టు అమలు దిశగా అడుగులు వేగవంతం కానున్నాయి. అయితే, వినియోగానికి ఇచ్చిన భూమికి ప్రతిగా అదే విలువ కలిగిన భూమిని

తరువాయి 12లో



పుట్టినరోజు సందర్భంగా ఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయంలో కేక్ కట్‌చేసిన ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ 07

రాష్ట్ర కేబినేట్ నిర్ణయం

### రైతులను వంచించడమే



ప్రతి గింజనూ రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలి : సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ 03




## ఇళ్ల పట్టాల కోసం

# భారీ ధర్నా

- హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సిపిఐ, సిపిఐ(ఎం) ఆందోళన
- ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలివ్వడంలో ప్రభుత్వం వైఫల్యం
- అందుకే భూ పోరాటాలు చేస్తున్నామని వామపక్ష నేతల ప్రకటన

ప్రజాపక్షం/హనుమకొండ

ఇండ్ల స్థలాల పంపిణీలో ప్రభుత్వ వైఫల్యంతోనే పేదలు భూపోరాటాలు నిర్వహిస్తున్నారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం సిపిఐ, సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ ధర్నాకు వామపక్షాల నాయకులు, పెద్ద సంఖ్యలో పేద ప్రజలు, మహిళలు తరలివచ్చారు.ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు హాజరై మాట్లాడుతూ భూపోరాటాల ద్వారా ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకుని దశాబ్దాలుగా నివాసముంటున్న, నిరుపేదలైన ప్రజలకు ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని ఆయన మండిపడ్డారు.ఒక వైపు పేదలకు గూడు లేక ఇబ్బంది పడుతుంటే, మరో వైపు విలువైన ప్రభుత్వ భూములు ల్యాండ్ మాఫియా పరం అవుతున్నాయని ఆరోపించారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి హనుమకొండ జిల్లాలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయాలని, లేనిపక్షంలో వామపక్షాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని

తరువాయి 12లో

## అమెరికా-ఇరాన్

# కీలక చర్చలు వాయిదా

- లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడే కారణం?
- ఇరు దేశాల శాంతి ఒప్పందంపై ప్రభావం చూపే అవకాశం!





**జూరిక్:** అమెరికా-ఇరాన్ మధ్య అణు కార్యక్రమం, హోర్ముజ్ జలసంధి ద్వారా చమురు రవాణా పునరుద్ధరణపై జరగాల్సిన కీలక చర్చలు అనుకోని అవరోధాన్ని ఎదుర్కొన్నాయి. ఇటీవల కుదిరిన ఒప్పందం ప్రకారం 60 రోజుల చర్చల కాలపరిమితి ప్రారంభమైనప్పటికీ, అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ స్విట్జర్లాండ్‌లో ఇరాన్ ప్రతినిధులతో జరపాల్సిన తొలి సాంకేతిక చర్చలు వాయిదా పడ్డాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులను కొనసాగించడమే ఈ వాయిదాకు కారణమని అంటున్నారు. ఈ తాజా దాడుల నేపథ్యంలో, స్విట్జర్లాండ్‌కు ఇరాన్ ప్రతినిధులు వెళ్లలేదు. అధికారిక ప్రకటన ఏదీ వెలువడనప్పటికీ, ఇజ్రాయెల్ దాడుల కారణంగానే స్విట్జర్లాండ్‌కు వాన్స్ తన ప్రయాణాన్ని మానుకున్నారని సమాచారం. వాస్తవానికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరపున చర్చలకు నాయకత్వం వహిస్తున్న వాన్స్ స్విట్జర్లాండ్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే చర్చల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు ఖరారు కాకపోవడంతో ఆయన

తరువాయి 8లో

## భూ భారతి

# దారి చూపేనా?




- దశాబ్దాలు గడిచినా దొరకని పరిష్కారం
- భూ సమస్యతో ఇబ్బందులు పడుతున్న రైతులు
- హక్కు, భుక్తంలో ఉన్నా దొరకని పట్టా

ప్రజాపక్షం/ ఖమ్మం

భూమికి విలువ పెరగడంతో పాటే సమస్యలు కూడా క్రమేపీ పెరుగుతూ వచ్చాయి. రెవెన్యూ చిట్కాలు తెలుసుకున్న కొంత మంది భూ సమస్యలను తెచ్చిపెడితే మరి కొందరు ఈ వివాదంలో చిక్కుకుని ఇప్పటికీ భూమిపై హక్కు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. అసలే భూ సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్న వారికి ధరణి ఒక కొత్త తలనొప్పిని తెచ్చిపెట్టింది. నిషేధిత జాబితాలో పట్టా భూములు కూడా చేరడంతో రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకు వచ్చిన భూ భారతి చట్టం పరిష్కారం చూపుతుందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా ధరణితో వచ్చిన ఇబ్బందులు ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదు. గతంలో ప్రభుత్వం ప్రజా ఉపయోగార్థం రోడ్లు, ప్రాజెక్టుల నిర్మాణం, డ్రైన్లు, భవనాలు తదితర అవసరాల కోసం స్వీకరించిన భూమి పోను మిగిలిన భూమిని పట్టాదారులు సాగు చేసుకుంటున్నారు. ఉదాహరణకు నాగార్జున సాగర్ ఎడమ కాలువ పరిధిలో కాలువ క్రింద 1.24 ఎకరాల భూమి ఓ రైతుకు ఉండగా

తరువాయి 8లో

## భూముల రీసర్వే

- వచ్చేనెల నుంచి దశలవారీగా ప్రారంభం
- తొలిదశలో 2,240 గ్రామాల్లో షురూ
- భూవివాదాలు లేని తెలంగాణే లక్ష్యం
- రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

భూ సమస్యలు, భూవివాదాలు లేని తెలంగాణను నిర్మించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భూముల రీసర్వే కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి దశల వారీగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రెవెన్యూ అధికారులతో శుక్రవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలుండగా, తొలిదశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల నుంచి జిల్లాకు 70 గ్రామాల చొప్పున మొత్తం 2,240 గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన

తరువాయి 8లో



## వాన చినుకు

# జాడేదీ?

### జూన్ ముగుస్తున్నా లోటు వర్షపాతం

### ఖరీఫ్ సాగు పనుల్లో జాప్యం

### రైతుల్లో పెరుగుతున్న ఆందోళన

ప్రజాపక్షం/హనుమకొండ

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా వాన చినుకు జాడ లేదు. మొదట్లో ఊరించిన వర్షాలు నేడు జాడ లేకుండా పోయాయి. నైరుతి రుతుపవనాలు వచ్చినట్టే వచ్చి ఆగిపోయాయి.వ్యవసాయ సీజన్లో ముఖ్యమైన జూన్ మాసం ముగిసిపోతోంది. ఖరీఫ్ కాలం నెత్తిమీదకు వచ్చింది. అయినా వరుణుడు కరుణించడం లేదు. ఫలితంగా ఉమ్మడి వరంగల్ జిల్లా రైతాంగం ఆకాశం వైపు ఆశగా చూస్తోంది. గత ఖరీఫ్ సీజన్ లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండకపోవడంతో సాగు నీటి కొరత ఏర్పడింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించినప్పటికీ ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో మాత్రం ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. జూన్1 నుంచి 18వ తేదీ (గురువారం) వరకు నమోదైన వర్ష పాతం సాధారణం కంటే తక్కువగా ఉండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

**70 మండలాల్లో లోటు, భారీ లోటు**

సాధారణంగా జూన్ తొలి పక్షంలోనే విస్తృతంగా వర్షాలు కురిసి ఖరీఫ్ సాగు ఊపందుకోవాలి. ఈసారి అక్కడక్కడా చిరుజల్లులు మినహా

తరువాయి 12లో



# తాత్కాలిక అవగాహన ఆరంభం మాత్రమే

పశ్చిమాసియాలో 107రోజుల యుద్ధం ముగిస్తూ అమెరికా–ఇరాన్‌లు ఒక తాత్కాలిక అవగాహనతో కూడిన శాంతి ఒప్పందంపై బుధవారం సంతకాలు చేయటం ఆ రీజియన్‌లో అనేక దశాబ్దాల్లో అత్యంత ప్రాముఖ్యతగల దౌత్య పరిణామాల్లో ఒకటి. వివాదాంశాల్లో కొన్నిటికి తక్షణ ఉపశమనం కలుగజేస్తూ, తుది పరిష్కారాలను అంతిమ ఒప్పందంకోసం 60రోజుల చర్చలకు అప్పగించిన ఈ అవగాహన పత్రం తమకంటే తమకు విజయంగా ఇరుపక్షాలు ప్రకటించటంలో ఆశ్చర్యంలేదు. ఇరుపక్షాలు తమ వ్యూహాత్మక లక్ష్యాలను సమర్థించుకోవటం సహజం. ఇది ఎవరికి విజయం అనే మీమాంసకన్నా, పశ్చిమాసియా పరిస్థితుల్లో గుణాత్మక మార్పు తేగలిగిన తుది ఒప్పందం దాకా ప్రయాణం సాగుతుందా అనేది మిలియన్ డాలర్ ప్రశ్న. చర్చలు ఫలప్రదమై నిరాటంకంగా ఆయిలు సరఫరాలతో ప్రపంచ ఆర్థికవ్యవస్థల్లో స్థిరత్వానికి దోహదం కావాలన్నది ప్రపంచ దేశాల ఆశ. అయితే లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు సహా అన్ని వైపులనుంచీ దాడులు తక్షణం నిలిచిపోవాలని అవగాహన పత్రం స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, ప్రధాని బెంజిమన్ నెతన్యాహుకు అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, పోరాట విరమణ అవగాహన పత్రంపై ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ సంతకాల సిరా ఆరకముందే ఇజ్రాయెల్ దక్షిణ లెబనాన్‌పై బాంబులు కురిపించింది, ఆస్తుల విధ్వంసంతోపాటు పలువురు హతులైనారు. అమెరికా – ఇరాన్ ఒప్పందంతో తమకు సంబంధంలేదన్న మొండివాదనతో శాంతిని భగ్నం చేసే చర్యలను ఇజ్రాయెల్ కొనసాగిస్తే అందుకు అధ్యక్షుడు ట్రంప్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇజ్రాయెల్ తాజా దాడుల పర్యవసానంగా అమెరికా–ఇరాన్ మధ్య జెనీవాలో 60రోజుల చర్చలు ఆరంభం కాకుండానే వాయిదా పడ్డాయి.

ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధ విమానాల దాడులతో మొదలైన ప్రస్తుత యుద్ధానికి ముగింపు పలికిన అవగాహన పత్రంపై సంతకాల ప్రక్రియ ముందుగా ప్రచారం జరిగినట్లు జెనీవాలో శుక్రవారం దాకా ఆగలేదు. ముందుగా ఎలక్ట్రానికల్‌గా, ఆ తదుపరి జి–7 సమావేశానికై ఫ్రాన్స్‌లోని వర్సైల్స్‌లో ఉన్న అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు ఇమ్మాన్యూల్ మాక్రాన్ ఇచ్చిన విందులో స్వయంగా చిక్కని నల్లసిరా పెన్నుతో సంతకం చేశారు. మొదటి ప్రపంచ యుద్ధాన్ని ముగించిన ఒప్పందం కూడా వర్సైల్స్‌లో జరిగిన చారిత్రక సారూప్యత ఉంది. కాగా ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ టెహరాన్‌లో సంతకం చేశారు. ''ఒక చారిత్రక పత్రం'' గా అభివర్ణించిన ఆ పత్రాన్ని సోషల్ మీడియాలో పెట్టారు. ప్రపంచంలో క్రూడ్ ఆయిల్ రవాణాలో 20శాతం జరిగే హార్మోజ్ జలసంధిని ఇరాన్ మూసివేయటంతో ఆర్థిక సంక్షోభం అంచుకువెళ్లిన ప్రపంచ దేశాలు, ఈ ఒప్పందంతోపాటు హార్మోజ్ పాక్షికంగా తెరుచుకోవటం, ఇరాన్ ఓడలపై విధించిన దిగ్బంధనాన్ని అమెరికా ఎత్తివేయటంతో – ఒక్క ఇజ్రాయెల్ తప్ప – ఊపిరి పీల్చుకున్నాయి. ఈ తాత్కాలిక అవగాహనను 'ఇస్లామాబాద్ మౌ' అని పిలుస్తున్నారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య కటార్‌తోపాటు మధ్యవర్తిత్వం వహించి తాత్కాలిక అవగాహనను సాధించి యుద్ధ విరమణకు దోహదం చేసినందుకు పాకిస్థాన్‌కు ఆ ప్రతిష్ట దక్కింది. జెనీవా ఇప్పుడు, అవగాహన పత్రంలోని 14అంశాలను మరింత క్లిష్టమైన తుది ఒప్పందంగా మార్చే సాంకేతిక చర్చలకు వేదిక కానుంది. తుది ఒప్పందంపై సంతకాలు మహోత్సవం జెనీవాలో జరిగితే అది జెనీవా (స్విట్జర్లాండ్) చరిత్రలో అంతర్జాతీయ ఒడంబడికల జాబితాలో మరో మైలురాయి కాగలదు.

ఇరాన్ ఎన్నడూ అణ్వాయుధం తయారు చేయబోదనే హామీని అమెరికా సాధించటం ట్రంప్ విజయం. శుద్ధిచేసిన ఆయుధ గ్రేడ్ యురేనియంను శక్తిహీనం చేయటం ఎలా అన్నది తదుపరి చర్చల్లో కీలకాంశం. హోర్ముజ్ జలసంధిని తమ దేశంపై భవిష్యత్ దాడులకు నిరోధకంగా పరిగణిస్తున్న ఇరాన్ దానిపై తమ సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకోవటం ఇరాన్ విజయం. ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయటం, స్తంభింపజేసిన ఇరాన్ నిధుల విడుదల, ఇరాన్ పునర్నిర్మాణానికి 300 డాలర్ల నిధులను ప్రాంతీయంగా సమకూర్చటానికి ట్రంప్ అంగీకరించటం వగైరా ఇప్పటికైతే సంకల్పాల ప్రకటన. అవి అమలులోకి రావటమన్నది జెనీవా చర్చల్లో కుదిరే అంగీకారాలపై ఆధారపడి ఉంటుంది. ఇరాన్ మిస్సిలీల వ్యవస్థ అభివృద్ధిని నియంత్రించటం అవగాహన పత్రంలో చేర్చాలన్న ఇజ్రాయెల్ ఒత్తిడి ఫలించలేదు. అందువల్ల ఇల్లలుకగానే పండుగకానట్లు ఈ అవగాహన పత్రంతో సమస్యలన్నీ పరిష్కారం కావు. ఇదొక సదుద్దేశ రాజకీయ సంకల్ప ప్రకటన మాత్రమే. ●



2047 లక్ష్యాలకు ముందే 'సికిల్‌సెల్'ని నిర్మూలిస్తుంది

**భారతదేశం 2047 లక్ష్యానికి ముందే సికిల్ సెల్ వ్యాధిని నిర్మూలిస్తుంది. ముఖ్యంగా గిరిజన వర్గాలలో ఈ జన్యుపరమైన రక్త రుగ్మతపై అవగాహన పెంచి, దానిని నిర్మూలించడానికి సామూహిక కృషి చేయాలి. అన్ని రాష్ట్రాల సమష్టి బలం, చురుకైన భాగస్వామ్యంతో దేశం ఈ వ్యాధి నిర్మూలన జాతీయ లక్ష్యాన్ని నిర్దేశిత సమయం కంటే చాలా ముందుగానే సాధిస్తుంది. సాధారణ జనాభాతో పోలిస్తే గిరిజన వర్గాలలో సికిల్‌సెల్ అనీమియా వ్యాప్తి 7 రెట్లు అధికంగా ఉంది.**

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము





# జీవనశైలిని సరళతరం చేస్తున్న వై-ఫై టెక్నాలజీ

ప్రతి సంవత్సరం జూన్ 20న జరుపుకునే ప్రపంచ వైఫై దినోత్సవం (వరల్డ్ వైఫై డే), 'కనెక్టెడ్ కమ్యూనిటీస్ ఫోరమ్' నాయకత్వంలో 'వైర్‌లెస్ బ్రాడ్ బ్యాండ్ అలయన్స్' నిర్వహించే ఒక ప్రత్యేకమైన ప్రపంచవ్యాప్త కార్యక్రమం. 'వైఫై' అనేది 'వైర్‌లెస్ ఫిడిలిటీ'కి సంక్షిప్త రూపంగా విస్తృతంగా బోధించబడుతూ ఆమోదించబడింది. ఈ రోజున మన దైనందిన జీవితాలకు వైఫై అందించే గొప్ప సహకారాన్ని, ఆవిష్కరణను, ఇంటర్నెట్ సదుపాయం లేని వారిని అనుసంధానించాలనే లక్ష్యాన్ని మనం తీసుకుంటున్నాం. నేటికీ ప్రపంచవ్యాప్తంగా 4 బిలియన్లకు పైగా ప్రజలకు ఇంటర్నెట్ సదుపాయం లేదు. ఇంటర్నెట్ సదుపాయం అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజలకు వృద్ధిని అందిస్తుంది, వారి సామాజిక చలనశీలతను, కంప్యూటర్ అక్షరాస్యతను మెరుగుపరుస్తుంది, అలాగే వారి విద్యావకాశాలను సుసంపన్నం చేస్తుంది. ఈ దినోత్సవం 1997లో ప్రారంభమై ప్రతి ఏటా మరింత ఉత్సాహంతో కొనసాగుతున్నది.

**అనుసంధానం లేని వారిని అనుసంధానిద్దాం:**

ప్రపంచ వైఫై దినోత్సవం, డిజిటల్ అంతరాన్ని తగ్గించడంలో వైర్‌లెస్ టెక్నాలజీ పోషించిన పరివర్తనాత్మక పాత్రను వేడుకగా జరుపుకుంటుంది. అలాగే, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో 'అనుసంధానం లేని వారిని అనుసంధానించే' నిరంతర కార్యాన్ని ఇది ప్రముఖంగా చాటి చెబుతుంది. ఇంటర్నెట్ సదుపాయాన్ని అందుబాటు ధరలో, సుస్థిరంగా అందించే ప్రయత్నాలను ఇది హైలైట్ చేస్తుంది. తద్వారా, అణగారిన వర్గాలకు విద్య, పరిశోధన, టెలిహెల్త్, ఆర్థిక అవకాశాలను కల్పిస్తుంది. 1977 నాటి తొలి 2 Mbps నెట్‌వర్క్‌ల నుండి నేటి ఆధునిక గిగాబిట్‌స్పీడ్ వైఫై 6, వైఫై 7 టెక్నాలజీల వరకు వేగవంతమైన పురోగతిని ఈ రోజు గుర్తిస్తుంది. ఇటీవల ప్రారంభించిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ యొక్క 'పరివర్తన కోసం ఆవిష్కరణలు' (Innovate to Transform) అనే థీమ్‌కు అనుగుణంగా, ఈ సంవత్సరం ప్రపంచ వైఫై దినోత్సవ వేడుకలను 'భారతదేశాన్ని పరివర్తన చెందిస్తూ, ప్రపంచం కోసం ఆవిష్కరిస్తూ' (Transforming India, Innovating for the World) అనే థీమ్‌తో జరుపుకుంటున్నారు.

**ప్రధానమంత్రి వై–ఫై యాక్సెస్ నెట్‌వర్క్ ఇంటర్‌ఫేస్, PM-WANI:**

ప్రపంచ కనెక్టివిటీపై వైఫై యొక్క ప్రగాఢ ప్రభావాన్ని, అలాగే ఆర్థిక వృద్ధి, సామాజిక చైతన్యం, విద్య, డిజిటల్ సమ్మిళితాన్ని నడిపించడంలో దాని కీలక పాత్రను ఈ రోజు నొక్కి చెబుతోంది. భారతదేశంలో, PMWANI (ప్రధాన మంత్రి వైఫై యాక్సెస్ నెట్‌వర్క్ ఇంటర్‌ఫేస్) వంటి కార్యక్రమాలు, అందరికీ డిజిటల్ సమ్మిళితం అనే లక్ష్యానికి మద్దతునిస్తూ, పబ్లిక్ హాట్‌స్పాట్‌లను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. భారతదేశంలో 90 శాతానికి పైగా బ్రాడ్‌బ్యాండ్ వినియోగం వైఫై నెట్‌వర్క్‌ల ద్వారానే జరుగుతున్నందున, ఇటీవల 6 GHz బ్యాండ్‌ను డీలైసెన్సింగ్ చేయడం అనేది తదుపరితరం వైఫై (6E మరియు ఆపైన) యొక్క కొత్త శకాన్ని ఆవిష్కరిస్తుందని భావిస్తున్నారు. ఇది వేగవంతమైన, మరింత విశ్వసనీయమైన హోమ్ వైఫైకి, భవనాలలో మెరుగైన డిజిటల్ కనెక్టివిటీ కవరేజీకి, స్మార్ట్ సిటీలు, స్మార్ట్ ఫ్యాక్టరీల వంటి పరిశ్రమలలో ప్రైవేట్ నెట్‌వర్క్‌ల రంగంలో ఆవిష్కరణలకు అవకాశాలకు దారితీస్తుంది. 2030 నాటికి 5 కోట్ల పబ్లిక్ వైఫై హాట్‌స్పాట్‌లను సాధించాలనేది లక్ష్యం. 2015లో కోల్‌కతా భారతదేశపు మొట్టమొదటి వైఫై సౌకర్యం గల మెట్రో నగరంగా గుర్తింపు పొందింది. అయితే, వాణిజ్యపరమైన పూర్తి వైర్‌లెస్ పబ్లిక్ యాక్సెస్ విషయంలో, వారసత్వ నగరమైన మైసూరు 2005లోనే ఈ ఘనతను సాధించింది. జనవరి 2017లో, ప్రభుత్వ నిధులతో 500 పబ్లిక్ వైఫై హాట్‌స్పాట్‌లతో కూడిన భారీ నెట్‌వర్క్‌ను ప్రారంభించిన మొట్టమొదటి భారతీయ నగరంగా ముంబయి నిలిచింది.

ఇంటర్నెట్ ఎప్పటినుంచో మన దైనందిన జీవితంలో అంతర్భాగంగా మారిపోయింది. ఆఫీసులో ఆన్‌లైన్ పరిశోధన, వీడియో సమావేశాల నుండి వ్యక్తిగత సంభాషణలు, వినోదం వరకు మన జీవితంలోని ఎన్నో రంగాలు ఆన్‌లైన్‌లో భాగమవుతున్నాయి. వైఫై (WiFi) పుణ్యమా అని, చాలా ఆధునిక క్లయింట్ పరికరాలతో ఇదంతా వైర్‌లెస్‌గా సాధ్యమవుతోంది. ప్రపంచ వైఫై దినోత్సవాన్ని పురస్కరించుకుని, మనం ఈ సాంకేతికత, దాని చరిత్ర, భవిష్యత్తును నిశితంగా పరిశీలిద్దాం, ప్రశంసిద్దాం.

*(జూన్ 20న ప్రపంచ వై–ఫై దినోత్సవం సందర్భంగా)*

# ప్రత్యేక మత గుర్తింపును కోరుకుంటున్న ఆదివాసీలు



అన్నీ రాజా

ఒకవైపు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గిరిజన సాధికారత గురించి మాట్లాడుతున్నప్పటికీ, మరో వైపు అడవులను మైనింగ్, కార్పొరేట్ ప్రాజెక్టుల కోసం మళ్లిస్తూనే ఉన్నారు. ఆదివాసీలను ప్రతీకాత్మకంగా కీర్తిస్తున్నప్పటికీ, వారు ప్రత్యేక మత గుర్తింపు కోసం చేస్తున్న డిమాండ్‌లను పట్టించుకోవడం లేదు. గిరిజన వ్యక్తులు ఉన్నత రాజ్యాంగ పదవులను అధిష్టించినప్పటికీ, భూమి, జీవనోపాధి, సంస్కృతి, మతం, స్వయం పాలన వంటి లోతైన ప్రశ్నలు పరిష్కారం కాకుండానే మిగిలిఉన్నాయి.

అఖిల భారత ఆదివాసీ మహాసభ (ఆల్ ఇండియా ఆదివాసీ మహాసభ–ఎఐఎఎంఎస్)తో సహా గిరిజన ఉద్యమాల నుండి నేడు వినిపిస్తున్న అత్యంత ముఖ్యమైన ప్రజాస్వామ్య డిమాండ్లలో ఒకటి, జాతీయ జనగణనలో, అధికారిక రికార్డులలో ఆదివాసీలను ప్రత్యేక మత విభాగంగా గుర్తించటం. ఈ డిమాండ్ కేవలం పరిపాలనాపరమైనది కాదు, ఇది స్వదేశీ అస్థిత్వ మనుగడకు సంబంధించినది.

## హిందూమతం కంటే ఆదివాసీ మతాల ప్రత్యేకత

వ్యవస్థీకృత హిందూమతానికి పూర్వమే భారతదేశంలోని గిరిజన వర్గాలు గొప్ప వైవిధ్యంతో కూడిన ఆధ్యాత్మిక సంప్రదాయాలు, విశ్వాస ఆధారిత ఆచారాలను కలిగి ఉన్నాయి. దేశవ్యాప్తంగా గిరిజన సమూహాలు ప్రకృతిని, అడవులను, కొండలను, నదులను, పూర్వీకులను, కుల చిహ్నాలను పూజిస్తాయి.

వారి విశ్వాస వ్యవస్థలు పర్యావరణ సమతుల్యత, ఉమ్మడి సామాజిక జీవితంతో లోతుగా ముడిపడి ఉన్నాయి. సంతాల్‌లు సార్నా విశ్వాస సంప్రదాయాన్ని అనుసరిస్తారు. గోండ్లు పెర్సా పెన్, ఇతర దేశీయ దేవతలను పూజిస్తారు. మధ్య భారతదేశం, ఈశాన్య ప్రాంతం, జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌ఘఢ్, మహారాష్ట్ర, ఇతర ప్రాంతాలలోని వివిధ గిరిజన వర్గాలు తమ సొంత పవిత్రమైన వనాలను, ఆచారాలను, పండుగలను, విశ్వ దృక్పథాలను పాటిస్తాయి. వారి మతపరమైన ఆచారాలు కుల ఆధారంగా కాకుండా సామూహిక ఆధారంగా ఉంటాయి. ప్రకృతిని జయించాల్సిన విషయంగా కాకుండా, గౌరవప్రదమైన ఇచ్చి పుచ్చుకోవడాల ద్వారా సహజీవనం చేయాల్సిన అంశంగా చూస్తా రు.

వేదాల అధికారం, వర్ణాశ్రమ ధర్మం అనే భావన, కుల శ్రేణి, బ్రాహ్మణ పౌరోహిత్యం, పవిత్రత అపవిత్రత సిద్ధాంతం లేదా విస్తృతమైన ఆలయకేంద్రీకృత హిందూమత నిర్మాణానికి భిన్నం. గిరిజన మతాలు వాటిపై ఆధారపడి ఉండవు. వాస్తవానికి, గిరిజన వర్గాలు బ్రాహ్మణ సామాజిక వ్యవస్థకు వెలుపల ఉనికిలో ఉన్నాయి. చారిత్రాత్మకంగా వర్ణాశ్రమ వ్యవస్థ స్వరూపమే గిరిజన వర్గాలను దాని పరిధికి వెలుపల ఉంచింది. సాంప్రదాయ హిందూ గ్రంథాలు తరచుగా అటవీ ప్రజలను స్థిరపడిన కుల సమాజాని కి వెలుపలి వారుగా వర్గీకరించాయి. ఈ చారిత్రక బహిష్కరణ, అన్ని గిరిజన మతాలను విస్తృత హిందూ గుర్తింపు కింద విలీనం చేయాలనే సమకాలీన ప్రయత్నాలను అత్యంత సమస్యాత్మకంగా మారుస్తుంది. గిరిజన వర్గాలను చారిత్రకంగా కుల వ్యవస్థకు వెలుపలగా చూసినట్లయితే, ఈ రోజు వారిని హిందూమతంలో విడదీయరాని భాగంగా పేర్కొనడం చారిత్రక సత్యం కంటే రాజకీయ ప్రయోజనాలకే ఎక్కువ ఉపయోగపడుతుందని చాలామంది ఆదివాసీ విద్యావంతులు వాదిస్తున్నారు.

## జనగణనలో ఆదివాసీ కేటగిరీ

ప్రత్యేక మత గుర్తింపు డిమాండ్ ఇటీవల సంవత్సరాలలో ఊపందుకుంది. జనగణనలో 'ఆదివాసీ' అనే ప్రత్యేక కేటగిరి లేకపోవడంతో ప్రధాన మతాల జనాభా కృత్రిమంగా పెరిగిపోతోందని, అదే సమయంలో స్థానిక విశ్వాస సంప్రదాయాలు గణాంకపరంగా కనుమరుగవుతున్నాయని అఖిల భారత ఆదివాసీ మహాసభ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇటీవల కొనసాగుతున్న జనగణన ప్రశ్నావళిలో హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన, బౌద్ధ వంటి ఇతర ఐచ్ఛికాలతో పాటు 'ఆదివాసీ' ఐచ్ఛికం కోసం కూడా ఒక ప్రత్యేక కాలమ్‌ను కేటాయించాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్రపతికి అఖిల భారత ఆదివాసీ మహాసభ పోస్ట్ కార్డ్ ప్రచారోద్యమాన్ని నిర్వహించింది. వేలాది పోస్ట్ కార్డులు స్థానిక విశ్వాస సంప్రదాయాలను గుర్తించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పాయి. అలాగే గిరిజన సాంస్కృతిక హక్కుల పరిరక్షణకు పిలుపునిచ్చాయి. ఈ డిమాండ్ ప్రాథమికంగా ప్రజాస్వామ్యబద్ధమైనది.

జనగణనలో వర్గాలు కేవలం అంకెలు మాత్రమే కాదు, అవి విధానాలు, ప్రాతినిధ్యం, గుర్తింపును ప్రభావితం చేస్తాయి. అధికారిక రికార్డులలో ఒక మత గుర్తింపు లేనప్పుడు, పరిపాలనలో దాని ప్రత్యేక సమస్యలు తరచుగా విస్మరించబడతాయి. కాబట్టి ఒక ప్రత్యేక కాలమ్ కోసం చేసే డిమాండ్ అనేది గుర్తింపు, గౌరవం, రాజ్యాంగబద్ధమైన గుర్తింపు కోసం చేసే డిమాండ్. గడిచిన కొన్ని దశాబ్దాలుగా, గిరిజన ప్రాంతాలు సైద్ధాంతిక వివాదాలకు ముఖ్యమైన వేదికలుగా మారాయి. సంఘ్ పరివార్‌కు అనుబంధంగా ఉన్న అనేక సంస్థలు, పాఠశాలలు, వసతి గృహాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మతపరమైన కార్యకలాపాలు, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా గిరిజన ప్రాంతాలలో తమ ఉనికిని విస్తరించుకున్నాయి. స్థానిక పండుగలను హిందూ కథనాల ద్వారా ఎక్కువగా పునర్ వ్యాఖ్యానాలు చేస్తున్నారు. అదే సమయంలో స్థానిక దేవతలను హిందూ దేవుళ్ల తో గుర్తిస్తున్నారు. ఈ ప్రక్రియ సాంస్కృతిక స్వయంప్రతిపత్తిపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తోంది. గిరిజన వర్గాలు విస్తృత భారతీయ సమాజంతో మమేకమవ్వాలా వద్దా అనేది ఇక్కడ సమస్య కాదు. వారిని వారి సొంత పద్ధతులలో నిర్వచించుకోవడానికి అనుమతించాలా వద్దా అనేది ఇక్కడ అసలు సమస్య.

## ఆదివాసీలను అడవులకు దూరం చేస్తున్న విధానాలు

ఆదివాసీలకు, అడవులకు మధ్య ఉన్న సంబంధం కేవలం ఆర్థికపరమైనది మాత్రమే కాదు, అది నాగరికతకు సంబంధించినది. తరతరాలుగా, గిరిజన వర్గాలు తమ జీవనోపాధి, సంస్కృతి, వైద్యం, ఆహారం,





జనగణనలో ఆదివాసులకు ప్రత్యేక కాలం పెట్టాలని కోరుతూ రాష్ట్రపతికి వివిధ రాష్ట్రాలనుండి పోస్టుకార్డులు పంపుతున్న దృశ్యం

ఆధ్యాత్మికత కోసం అడవులపై ఆధారపడుతూనే వాటిని రక్షించుకున్నాయి. అయినప్పటికీ, అనేక అభివృద్ధి విధానాలు ప్రాథమికంగా అడవులను వెలికితీయాల్సిన ఆర్థిక వనరులుగానే పరిగణిస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి భారీ మైనింగ్ ప్రాజెక్టులు, ఆనకట్టలు, పారిశ్రామిక కారిడార్లు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు... లక్షలాది గిరిజన ప్రజల స్థానభ్రంశానికి దారితీశాయి. పర్యావరణ క్షీణతను నివారించిన గిరిజన వర్గాలపైనే అభివృద్ధి భారం అసమానంగా పడింది.

సమకాలీన ఆర్థిక విధానాలు అటవీ వనరులను బడా కార్పొరేట్ ప్రయోజనాల కోసం తరలించడాన్ని సులభతరం చేస్తున్నాయనేది వాస్తవం. స్థానిక ప్రతిఘటన ఉన్నప్పటికీ, అనేక గిరిజన ప్రాంతాలలో గనుల తవ్వకం, పారిశ్రామిక ప్రాజెక్టుల కోసం అటవీ భూముల కేటాయింపు కొనసాగుతోంది. దీని ఫలితంగా ఒక విషాదకరమైన వైరుధ్యం ఏర్పడింది. చారిత్రాత్మకంగా అడవులను పరిరక్షించిన వర్గాలను అభివృద్ధి పేరుతో తరచుగా వారి భూముల నుండి వెళ్లగొడుతున్నారు. అదే సమయంలో, పర్యావరణ క్షీణతకు గణనీయంగా దోహదపడే పరిశ్రమలు, అవే భూములను పొందుతున్నాయి.

ఆధునిక భారతదేశంలో గిరిజన హక్కులకు లభించిన అత్యంత ముఖ్యమైన విజయాలలో ఒకటి అటవీ హక్కుల చట్టం (ఎఫ్‌ఆర్‌ఎ) – 2006 ఆమోదం. ఈ చట్టం, భూమి, అటవీ ఉత్పత్తులు, సామాజిక వనరులపై గిరిజన వర్గాల హక్కులను గుర్తించడం ద్వారా, వారికి వ్యతిరేకంగా జరిగిన చారిత్రక అన్యాయాలను సరిదిద్దడానికి ప్రయత్నించింది. అఖిల భారత ఆదివాసీ మహాసభ, ఇతర ప్రజాస్వామ్య ఉద్యమాలు, ప్రగతిశీల రాజకీయ శక్తుల నిరంతర పోరాటాల ద్వారా ఈ చట్టం ఆమోదం పొందడం సాధ్యమైంది. అటవీ హక్కులకు మద్దతు కూడగట్టడంలో, కనీస ఉమ్మడి కార్యక్రమం ద్వారా ఈ చట్టాన్ని అమలు చేయాలని యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యుపిఎ–1) ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సహా వామపక్ష పార్టీలు కీలక పాత్ర పోషించాయి. ఆదివాసులను అడవులను ఆక్రమించేవారిగా చూడటం నుండి, వారిని అటవీ పర్యావరణ వ్యవస్థలకు చట్టబద్ధమైన సంరక్షకులుగా గుర్తించే దిశగా అటవీ హక్కుల చట్టం (ఎఫ్‌ఆర్‌ఎ) ఒక మార్పును సూచించింది. అయితే, అటవీ హక్కుల చట్టం అమలు అస్థిరంగానే ఉంది. పరిపాలనాపరమైన అడ్డంకులు, హక్కు తిరస్కరణ, కొనసాగుతున్న భూ వివాదాల కారణంగా అనేక వర్గాలు ఈ చట్టం ద్వారా పూర్తి ప్రయోజనం పొందలేకపోయాయి.

నేడు గిరిజన హక్కులను ప్రభావితం చేస్తున్న అత్యంత వివాదాస్పద సమస్యలలో ఒకటి, సంరక్షిత ప్రాంతాలు (ప్రొటెక్టెడ్ ఏరియాస్), పులి సంరక్షణ కేంద్రాల విస్తరణ. కానీ వాస్తవం ఏమిటంటే, అడవులలో పులులుతో పాటు గిరిజనులు మాత్రమే అక్కడ నివసించేవారు. కొందరు దురాశపరుల జోక్యం తర్వాతే వాటిని వేటాడటం మొదలైంది. దాంతో వాటి జనాభా పడిపోయింది. అనేక సందర్భాల్లో పులి సంరక్షణ కేంద్రాలలో లేదా వాటి చుట్టుపక్కల ఉన్న గ్రామాలు వేరే చోటికి తరలివెళ్లాలని ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సంరక్షణ విధానాలు తరచుగా మానవ ఉనికిని, వన్యప్రాణుల రక్షణను పరస్పరం సంబంధం లేనివిగా పరిగణిస్తాయని విమర్శకులు వాదిస్తున్నారు.

## అడవులను కాపాడుతున్న గిరిజనులు

తరతరాలుగా గిరిజన సమాజాలు సంరక్షిస్తున్న కారణంగానే అనేక పులి ఆవాసాలు మనుగడ సాగించాయి. సాంప్రదాయ అటవీ నిర్వహణ పద్ధతులు పవిత్రమైన తోటల రక్షణకు, నియంత్రిత కోత పద్ధతు లు, సమూహ సంరక్షణ జీవవైవిధ్య పరిరక్షణకు గణనీయంగా దోహదపడ్డాయి. గిరిజన సమాజాలను సంరక్షణ విధానం భాగస్వాములుగా గుర్తించాలే తప్ప, వారిని మినహాయించకూడదు. స్థానిక సమాజాలకు సురక్షితమైన హక్కులు, పరిపాలనలో అర్థవంతమైన భాగస్వామ్యం ఉన్నప్పుడు అడవులు మనుగడ సాగించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

గిరిజన వర్గాలకు సురక్షితమైన భూ హక్కులు, సక్రమంగా పనిచేసే స్థానిక ఆర్థిక వ్యవస్థలు, విద్య, ఆరోగ్య సంరక్షణ, ప్రజాస్వామ్య స్వయంపరిపాలన లభించినప్పుడు, వారు దుర్భరమైన వలసలకు గురికాకుండా అభివృద్ధిని సాధిస్తారు. గిరిజనులను ఉన్నత రాజ్యాంగ పదవుల్లో నియమించటాన్ని వారి సాధికారతకు నిదర్శనంగా ఆర్‌ఎస్ఎస్– బిజెపి ఆధ్వర్యంలోని ప్రస్తుత రాజకీయ వ్యవస్థ తరచుగా చూపిస్తుంది. కానీ నిజమైన సాధికారతను కేవలం ప్రతీకాత్మక నియామకాలకు పరిమితం చేయలేము. గిరిజన వర్గాల పట్ల నిబద్ధతకు నిజమైన కొలమానం వారి భూములు రక్షించబడుతున్నాయా, వారి అడవులు చెక్కుచెదరకుండా ఉన్నాయా, వారి భాషలు మనుగడ సాగిస్తున్నాయా, వారి మత సంప్రదాయాలను గౌరవిస్తున్నారా, వారి రాజ్యాంగ హక్కులు అమలు చేయబడుతున్నాయా అనే దానిపై ఆధారపడి ఉంటుంది. భారతదేశ అడవుల భవిష్యత్తు వాటి జీవవైవిధ్యం, పర్యావరణ సుస్థిరత గిరిజన వర్గాలతో గాఢంగా ముడిపడి ఉంది.

శతాబ్దాలుగా ఆదివాసులు అడవులకు వ్యతిరేకంగా కాకుండా వాటితో మమేకమై జీవించారు. వారి ఆధ్యాత్మిక సంప్రదాయాలు ఆధిపత్యానికి బదులుగా సహకారాన్ని బోధిస్తాయి. వారి జ్ఞాన వ్యవస్థలు ప్రకృతితో సుస్థిర సంబంధాలను కలిగి ఉంటాయి. అదే సమయంలో కొత్త అభివృద్ధి నమూనాలు వారితో మనుగడకు ఇబ్బంది పడుతున్నాయి. కాబట్టి గిరిజన వర్గాలను గౌరవించడమంటే కేవలం రాజకీయ సభలలో వారిని కీర్తించటానికి మించినది. దీని అర్థం వారి మతాన్ని గుర్తించడం, వారి భూములను రక్షించడం, వారి అడవులను కాపాడటం, ప్రత్యేక ప్రజలుగా ఉనికిలో ఉండే వారి హక్కును పరిరక్షించడం. ప్రత్యేక మత హోదా కోసం చేసే డిమాండ్... అంతిమంగా, రాజ్యాంగ గౌరవం, సాంస్కృతిక హుందాతనం, చారిత్రక న్యాయానికి అర్హమైన విశిష్ట గుర్తింపులను దేశ మూలవాసులు కలిగి ఉన్నారని గుర్తిస్తుంది.


# నిజమైన శరణార్థులకు సంఘీభావం తెలుపుదాం!

యుద్ధాలు, సంక్షోభాలు, హింసలు, పీడించడం, వాతావరణ ప్రతికూల మార్పులు, జాతి వివక్షలు, మత విద్వేషాలు, జాతీయత, కొన్ని సామాజిక లేదా రాజకీయ సంఘాల్లో సభ్యత్వాల కారణంగా ప్రాణభయంతో మరో దేశానికి వెళ్లి శరణు కోరి ప్రాణాలు కాపాడుకునే ప్రత్యేక వ్యక్తులు లేదా సమూహాలను శరణార్థులుగా నిర్వచిస్తాం. నేరుగా మరో దేశంలో శరణార్థులుగా చేరే వారు, ఆశ్రయం పొందే వారు, అంతర్గతంగా స్థానభ్రంశం పొందిన వారు, ఏ దేశానికి చెందని వారు, అనేక ఏళ్ల తర్వాత తిరిగి తమ దేశానికి చేరి వారందరూ శరణార్థుల జాబితాలో వస్తారు.

**ప్రపంచ శరణార్థి దినోత్సవం–2026 ఇతివృత్తం :**

శరణార్థులు, వారి పిల్లలు పడుతున్న అమానవీయ వేదనలను గుర్తించి ఐరాస తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏట 20 జూన్ రోజున ప్రపంచ శరణార్థి దినోత్సవం (వరల్డ్ రెఫ్యూజీ డే)ను 2001 నుంచి పాటించడం జరుగుతోంది. మరో దేశం నుంచి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వచ్చిన శరణార్థులు కూడా సాధారణ మానవులే అని, వారికి కూడా కనీస మానవ హక్కులు వర్తిస్తాయని, వారిలో ధైర్యాన్ని నింపడం, వారి పిల్లలకు విద్య వసతులు విస్తరించాలని, ఆకలి చావుల కోరల్లో చిక్కకుండా చూసుకోవాలని ప్రపంచ దేశాలకు అవగాహన కల్పించడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. 2026 ప్రపంచ శరణార్థి దినోత్సవం ఇతివృత్తంగా అందరు సురక్షితంగా ఉండే వరకు శరణార్థులకు సంఘీభావం ప్రకటిద్దాం అనే అంశాన్ని నిర్ణయించారు. 2026 శరణార్థి వారం ఇతివృత్తంగా సూపర్ పవర్‌గా పౌర సమాజం అనే అంశాన్ని తీసుకున్నారు.

శరణార్థులను కూడా సాధారణ పౌరులుగా చూడాలని, శత్రువులుగా భావించవద్దని ఐరాస సూచిస్తున్నది. శరణార్థుల పట్ల సహానుభూతి చూపడం, కనీస మానవ హక్కులను కల్పించడం, వారికి సంఘీభావంగా ప్రచారాలు నిర్వహించడం, వారి జీవిత కథలను వినడం, వారి అనుభవాలను అర్థం చేసుకోవడం, వారి పట్ల రాజకీయ ఏకీకరణ జరగడం, వారి అభ్యున్నతికి నిధులు కేటాయించడం, వారి మనోభావాలను అర్థం చేసుకోవడం లాంటివి నిత్యం కొనసాగాలి.





**భారత్‌లో శరణార్థుల సమస్యలు:** భారత్‌లోకి శ్రీలంక, మియాన్మార్, అఫ్ఘానిస్థాన్, టిబెట్, బంగ్లాదేశ్ లాంటి ఇరుగు పొరుగు దేశాల నుంచి వేలమంది శరణార్థులు భారత భూభాగంలోకి శరణార్థులుగా చేరడం కొనసాగుతున్నది. శ్రీలంకన్ తమిళులు, రెహింగ్యాలు, టిబెటన్లు, చక్మాహజోంగ్‌లు, జూయిష్ వర్గా లు అధిక సంఖ్యలో భారత్‌కు రావడం, శరణార్థులుగా జీవితాలను కొనసాగించుకోవడం జరుగుతూ కొన్ని సార్లు మన దేశంలో శాంతి భద్రతల సమస్యలకు కూడా కారణం అవుతున్నారని కూడా భావించడంతో జరుగుతోంది. 2022 వివరాల ప్రకారం, భారత్‌లో 46,000 మంది, అందులో 22,509 మంది రొహింగ్యాలు కూడా శరణార్థులు నమోదు అయినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. భారత్‌లో చేరిన శరణార్థులు అధిక శాతం పట్టణ ప్రాంతాల్లో స్థిరపడి అసంఘటిత పనుల్లో నిమగ్నం అవుతున్నారు. శరణార్థి కుటుంబాలకు చెందిన పిల్లలు 7 శాతం మాత్రమే విద్య కొనసాగిస్తున్నారని, 87 శాతం శరణార్థులు అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లోనే జీవిస్తున్నారని తెలుసుకోవాలి.

ప్రపంచ శరణార్థి దినోత్సవ వేదికగా నిజమైన శరణార్థులను గుర్తించి వారికి కనీస వసతులను కల్పించడం, దురుద్దేశంతో భారత్‌లోకి చేరిన శరణార్థులను ఏరిపారేయడం నిరంతరం జరగాలి.

నిస్సహాయ స్థితుల్లో శరణార్థులుగా చేరిన వారి కుటుంబాలకు కనీస అవసరాలు తీర్చడం, సహానుభూతితో వారికి గొడుగు పట్టడం, వారి పిల్లలకు చదువుకునే అవకాశాలు కల్పించడం, మానవీయ కోణంలో అక్కున చేర్చుకోవడం, వారికి వైద్య ఆరోగ్య వసతులు కల్పించం, వారిని మానవులుగా గౌరవించడం, సమానత్వ భావనలను ఆచరించడం, కనీస సహకారాలను అందించడం కొనసాగాలి. ఊహించని సందర్భాల్లో పరాయి దేశంలోకి చేరిన శరణార్థులకు మానవ హక్కుల గొడుగు పడదాం, వారి శ్రేయస్సుకు పాటు పడదాం.

*(20 జూన్ ప్రపంచ శరణార్థి దినోత్సవం సందర్భంగా)*

# 20 ప్రాంతాల్లో ఆధునిక 'ధాన్య సైలో'లు



- ధాన్యం నిల్వ వ్యవస్థ ఆధునీకరణకు ప్రభుత్వం చర్యలు
- రైతులకు ఇబ్బంది లేకుండా ప్రస్తుత కొనుగోలు వ్యవస్థ కొనసాగుతుంది
- ఎస్‌హెచ్‌జిలు, పిఎసిఎస్‌ల పాత్ర యథాతథం : మంత్రి ఉత్తమ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ధాన్యం నిల్వ వ్యవస్థను మరింత శాస్త్రీయంగా, ఆధునికంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రధాన వరి ఉత్పత్తి జిల్లాల్లో 20 ప్రాంతాల్లో అత్యాధునిక 'సైలో'ల ఏర్పాటుపై ప్రభుత్వం పరిశీలన చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రధాన వరి ఉత్పత్తి జిల్లాల్లో సైలోల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలు, నిల్వ సామర్థ్యాలు, పెట్టుబడి వ్యయం, అమలు విధానాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని మంత్రి సంబంధిత సంస్థలను ఆదేశించారు. డాక్టర్ బిఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శుక్రవారం ధాన్య నిల్వ, రవాణా రంగానికి చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ సైలోలు ప్రస్తుతం అమలులో ఉన్న ధాన్యం కొనుగోలు, నిల్వ వ్యవస్థలకు ప్రత్యామ్నాయం కాదని, వాటికి అనుబంధంగా పనిచేసే ఆధునిక మౌలిక వసతులుగా ఉపయోగపడతాయని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో వరి ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు ప్రతి ఏడాది పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిల్వ సామర్థ్యాలను కూడా పెంచాల్సిన అవసరం ఉందని, అందులో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సైలోల ఏర్పాటును ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ప్రారంభ దశలో 50 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో సైలోల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసే అవకాశాలను అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. 'తెలంగాణలో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో స్వయం సహాయక సంఘాలు, ఐకెపి కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. భవిష్యత్తులో కూడా వారి పాత్ర కొనసాగుతుంది. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రస్తుత కొనుగోలు వ్యవస్థను కొనసాగిస్తూనే ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేస్తాం' అని మంత్రి చెప్పారు. సమావేశంలో పాల్గొన్న సాంకేతిక నిపుణులు ఆధునిక సైలోల ద్వారా ధాన్యం స్వీకరణ నుంచి నిల్వ, రవాణా వరకు మొత్తం ప్రక్రియను ఆటోమేటెడ్ పద్ధతిలో నిర్వహించవచ్చని వివరించారు. డిజిటల్ నాణ్యత పరీక్షలు, యాంత్రిక అన్‌లోడింగ్, సెన్సార్ ఆధారిత పర్యవేక్షణ, శాస్త్రీయ నిల్వ విధానాల ద్వారా ధాన్య నాణ్యతను దీర్ఘకాలం కాపాడవచ్చని తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలు, నిల్వ కేంద్రాల వద్ద ఎదురవుతున్న కార్మికుల కొరత, రవాణా ఆలస్యం వంటి సమస్యలకు కూడా ఈ వ్యవస్థ సమర్థవంతమైన పరిష్కారం చూపగలదని మంత్రి అభిప్రాయపడ్డారు. రైల్వే అనుసంధానంతో కూడిన ఆధునిక లాజిస్టిక్స్ వ్యవస్థ ద్వారా ధాన్యాన్ని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, దేశవ్యాప్తంగా వినియోగ కేంద్రాలకు వేగంగా తరలించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. 'ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా, పంపిణీ వ్యవస్థలను మరింత బలోపేతం చేసి రైతులకు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యంగా సాంకేతికతను వినియోగిస్తూ వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతాం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# ఆదాయ వనరుల రంగాలపై ప్రత్యేక దృష్టి



- ఆదాయ వనరుల సమీకరణపై మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వానికి ఆదాయ వనరులు తీసుకువచ్చే రంగాలపై పూర్తిగా దృష్టి పెట్టాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో టూరిజం ఆస్తులు పూర్తి స్థాయిలో వినియోగంలో లేవని, వాటిని పిపిపి మోడల్‌లో అభివృద్ధి చేసి సంపద సృష్టించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచనలు చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆదాయ వనరుల సమీకరణపై మంత్రి వర్గ ఉప సంఘం సమావేశమైంది. సమావేశంలో కమిటీ సభ్యులైన మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలోని పర్యాటక సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాల్సిన అవరం ఉందన్నారు. పర్యాటక కేంద్రాల్లోని ప్రభుత్వ భూములు, స్థలాలను సమర్థవంతంగా వినియోగించి ఖజానాకు ఆదాయాన్ని తీసుకురావాలని సూచించారు. గోవా, కేరళ వంటి రాష్ట్రాలు పర్యాటకాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటున్నాయని, ఆ రాష్ట్రాల్లో ప్రజలకు ఉపాధిని కల్పించడమే కాకుండా జిడిపి పెరుగుదలకు టూరిజం ఉపయోగపడుతోందని, తెలంగాణ రాష్ట్రంలోనూ టూరిజాన్ని అలాగే అభివృద్ధి చేయాలని అధికారులకు ఆయన సూచించారు. టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హెల్త్ టూరిజం రంగాల్లో మరింత దూకుడుగా ముందుకు వెళ్లాలని డిప్యూటీ సిఎం అన్నారు. వారాంతాల్లో హెలీకాప్టర్ టూరిజాన్ని పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్‌లో పర్యాటకాన్ని అభివృద్ధి చేసే ప్రాజెక్టులు చేపట్టాలన్నారు. ఆదాయ సమీకరణలో పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతులు, అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి లక్ష్యాల సాధనలో పర్యాటకం కీలక పాత్ర పోషిస్తుందని, పిపిపి ఆధారిత సమగ్ర పర్యాటక అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, అందుకు సంబంధించిన విధానపరమైన అంశాలను కేబినెట్ ముందుంచాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని అధికారులు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా స్లాబ్ అధారిత భూముల విలువ సవరణ వల్ల మెరుగైన ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. బిహెచ్ సిరీస్ పన్నుల అంశంపై చర్చించేందుకు దక్షిణాది రాష్ట్రాల రవాణా మంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశ్రమల శాఖకు సంబంధించి పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ కార్యక్రమాల ద్వారా ఆదాయ సమీకరణను సమీక్షించారు.

### నిబంధనలు పాటించే క్రషర్లకు అనుమతులు ఇవ్వాలి

లోయర్ మానేరు, అప్పర్ మానేరు, మేడిగడ్డ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పూడికతీత పనులపై కేబినెట్ సబ్ కమిటీ సమీక్ష చేసింది. చట్టపరమైన నిబంధనలు పాటించే క్రషర్లకు అనుమతులు ఇవ్వాలని సబ్ కమిటీ అభిప్రాయపడింది. నది ఇసుకతో పోలిస్తే రోబో శాండ్ తక్కువ ధరకు లభిస్తోందని సబ్ కమిటీ గుర్తించింది. ఇరుగు పొరుగు రాష్ట్రాలకు ఇసుకను ఎగుమతి చేయడంపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు.


# ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కోటాలు, విధివిధానాల మేరకే తెలంగాణలో ధాన్యం కొనుగోలు చేస్తామన్న రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాన్ని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నిర్ణయం రైతాంగాన్ని వంచించడమేనని ఆయన విమర్శించారు. కేంద్రం విధించిన పరిమితులతో సంబంధం లేకుండా, తెలంగాణలో రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరతో రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులపై కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న వివక్షకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష పార్టీలను కలుపుకొని పోరాటం చేయాలన్నారు. కేంద్రం కోటాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకోకూడదని, గతంలో రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగం దెబ్బతింటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందని హెచ్చరించారు. క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే పునఃసమీక్షించి రైతులకు అనుకూలంగా కొత్త విధానాన్ని ప్రకటించాలని నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవ వేడుకలను టిపిసిసి ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ రాహుల్ గాంధీ జన్మదినం కేక్‌ను కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి, పలువురు పిసిసి సభ్యులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు.

**జాబ్ మేళాకు నిరుద్యోగ యువత నుండి విశేష స్పందన**

రాహుల్ గాంధీ జన్మదినోత్సవం సందర్భంగా రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మేగా జాబ్ మేళాను నిర్వహించారు. ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు ఎంపి ఎం.అనిల్ కుమార్ తెలిపారు. ఈ మెగా జాబ్‌మేళాలో ఐటీ, నాన్‌ఐటీ, బ్యాంకింగ్, ఫార్మా తదితర విభిన్న రంగాలకు చెందిన 100కు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొనగా వెయ్యి మందికి పైగా అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ రాహుల్ గాంధీ జన్మదినోత్సవ కేక్‌ను కట్ చేసి జాబ్ మేళాలో ఎంపికైన తన చేతుల మీదుగా నియామక పత్రాలు (ఆఫర్ లెటర్లు), సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశ యువతకు ఉపాధి, అవకాశాల కల్పనే రాహుల్‌గాంధీ ప్రధాన లక్ష్యమని అన్నారు. జాబ్ మేళాలో పాల్గొన్న యువతకు శుభాభినందనలు తెలియజేస్తూ, యువతే దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి అని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ దేశంలోని నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న నాయకుడని ఆయన అన్నారు. ఉద్యోగ నియామక పరీక్షలలో తరచూ జరుగుతున్న పేపర్ లీకేజీల కారణంగా లక్షలాది మంది యువత తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపి అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అండగా నిలవాలన్న రాహుల్ గాంధీ ఆశయాల ప్రకారమే ఈ జాబ్ మేళా నిర్వహించామని తెలిపారు. ఇంతటి భారీ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు, అలాగే ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ, కంపెనీల ప్రతినిధులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని వేడుకలను టిపిసిసి డాక్టర్ సెల్ ఆధ్వర్యంలో గాంధీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించి ప్రసంగించారు.

# 23న కలెక్టర్ కార్యాలయాల వద్ద ప్రదర్శనలు, ధర్నాలు

- బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యులు వెంకట్రాములు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'విబి జీ రామ్ జీ పథకం' రద్దుచేసి 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని'పునరుద్ధరించి అమలు జరపాలని డిమాండ్ చేస్తూ జూన్ 23వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించనున్నట్లు బికెయంయు జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ ఆందోళన కార్యక్రమాలలో ఉపాధి కార్మికులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఇటీవల ఒంగోలులో జరిగిన బికెయంయు జాతీయ సమితి సమావేశాలలో వ్యవసాయ కార్మిక డిమాండ్ల సాధనకు దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సమస్యల పరిష్కారానికి పోరాటాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ నెల 23వ తేదీన అన్ని జిల్లాలలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ, పనులకు నిధులను కోత పెడుతూ కూలీల నోట్లో మట్టికొడుతున్నదని వారు విమర్శించారు. ఎన్నోపోరాటాల ద్వారా సాధించుకున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రద్దుచేసి విబి జి రామ్‌జీని తెచ్చి వ్యవసాయ కార్మికులకు గ్రామీణ పేదలకు తీరని అన్యాయం చేసిందని, పని హక్కుగా ఉన్న చట్టాన్ని రద్దు చేసి పథకంగా మార్చిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పరీక్షల నిర్వహణలో కేంద్రం ఘోర వైఫల్యం

- విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ పోరాటం
- టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం కలిగిన వ్యక్తులు విద్యా వ్యవస్థలోకి ప్రవేశించడం వల్ల విద్యా రంగం దారి తప్పిందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. దేశంలో పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాల కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు రేయింబవళ్లు కష్టపడి పరీక్షలు రాస్తుంటే ప్రభుత్వ వైఫల్యాల కారణంగా వారి శ్రమ వృథా అవుతోందన్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విద్యావ్యవస్థలో సమగ్ర సంస్కరణలు అవసరమని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థ, ఉపాధి రంగాల్లో నెలకొన్న సంక్షోభంపై కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు సంగిశెట్టి జగదీష్, ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్ పాల్గొన్నారు. సమావేశంలో మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలు నెరవేరేలా కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్ర స్థాయికి చేరుకుందని, ఉద్యోగ అవకాశాలు లేక యువతలో ఆందోళన పెరుగుతోందని మహేష్‌కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. రాజకీయ పరిణామాలపై స్పందిస్తూ, 'కమల కల్యాణాలు వచ్చినా మాకేం నష్టం లేదు' అని మహేష్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, యువత ఆకాంక్షలకు ప్రతీకగా రాహుల్ గాంధీ నిలుస్తున్నారని పేర్కొన్నారు. యువత మనోభావాలను అర్థం చేసుకుని వారి సమస్యలపై పోరాటం చేస్తున్న నాయకులు రాహుల్ గాంధీయేనని అన్నారు.

# రాష్ట్రంలో వర్షాలు.. వడగాడ్పుల హెచ్చరిక

- మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు
- వివరాలు వెల్లడించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేసిన వాతావరణ బులెటిన్‌లో ఈ వివరాలు తెలిపారు. అధికారుల అంచనా ప్రకారం, శనివారం రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందన్నారు. అదే సమయంలో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాలుల ప్రభావం కొనసాగుతుందన్నారు. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. అదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. శనివారం నుంచి మంగళవారం వరకు రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కొనసాగే అవకాశముందన్నారు. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, హనుమకొండ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట తదితర జిల్లాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉండొచ్చన్నారు. జూన్ మంగళవారం నుంచి శుక్రవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, దాదాపు అన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు సంభవించే అవకాశముందన్నారు.

**ఉష్ణోగ్రతలు తగ్గుముఖం**

రాబోయే రెండు రోజుల పాటు రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని, అనంతరం మూడు రోజుల పాటు ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశముందని తెలిపారు. ప్రస్తుతం ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, పెద్దపల్లి తదితర జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు అవుతాయని, హైదరాబాద్ సహా రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 నుంచి 40 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉంటాయన్నారు.



# విఓఎ, ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎంపి వేం నరేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న విఓఎ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం గచ్చిబౌలిలోని రోలింగ్ హిల్స్ నివాసంలో ఐఎన్‌టీయూసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, ఐకెపి విఓఎ సంఘం, ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ గౌరవ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి నేతృత్వంలో అన్ని జిల్లాల అధ్యక్షుల బృందం వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విఓఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఆయనకు ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఎంతో శ్రమిస్తున్న ఉద్యోగుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. ఐకెపి విఓఎలతో పాటు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా కనీస వేతనం నెలకు రూ.26,000 చెల్లించాలని, రెండు విభాగాల ఉద్యోగులకు పూర్తి ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యం కల్పించడంతో పాటు ఎఫ్‌టిఈ లాంటి ప్రయోజనాలను చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. దీంతో వేం నరేందర్ రెడ్డి స్పందిస్తూ విఓఏలు, ఫీల్డ్ అసిస్టెంట్ల న్యాయమైన సమస్యలను పంచాయతీరాజ్ కమిషనర్ దానకిషోర్‌తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఐఎన్‌టియూసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నాగన్న గౌడ్‌తో పాటు వివిధ జిల్లాల సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# యువశక్తే వికసిత భారత్‌కు పునాది

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఏ దేశానికైనా అసలైన బలం, భగవంతుడు ఇచ్చిన గొప్ప వరం యువశక్తి, శ్రామిక శక్తి అని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా (వికసిత భారత్) మార్చేందుకు 140 కోట్ల మంది ప్రజలు సాగిస్తున్న ప్రయాణం అత్యంత కీలక దశకు చేరుకుందన్నారు. హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లోని ఆర్‌టిసి కళాభవన్‌లో నిర్వహించిన 'ప్రధాన మంత్రి విక్షత్ భారత్ రోజ్‌గార్ యోజన' కార్యక్రమంలో కేంద్రమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొనగా, రాష్ట్ర కార్మిక శాఖమంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, కార్మికశాఖ కార్యదర్శి దాసరి హరిచందన హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ప్రధానమంత్రి ప్యాకేజీలో భాగంగా, యువత ఆశయాలకు, పారిశ్రామిక అవసరాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడానికి 'ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్'ను తీసుకువచ్చినట్లు తెలిపారు. 'కార్మికులకు గౌరవం, యువతకు భరోసా, యజమానులకు వృద్ధి అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. మొత్తం రూ. 99,446 కోట్ల వ్యయంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా రెండేళ్ల కాలంలో 3.5 కోట్లకు పైగా ఉద్యోగాలను కల్పించి, ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు.

**తొలిసారి ఉద్యోగులకు రూ.15,000 ఆర్థిక ఊతం**

మొట్టమొదటిసారిగా ఫార్మల్ ఎంప్లాయిమెంట్‌లో చేరే యువతకు పని నైపుణ్యాలు నేర్చుకునేందుకు, కొత్త వాతావరణానికి అలవాటు పడేందుకు ఈ పథకం కింద ఒకేసారి రూ.15,000 వరకు ప్రోత్సాహకాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని మంత్రి వివరించారు. అలాగే, అదనపు ఉపాధి కల్పించే యజమానులకు కూడా రెండేళ్లపాటు కేంద్రం మద్దతు ఇస్తుందని, భారీగా ఉద్యోగాలు కల్పించే తయారీ రంగానికి ప్రత్యేకంగా నాలుగేళ్లపాటు ఈ మద్దతు ఉంటుందన్నారు. తెలంగాణలో ఈ పథకానికి అద్భుత స్పందన వస్తోందని, ఇప్పటికే 25 వేలకు పైగా సంస్థలు ఉపాధి కల్పిస్తామని పేర్లు నమోదు చేసుకోగా, 18 వేలకు పైగా సంస్థలు అదనపు ఉద్యోగాలు కల్పించి లబ్ధి పొందుతున్నాయన్నారు.

### కార్మిక సంస్కరణలతో ప్రపంచ స్థాయి ప్రమాణాలు

పాత కాలం నాటి 20 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 4 నూతన లేబర్ కోడ్స్ తీసుకురావడం ద్వారా ఆధునిక కార్మిక వ్యవస్థకు పునాది వేశామన్నారు. దీనివల్ల కార్మికులకు మెరుగైన వేతనాలు, సామాజిక భద్రత, పిఎఫ్, గ్రాట్యుటీల్లో యజమానుల వాటా పెరిగి కార్మికులకు ఆర్థిక భద్రత, గౌరవం లభించాయని చెప్పారు. డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలను ఈ 'వికసిత భారత్ రోజ్‌గార్ యోజన' అనుసంధానిస్తూ గేమ్ ఛేంజర్‌గా మారిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈ జాతీయ యజ్ఞంలో భాగస్వాములైన లబ్ధిదారులకు, పరిశ్రమల అధినేతలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, బడంగ్‌పేట్ సర్కిల్-16**

టెండర్ నోటీస్ నెం. Engg/08/2026-27/62, తేది: 19-06-2026, పని పేరు: నాదర్‌గుల్ డివిజన్ (57, 61 & 62) పరిధిలో CC రోడ్డు నిర్మాణం; పారిశుధ్య అనుబంధ సిబ్బంది కోసం క్యాబిన్‌ల పునరుద్ధరణ మరియు విభజన; 600 మి.మీ వ్యాసం కలిగిన NP-3 RCC పైప్‌లైన్ ఏర్పాటు మరియు దెబ్బతిన్న CC రోడ్డు భాగాల పునరుద్ధరణ; అలాగే బోర్ మోటార్ల మరమ్మతులు మరియు నిర్వహణ మరియు బోర్‌వెల్స్ ఫ్లషింగ్, బావుల లోతు పెంచే పనులు, **అంచనా విలువ:** రూ.106.54 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 30-06-2026 మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు మరియు చిరునామా:** శ్రీ డి.కిస్టప్ప, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బడంగ్‌పేట్ సర్కిల్-16. eec16.badangpet@gmail.com, 500038, ఫోన్ నెం. 9849906776. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in/login.htmlలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బడంగ్‌పేట్ సర్కిల్-16, జిహెచ్ఎంసి, శంషాబాద్ జోన్.

DIPR R.O. No. : 4601-PP/CL/ADVT/2026-27, Date: 19-06-2026

**పురపాలక సంఘ కార్యాలయం, నందికొండ, జిల్లా : నల్లగొండ**

లేఖ నం.E1/03/MCN/2026, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్** తేది: 19.06.2026

పురపాలక సంఘం, నందికొండ - Development Works - Construction of CC Roads from Veena House to Bypass Main Road in Nandikonda Municipality under MPLADS నుండి చేయుటకు అర్హత కలిగిన రిజిస్టర్ కాంట్రాక్టర్స్ నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి.

| | |
|---|---|
| 1. యస్.ఐ.టి.నెం. | : MCN/E1/03/2026, తేది: 18.06.2026 |
| 2. పనుల సంఖ్య | : 1 |
| 3. పనుల విలువ | : 1.85 లక్షలు |
| 4. బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ మొదలు తేది | : తేది: 22.06.2026 ఉదయం గం.11:00 ని.ల నుండి |
| 5. బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ చివరి తేది | : తేది: 29.06.2026 సాయంత్రం గం.03:00ని.ల వరకు |
| 6. టెండర్లు స్వీకరించు చివరి తేది | : తేది: 29.06.2026 సాయంత్రం గం.03:30 ని.ల వరకు |
| 7. బిడ్ ఓపెనింగ్ తేది | : తేది: 30.06.2026 సాయంత్రం గం.05:00 ని.లకు |

టెండర్ నోటీస్ వివరములకు వెబ్ సైట్ www.eprocurement.gov.in ద్వారా తెలుసుకోగలరు. మరియు ఇతర వివరములకు కార్యాలయము పని వేళలో ఇంజనీరింగ్ విభాగము నందు సంప్రదించగలరు.

సం/- మునిసిపల్ కమీషనర్, పురపాలక సంఘం, నందికొండ.

DIPR R.O. No. : 4598-PP/CL/ADVT/2026-27, Date: 19-06-2026

# ప్రైవేటుపై నియంత్రణ ఏదీ...?

● పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలు ● రకరకాల పేర్లతో దోపిడీ
● నిబంధనలకు పాతర -ఉలుకు పలుకులేని విద్యాశాఖ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** విద్య వ్యాపార వస్తువుగా మారింది. దీనికి తోడు తల్లిదండ్రులకు ప్రైవేటుపై ఉన్న మోజు వెరసి విద్య లాభసాటి వ్యాపారంగా మారింది. ఇదే సమయంలో ప్రైవేటు విద్యపై ప్రభుత్వం నియంత్రణ కోల్పోవటంతో విద్యా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. ప్రభుత్వ బలహీనత చేయి కలుపుతున్న విద్యాశాఖాధికారులను ఆసరాగా చేసుకుని రకరకాల పేర్లతో పుట్టగొడుగుల్లా విద్యా సంస్థలు పుట్టుకొస్తున్నాయి. అన్ని ప్రైవేటు విద్యా సంస్థలను ఒక గాటిన కట్టేయ్యలేం కానీ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ధనార్జనే ధ్యేయంగా వ్యవహరించే విద్యా సంస్థల పట్ల చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**నిబంధనలకు తూట్లు :**
ప్రభుత్వ నిబంధనలకు లోబడి విద్యా సంస్థలను నిర్వహించాల్సి ఉంటుంది. మూడొంతుల ప్రైవేటు విద్యా సంస్థలు నిబంధనలకు తూట్లు పొడిచి అక్రమ పద్ధతిలో అనుమతులు పొందుతున్నాయి. ప్రైమరీ విద్యార్థులకు బహుళ అంతస్తుల్లో తరగతులు నిర్వహించకూడదన్న నిబంధనలను పట్టించుకోవడం లేదు. మౌలిక వసతులు, ఆట స్థలాలు అన్నింటికి మించి అర్హత కలిగిన ఉపాధ్యాయుల నియామకం జరగడం లేదు. గుర్రం గుడ్డిదైనా దానా తక్కువ లేదన్నట్లు అర్హత కలిగిన బోధనా సిబ్బంది లేక పోయినా ఫీజులు మాత్రం తగ్గడం లేదు.

**ఫీజులపై నియంత్ర ఏదీ :**
ప్రైవేటు విద్యా సంస్థల ఫీజుల వసూళ్లపై నియంత్రణ లేదు. రకరకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను పీల్చిపిప్పి చేస్తున్నారు. అదేమంటే సవా లక్ష కారణాలు చూపుతూ మా సంస్థలో ఇలానే ఫీజులు ఉంటాయి మీ ఇష్టం అంటున్నారు. కొన్ని విద్యా సంస్థలు విద్యా సంస్థల్లో చేరేటప్పుడు చెప్పే ఫీజుకు ఆ తర్వాత వసూలు చేసే దానికి సంబంధం ఉండటం లేదు. అడ్మిషన్ ఫారంపై పెన్సిల్‌తో రాసి ఆ తర్వాత దానిని దిద్ది ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. లాభాల కోసమే పనిచేస్తున్న సంస్థలు షూ, యూనిఫాం, పుస్తకాలు మా వద్దనే కొనుగోలు చేయాలని నిబంధన విధిస్తూ వీలైనంత మేర దోచుకునే పనిలో ఉన్నారు.

**కొరవడిన పర్యవేక్షణ :**
ప్రైవేటు విద్యా సంస్థలపై విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఎటువంటి పరిశీలన లేకుండానే అనుమతులు ఇచ్చేస్తున్నారు. బోధన సిబ్బందికి సంబంధించి



అర్హత కలిగిన ఉపాధ్యాయుల పేర్లనే పలు విద్యా సంస్థలు తమ బోధన సిబ్బందిగా చూపుతున్నాయి. అయినా పట్టింపు లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరగడం లేదు. విద్యాశాఖాధికారులను ప్రైవేటు విద్యా సంస్థలు శాసిస్తున్నాయి. కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వాలనే శాసిస్తున్న తరుణంలో విద్యాశాఖాధికారులను శాసించడం పెద్ద విషయం కాక పోవచ్చు. తల్లిదండ్రుల్లో ప్రైవేటుపై ఉన్న మోజును బలహీనతగా మార్చుకుని సొమ్ము చేసుకుంటున్నారు. అతి పెద్ద దోపిడీకి తెరలేపిన కొన్ని విద్యా సంస్థల పట్ల తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. నిబంధనల విషయంలో క్షేత్ర స్థాయి పరిశీలన జరగాలన్న మంత్రుల మాటలు బేఖాతారైంది. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు మత్తు వీడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## 'సర్' ప్రక్రియను నిర్వహించాలి

ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలు నమోదు చేయాలి:ఐటిడిఎ పిఒ బి.రాహుల్



**ప్రజాపక్షం/అశ్వాపురం:**ఈనెల 25 నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, పినపాక నియోజకవర్గ ఎన్నికల అధికారి బి రాహుల్ బిఎల్ఓలు, బిఎల్ఎ సూపర్వైజర్లకు సూచించారు. శుక్రవారం అశ్వాపురం రైతు వేదికలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జూన్ 25 నుంచి జూలై 24 వరకు జరిగే సర్వేలో ఎన్యూమరేషన్ ఫారాలను ఖచ్చితమైన వివరాలతో పూరించి సేకరించాలని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పని సరిగా పాటించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు ప్రక్రియను పాదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ అనూష, మాస్టర్ ట్రైనర్ హరమయ్య, బీఎల్‌వోలు, బిఎల్ఎ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## మట్టి టిప్పర్ సీజ్..



**ప్రజాపక్షం/జూలూరుపాడు:**జూలూరుపాడు మండల కేంద్రంలోని పాపకొల్లు క్రాస్ రోడ్డు నందు ఓవర్ లోడుతో వెళ్తున్న మట్టి టిప్పర్‌ను శుక్రవారం కొత్తగూడెం రవాణా శాఖ మొబైల్ స్క్వాడ్ అధికారి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ (ఏ.ఎం.వి.ఐ) అశోక్ పట్టుకొని సీజ్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా ఏ. ఎం.వీ.ఐ అశోక్ మాట్లాడుతూ నలుగురు ఇన్స్పెక్టర్లతో కూడిన మొబైల్ స్క్వాడ్, భద్రాద్రి జిల్లాల్లో ప్రత్యేక తనిఖీలు చేపపడుతున్నామని గత వారం రోజులుగా తనిఖీలు చే పట్టి ఆరు టిప్పర్ లారీలను సీజ్ చెయ్యటం జరిగిందని వాహనదారుల వద్ద ధ్రువపత్రాలు సరిగ్గా లేకపోయినా, పన్నులు చెల్లించకపోయినా, అధిక లోడుతో వెళ్లినా కేసులు నమోదు చేస్తూ అవసరమైతే వాహనాలను సీజ్ చేస్తున్నామని తెలిపారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** పురపాలక పరిధిలోని మహాప్రస్థానం, అంతర్గత మురుగు కాలువ నిర్మాణ పనులను అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ శుక్రవారం పరిశీలించారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సామ్యూల్ ఇజ్రాయిల్ పాల్, ఛైర్ పర్సన్ సామినేని సుజాత, వైస్ ఛైర్మన్ కోనా దని, 17వ వార్డు కౌన్సిలర్ ములకలపల్లి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఎఐసిసి మాజీ అధ్యక్షులు, పార్లమెంటరీ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను రఘునాథపాలెం మండల కమిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం మండల అధ్యక్షులు దేవ్‌సింగ్ అధ్యక్షతన రఘునాథపాలెంలోని యాపిల్ సెంటర్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మదిన కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆత్మ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బానోత్ కోటేష్ నాయక్, సర్పంచ్‌లు గాజుల కృష్ణారావు, కోటేరు వెంకట రెడ్డి, ఉపసర్పంచ్ బండి వెంకన్న, మాజీ ఎంపిపి మధు, దశరథ్, నాయకులు రామారావు, నరేష్, చరణ్ పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరలకు కేంద్రం నిర్ణయించిన మేరకే కొనుగోలు చేస్తామని మొత్తం వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయలేమని చెప్పడం రైతాంగ వ్యతిరేక చర్య అని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్ధతు ధరలు శాస్త్రీయ పద్ధతిలో లేవని పెట్టుబడి ఆధారంగా మద్ధతు ధరల నిర్ణయాలు జరగడం లేదన్నారు. అటువంటిది మద్ధతు ధరల ప్రకారం కూడా వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయకపోతే రైతుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్ల విషయంలో పునరాలోచన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మొత్తం కొనుగోలు చేసేలా ప్రణాళిక రూపొందించాలని గోవిందరావు కోరారు. మొక్కజొన్నలు కొనుగోలు చేసిన రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని, కల్తీ విత్తనాల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలని ఆయన కోరారు. రైతు భరోసాను రైతులకు సకాలంలో అందిస్తే హర్షిస్తారని ఆయన తెలిపారు.

## అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయండి

ఎంపికి వినతి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం సమీపంలోని నాగార్జున సాగర్ ఎడమ కాలువకు ప్రజల సౌకర్యార్థం అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డికి శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. బైపాస్ రోడ్డు రాపర్తి నగర్ నుంచి రామన్నపేట, దానవాయిగూడెం, రాపర్తి నగర్ బిసి కాలనీ, టిఎన్‌జీవోస్ కాలనీ మీదుగా వెళ్లే రోడ్డు డంపింగ్ యార్డు వద్ద కలుస్తుందని వారు వినతి పత్రంలో తెలిపారు. సాగర్ కాలువపై అండర్ బ్రిడ్జి నిర్మాణం జరిగితే రామన్నపేట, పడమటితండా, కామంచికల్, దానవాయిగూడెం, డోర్నకల్, దారెడు, మహబూబాబాద్ వెళ్లేందుకు ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని వారు వినతి పత్రంలో తెలియజేశారు. వినతి పత్రాన్ని పరిశీలించిన ఎంపి దీనికి తగు పరిశీలన నిమిత్తం అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు బోడా వీరన్న, మాజీ కార్పొరేటర్ బొప్పి సతీష్, బొప్పి ప్రభాకర్, కామంచికల్ మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మేదరమెట్ల శ్రీను, నూకరాజు వెంకటేశ్వర్లు, కొనకండ్ల వాసు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## రక్త పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు

● పలు రక్త పరీక్ష కేంద్రాలకు మూసివేయాలని ఆదేశాలు
● సరైన ధృవపత్రాలు ఉంటేనే నిర్వహణ: జిల్లా వైద్యాధికారి రామారావు



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/వైరా:**జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డి.రామారావు ప్రజాపక్షం కథనాన్ని స్పందించి జిల్లాలో పలు మండలాల్లో రక్త పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. శుక్రవారం ప్రజాపక్షం దినపత్రికలో రక్త పరీక్షల పేరుతో వారి దందా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ తప్పుడు రిపోర్ట్‌లతో రోగి ప్రాణాలతో చెలగాటం అనే విషయాలతో సంబంధించిన శీర్షికను ప్రచురించడం జరిగింది. ఈ కథనం జిల్లావ్యాప్తంగా ప్రజల్లో చర్చనీయంగా మారడంతో పాటు పలువురు అధికారులు కూడా రక్త పరీక్షల కేంద్రాల్లో జరిగే లోపాలను సరిదిద్దె అందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ముందుకు వచ్చింది. శుక్రవారం వైరా మండలంలో నాలుగు ప్రైవేటు రక్త పరీక్ష కేంద్రాలను డిఎంహెచ్‌వో రామారావు తనిఖీ చేశారు. ప్రసాద్ ల్యాబ్, అరవింద ల్యాబ్, సాగర్ ల్యాబ్‌లను పరిశీలించారు. సాగర్ ల్యాబ్ నిర్వాహకులు సరైన ధృవపత్రాలు చూపించగా రిజిస్ట్రేషన్ అనుమతులు కూడా ఉండాలని తెలిపారు. మిగతా రక్త పరీక్ష కేంద్రాల్లో అనుమతులు సక్రమంగా లేవని చర్యలు తప్పవు అని ఆదేశించడంతో పాటు సరైన పత్రాలు చూపించిన తర్వాతే ల్యాబ్‌లను ఓపెన్ చేయాని ఆదేశించారు. కొణిజర్ల మండలం కొణిజర్లలో వెంకటేశ్వర ల్యాబ్‌లో తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా ఖమ్మం బ్యాంకు కాలనీలోనే స్ప్రింట్ రక్త పరీక్ష కేంద్రం డిఎంహెచ్‌వో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లో సర్వీసెస్ రికార్డులను రిజిస్టర్‌ను లైసెన్సులను, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నాణ్యతను ఆయన పరిశీలించారు. అదేవిధంగా జిల్లాలో రెండు రోజులపాటు ప్రత్యేక తనిఖీలు ఉంటాయని వైద్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా డిఎంహెచ్‌వో రామారావు మాట్లాడుతూ రక్త పరీక్ష కేంద్రాలు రోగులకు కచ్చితమైన నాణ్యమైన పరీక్షలు నిర్వహించాలని, ప్రతి ల్యాబ్‌లో రికార్డులు సక్రమంగా ఉండాలని మార్గదర్శకాలు పాటించాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా పరీక్షలు చేయడం రోగులకు తప్పుడు రిపోర్ట్ ఇవ్వడం జరిగితే చట్టపరంగా వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మండల మెడికల్ అధికారి డాక్టర్ హర్ష, డిఆర్ఎ సెక్షన్ అసిస్టెంట్ రామకృష్ణ, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చక్కటి వాతావరణంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ఐటిడిఎ పిఒ

**ప్రజాపక్షం/భద్రాచలం:** ప్రతీ మనిషీ అనారోగ్యాల పాలుకాకుండా ఉండాలంటే చక్కటి వాతావరణం అవసరమని, పర్యావరణాన్ని కాపాడుకుంటే అది మనల్ని కాపాడుతుందని ఇందు కోసం విరివిగా మొక్కలు నాటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ అన్నారు. శుక్రవారం తన ఛాంబర్లో అటవీ, ఐటిసి, ఇజిఎస్, గ్రామ పంచాయితీ అధికారులతో కలిసి సారపాక గ్రామపంచాయితీ పరిధిలో లక్ష మొక్కలు నాటి వాటిని సంరక్షించే విధంగా ప్రణాళిక రచించేందుకు శుక్రవారం ఐటిడిఎ పిఓ చాంబర్లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలో పర్యావరణం కలుషితం కాకుండా సారపాక గ్రామపంచాయితీ సర్పంచ్ ఆధ్వర్యంలో వన మహోత్సవంలో భగంగా ఏడాదికి 25వేల మొక్కలు చొప్పున నాలుగేళ్లకు గానూ 1 లక్ష మొక్కలు నాటే విధంగా అధికారులు ప్రణాళికలు రచించాలన్నారు. ప్రధానంగా గానుగ, వేప, చింత, జామ, నేరేడు చెట్లతో పాటు వివిధ రకాల పండ్ల మొక్కలు నాటాలని చెప్పారు. అటవీ, ఐటిసి, ఇజిఎస్ వారు గ్రామపంచాయితీకి వివిధ రకాల మొక్కలను అందించి వాటిని క్రమపద్ధతిలో నాటి కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు సహకరించాలని అన్నారు. ప్రజలను కూడా వనమహోత్సవ కార్యక్రమంలో భాగస్వాములను చేసి ప్రాణ వాయివు అందించే మొక్కలను నాటి వాతావరణం కలుషితం కాకుండా చూడాలన్నారు. చెట్ల పెంపకం వల్ల అరోగ్యమైన వాతావరణం ఉంటుందని, పర్యావరణం పరిరక్షించబడటంతో పాటు ప్రాణవాయివు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పరిపాలనాధికారి సున్నం రాంబాబు, సారపాక సర్పంచ్ కిషోర్ శివరామ నాయక్, డిఆర్ఓ కృష్ణ, ఐటిసి డెప్యూటీ జిఎం విశ్వనాధం, ఎన్ఆర్ఇజిఎస్ ఏపిఓ విజయ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## రూ.8.69కోట్ల పనులకు కౌన్సిల్ గ్రీన్‌సిగ్నల్

పురపాలక సంఘం సాధారణ సమావేశంలో
అభివృద్ధి, నిర్వహణ, బడ్జెట్ అంశాలకు ఆమోదం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:**ఏదులాపురంమున్సిపాలిటీ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం చైర్‌పర్సన పోకబత్తిని అనిత అధ్యక్షతన పెద్ద తండలోని కార్యాలయంలో నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, విద్యుత్ నిర్వహణ, బడ్జెట్ కేటాయింపులు, పరిపాలనా అంశాలపై విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశ అజెండాలో భాగంగా మున్సిపాలిటీపరిధిలో వీధి లైట్ల నిర్వహణ, ఎల్ఈడి బల్బులు, సంబంధిత పరికరాల కొనుగోలు ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.అదేవిధంగా పలు వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన వ్యయ ప్రతిపాదనలను ఆమోదించారు. మున్సిపల్‌పరిధిలో చేపట్టనున్న సివిల్ పనులు, విద్యుత్ విభాగానికి సంబంధించిన బిల్లులు, కొత్త ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనాలు, బడ్జెట్ అంశాలపై కూడా చర్చించారు. అలాగే వివిధ పనులకు పరిపాలనా అనుమతులు, టెండర్ల అంశాలపై కౌన్సిల్ తుది నిర్ణయాలు తీసుకుంది. ప్రతిపాద కార్యక్రమాల మొత్తం విలువ సుమారు రూ.8.69కోట్లుగా ప్రకటించారు.

## నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

● కమిషనర్ కె. శివకుమార్ ఆదేశం ● భూసేకరణ, పరిహారం చెల్లింపుల పురోగతిపై అధికారులతో సమీక్ష



**ప్రజాపక్షం/అశ్వాపురం:**జిల్లాలో కొనసాగుతున్న నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్ అంశాలను సత్వరమే పరిష్కరించాలని ఆర్అండ్ఆర్, ఇరిగేషన్ భూసేకరణ కమిషనర్ కె శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం అశ్వాపురం మండలంలోని సీతమ్మసాగర్ ప్రాజెక్ట్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు తొలి పంప్‌హౌస్‌ను పరిశీలించిన అనంతరం బీజీ కొత్తూరులోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి భూసేకరణ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, సీతమ్మసాగర్ బహూళార్ధక ప్రాజెక్టు, పులుసుబొంత, సింగభూపాలెం ప్రాజెక్టులతో పాటు ఇతర సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, అటవీ అనుమతులు, సర్వే పనులు, కోర్టు కేసుల పురోగతిని ప్రాజెక్టుల వారీగా సమీక్షించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, భూసేకరణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. రైతులకు న్యాయమైన పరిహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అవార్డుల జారీ, పరిహారం చెల్లింపుల ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఫేజ్ 1లో 1,522 ఎకరాలకు అవార్డులు జారీ చేసినట్లు తెలిపారు. ఫేజ్ 2లో 2,365 ఎకరాలకు పరిహారం చెల్లించగా, ఫేజ్ 3లో 1,621 ఎకరాల్లో 1,350 ఎకరాలకు అవార్డులు జారీ చేసి, 903 ఎకరాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మిగిలిన భూములకు సంబంధించి నిధులు అందిన వెంటనే పరిహారం చెల్లింపులు పూర్తి చేస్తామని చెప్పారు. అలాగే సీతమ్మసాగర్, పులుసు బొంత, సింగభూపాలెం ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పురోగతిని కమిషన్‌కు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎస్‌డిఎల్‌సిలు రవీంద్రనాథ్, వెంకట్రావు, మండల తహసీల్దార్లు, భూసేకరణ విభాగ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఉద్యమం ఉధృతం

● రెండవ రోజు తహసీల్దార్‌కు వినతి పత్రం ● సమస్య పరిష్కారమయ్యే వరకు ఉద్యమం ఆగదు: జర్నలిస్ట్ జెఎసి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**ఆర్ సి ఇంచార్జ్‌గా పనిచేస్తున్న జర్నలిస్టులకు జిల్లా ఎడిషన్ కార్డులు ఇచ్చి రాష్ట్రస్థాయిలో బస్ పాస్ సౌకర్యం కల్పించాలని సత్తుపల్లి జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ తరపున జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక ఎమ్మార్వో పున్నం సత్యనారాయణకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ జర్నలిస్టు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా లేని నిబంధనను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా జీవో 252 తీసుకొచ్చి ఆర్ సి ఇంచార్జ్ లుగా ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు మండల అక్రిడేషన్ కార్డులు ఇచ్చి, జిల్లా బస్సు పాసులు ఇవ్వడం జర్నలిస్టులను చిన్న చూపు చూస్తున్నారని విమర్శించారు. తక్షణమే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకొని నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు జిల్లా అక్రిడేషన్ కార్డులు మంజూరు చేసి బస్సు పాస్, హెల్త్ కార్డ్, జర్నలిస్టులకు ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్ రిపోర్టర్లు మాదిరాజు సుధాకర్, ఎండి షైబుద్దీన్, చిన్నిని బాలకృష్ణ, షేక్ ఖాదర్ బాబా, నిమ్మగడ్డ శ్రీకాంత్, రామిశెట్టి లక్ష్మణరావు, భీమిశెట్టి రాము, బి.వి.రామారావు, తడకమళ్ళ దేవ, బేతి ఆనంద్, కె. సతీష్, రాజేష్ రెడ్డి, కె. బాలాజీ, చీపు గంగాధర్, బొల్లిపోగు సురేష్, గురవయ్య, కొత్తపల్లి సుధాకర్, మునీర్, కాకర్ల జగన్, బల్లెం చిరంజీవి, కోట అశోక్ రాజ పాల్గొన్నారు.

## 23న కలెక్టరేట్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా

**ప్రజాపక్షం/ కొణిజర్ల :** ఈనెల 23న కలెక్టరేట్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మంజిల్లా సహాయ కార్యదర్శి పిట్టల రాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దమునగాల, కొండవనమాల, రెడ్డిగూడెం, కాచారం, పెద్దగోపతి గ్రామాల్లో వ్యవ సాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిట్టల రాంబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఉద్యమించాలన్నారు. వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారంలో కే ంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు.

## 23న మున్సిపల్ వర్కర్స్ మహాసభ

విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :**ఈనెల 23న రంగారెడ్డి జిల్లా రాజేందర్‌నగర్‌లోని కాటేదాన్‌లో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర 4వ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని విజయవంతం చేయాల్సిందిగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ శ్రమజీవులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపల్ కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆ మహాసభలో చర్చించినున్నట్లు ఆయన తెలియజేశారు. ఇటీవల ముఖ్యమంతిర రేవంత్‌రెడ్డి విడుదల చేసిన కనీస వేతనాల చట్టంలో కనీస వేతనాలే లేవన్నారు. గ్రామ పంచాయతీలు, పురపాలికలు, మున్సిపల్ కార్పొరేషన్ల వారీగా మూడు జోన్లుగా విభజించి, ఆయా జోన్లలో నైపుణ్య కేటగిరీల వారీగా కనీస వేతనాలను కార్మికశాఖ ఖరారు చేయడం ఏమిటన్నారు. మున్సిపాలిటీలను జోన్2గా, గ్రామాలు, ఇతర ప్రాంతాలు జోన్3గా ప్రకటించిన కారణంగా చాలామందికి ప్రస్తుతం వస్తున్న వేతనంలో కోతల విధించే అవకాశం ఉందన్నారు. కొత్తగా హైస్కిల్డ్ కేటగిరీని చేర్చి జోన్1లో కనీస వేతనాన్ని రూ.20వేలుగా పెంచిందనీ వాస్తవానికి ఈ కేటగిరీలో పని చేస్తున్న వారికి అంతకంటే ఎక్కువ జీతాన్ని ప్రస్తుతానికే అందుకుంటున్నారన్నారు. ఇలా పలు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీశారు. అనంతరం కార్మికులతో కలి సి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోటా రామాంజనేయులు కరపత్రాన్ని ఆవిష్కరణ చేపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు నీలం నాగరాజు, జిల్లా నాయకురాలు బల్లి ఉప్పలమ్మ, బద్దల పిచ్చయ్య, ఘనపరపు అమర్తమ్మ, దిండిగల విజయ, ధర్మాల మరియమ్మ, వేల్పుల చిన్న భద్రమ్మ, సమ్మయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆసుపత్రుల్లో తనిఖీలు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో బుధవారం గురువారం శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాలతో జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ దేవేందర్, డెమో శ్రీదేవి తనిఖీలు చేపట్టారు. కిరణ్ జిల్లా కేంద్రం లోని యోదా హాస్పిటల్, మేడ హాస్పిటల్, స్మార్ట్ కేర్, శ్రీ వెంకటేశ్వర హాస్పిటల్, ప్రధాన్ హాస్పిటల్, తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పటల్ వారు ఫైర్, పొల్యూషన్ బయోమెడికల్ వేస్ట్ ,సర్టిఫికెట్ ధరల పట్టిక మొదలగునవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ జిల్లాలో 44 ఆసుపత్రులు రిజిస్టర్ అయి ఉన్నాయని తెలిపారు. అన్ని ఆసుపత్రులు విధిగా తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

## నీట్ పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** ఆదివారం జరిగే నీట్ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో ఈ నెల 21న ఆదివారం జరిగే నీట్ పరీక్ష సంబంధించిన పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ ప్రకారం నిషేధాజ్ఞలు అమలు చేయబడతాయని. ఈ ఉత్తర్వు ప్రకారం పరీక్ష జరిగే 500 మీటర్ల పరిధిలో ప్రజలు గుంపులుగా గుమి కూడటం, సభలు సమావేశాలు ర్యాలీలు ధర్నాలు నిషేధించబడ్డాయని, అలాగే పరీక్ష జరిగే పరిసరాలలో పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, ఈ ఉత్తర్వులు ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని, ఈఉత్తర్వునుఅతిక్రమిస్తే వారిపై చట్టపరమై న చర్యలు తీసుకోబడతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

## వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ

**ప్రజాపక్షం / వరంగల్ :** వరంగల్ జిల్లా లోని అక్రిడిటెడ్, వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 2026–27 విద్యా సంవత్సరానికి గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలో ఫీజు రాయితీ కల్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ల యూనియన్ టియుడబ్ల్యు(ఐజెయు) వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ రామచందర్ అందజేసిన వినతిపత్రాన్ని పరిశీలించిన అనంతరం జిల్లా విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. యూనియన్ ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు కందుల శ్రీధర్, ఉపాధ్యక్షులు కూర్న వెంకటె శ్వర్లు, మహాదేవుని జగదీష్, సహాయ కార్యదర్శులు బొమ్మ గాని సతీష్ కుమార్, బాదావత్ బాలాజీ, కమిటీ సభ్యులుఎండిబాబర్,అక్రమ్,కందుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి ఆమరణ నిరాహార దీక్ష పోస్టర్ల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నర్సంపేట:** ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసి, ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చే అపాయింటెడ్ డేట్ ను తక్షణమే ప్రకటించాలని, లేని పక్షంలో ఈనెల జూన్ 24న హైదరాబాద్ లోని బస్సు భవన్ వద్ద తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టిజెఎంయు) వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి హనుమంతు ముదిరాజ్ చేపట్టబోయే నిరాహార దీక్షకు సంబంధించిన వాల్ పోస్టర్లను యూనియన్లకు అతీతంగా నర్సంపేట డిపో కార్మికులు శుక్రవారం ఆవిష్కరించారు. పోస్టర్లను చేతబూని ఎన్నికలు వద్దు, ఆర్టీసీ విలీనమే ముద్దు, ఆర్టీసీని వెంటనే విలీనం చేయాలి అనే శ్లోకాలను ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు కావస్తున్న శుభ సందర్భంగా ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే అపాయింటెడ్ డేట్ వెంటనే ప్రకటించి ఆర్‌టిసి కార్మిక లోకానికి కానుకగా ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. 94 సంవత్సరాల ఆర్టీసీ చరిత్రలో మొట్ట మొదటిసారిగా ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే అపాయింటెడ్ డేట్ కోసం హనుమంతు ముదిరాజ్ చేపట్టబోయే ఆమరణ నిరాహార దీక్షకు వేలాదిగా తరలిరావాలని వారు కోరారు. గొలనకొండ వేణు, నాగిశెట్టి ప్రవీణ్, ఎండి. అప్సర్ అలీ, బూర ప్రవీణ్, మంద రాజు, సురేష్, రాజు,ఓం ప్రకాష్, రాజు, కొమురయ్య, స్వప్న పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాకు చెక్



**ప్రజాపక్షం/నర్సింహులపేట:** ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అకేరు వాగును తొర్రూర్ ఆర్డిఒగణేష్,జిల్లా గనుల , భూగర్భ శాఖ సహాయ సంచలకులు ,సిఐ గణేష్,తహసీల్దారు రమేష్ బాబు,ఎస్ఐవెంకన్నలు శుక్రవారం సంయుక్తంగా పరిశీలించారు.మండలంలోని ఇసుక నిల్వ ప్రాంతాలు,రవాణా మార్గాలు,అనుమతులతో జరుగుతున్న త్రవ్వకాలు,నిల్వల పరిస్థితిని అధికారలు క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు,అక్రమ నిల్వలు, అనుమతిలేని రవాణా జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకపై ఇసుక అక్రమ రవాణాకు చెక్ పడనుందని ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు గమనించినట్లైతే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు.ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగుతుందని అధికారులు చెప్పారు.

## కాపర్ వైర్ చోరీ



**ప్రజాపక్షం/రాయపర్తి:** మండల కేంద్రంలోని వరంగల్..ఖమ్మం జాతీయ రహదారికి ఆనుకోని ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఎదురుగా ఉన్న వ్యవసాయ భూముల్లో ఉన్న 25కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు పగులకొట్టి అందులో ఉన్న కాపర్ వైర్‌ను దొంగలించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో రెండు సార్లు ఇదే ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైర్‌ను దొంగలించారని ఇది మూడవసారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిళ్లు పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించి ఎలాంటి దొంగతనాలు జరగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

# నాణ్యమైన విద్యతోనే గ్రామాభివృద్ధి

ఉపాధి పనులు, ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** గ్రామాభివృద్ధికి పారిశుధ్యం, పచ్చదనం, నాణ్యమైన విద్య మూడు ప్రధాన స్తంభాలని, వీటి సమన్వయంతో గ్రామాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు.శుక్రవారం ఎల్కతుర్తి మండలం జీల్గుల గ్రామంలో ఆకస్మికంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ సెగ్రిగేషన్ షెడ్, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. ముందుగా గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్డును సందర్శించిన కలెక్టర్ తడి, పొడి చెత్త వేరు చేసే విధానం, కంపోస్ట్ ఎరువు తయారీ ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.

**ఉపాధి హామీ పనులు గ్రామీణ ఆర్థికాభివృద్ధికి దోహదం**

అనంతరం ఊర చెరువులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన కలెక్టర్, కూలీల హాజరు, పనుల పురోగతి, వేతనాల చెల్లింపులపై ఆరా తీశారు. చెరువు పూడికను వ్యవసాయ భూములకు తరలించడం ద్వారా భూసారం పెరిగి రైతులకు లాభం చేకూరుతుందని పేర్కొన్నారు.గ్రామంలో పెద్ద సంఖ్యలో కూలీలు ఉపాధి హామీ పనుల్లో పాల్గొనడం సంతోషకరమని, వ్యవసాయ విరామ సమయంలో ఉపాధి హామీ పథకం గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తుందని అన్నారు.చెరువు కట్ట చుట్టూ విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించిన కలెక్టర్, ప్రకృతి వనరుల సంరక్షణతో గ్రామాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.

**విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపుపై దృష్టి**

జీల్గుల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలించారు. గణితం, ఇంగ్లీష్, సాంఘిక శాస్త్రం వంటి అంశాల్లో విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు అందాయా లేదా అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మమేకమైన కలెక్టర్ సాంఘిక శాస్త్రంలోని అంశాలను బోధిస్తూ భారతదేశ భౌగోళిక స్వరూపం, సరిహద్దుల గురించి వివరించారు. ప్రశ్నలకు సమర్థంగా సమాధానాలు ఇచ్చిన విద్యార్థులను అభినందించారు.పాఠశాల దశలోనే బలమైన విద్యా పునాది ఏర్పడితే విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి విద్యార్థుల నమోదు పెంచేందుకు చర్యలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు.మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం వనమహోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఒ మేన శీను, జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజు గౌడ్, తహసీల్దార్ ప్రసాద్, ఎంపిడిఒ విజయ్ కుమార్, గ్రామ సర్పంచ్ సృజన తదితరులు పాల్గొన్నారు.


## పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వలక్ష్యం అని భూపాలపల్లి ఎమ్మెల్యే గాండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం, ప్రారంభోత్సవం రాజేశ్వరి రాజబాబు నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశ, రాష్ట్ర అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ పోషించిన పాత్రను,ప్రజలకు అందించిన సేవలను వివరించారు. ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, పేదల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల నిరు పేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసం కల్పించే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తుంచుకుని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే 3వ వార్డులోని కమ్యూనిటీ హాల్ మరమ్మతుల కోసం అవసరమైన నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఎర్రవెల్లి జలపతిరావు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, డిసిసి అధ్యక్షుడు బట్టు కరుణాకర్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు



**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలంలోని మద్దెలగూడెం, వేలేరు గ్రామాలకు స్టేషన్‌ఘన్ పూర్ ఎమ్మెల్యేకడియం శ్రీహరి శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సిసిరోడ్ల నిర్మాణానికి రూ,65 ,0000 లక్షల సిడిఆర్ఎఫ్,ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధుల నుండి మంజూరు చేయగా వేలేరుకు రూ, 45,0000లక్షల,మద్దెలగూడెంకు రూ,25,0000లక్షల మంజూరు చేసి ప్రొసీడింగ్ కాపీని అంది ంచారని వేలేరు సర్పంచ్ బిల్ల యాదగిరి,మద్దెలగూడెం సర్పంచ్ హనుమకొండ మనోజ్ కుమార్‌లు తెలిపారు ఈసంధర్భంగా వారు మాట్లాడుతూ గ్రా మాల అభివృద్ధికోసం స్టేషన్ ఘన్‌పూర్ఎమ్మెల్యే క డియం శ్రీహరి దృష్టికి తీసుకెల్లగా సిడిఆర్ఎఫ్, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నుండి నిధుల మంజూరు చే శారని తెలుపుతూ త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బిల్ల యాదగిరి,హనుమకొండ మనోజ్‌కుమార్,ఏనుమాముల డైరెక్టర్ కత్తి సంపత్,నీలం వెంకన్న,ఎం రాజయ్య,మిల్కూరి సంజీవ్,గిరి ప్రసాద్,రవిందర్ తదితరలు పాల్గొన్నారు.

## వైటిపిఎస్ సిహెచ్‌పి, ఎహెచ్‌పి వైటిపిఎస్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కెటిపిపిలో నిరసన




**ప్రజాపక్షం/గణపురం:** కెటిపిపి ఆధ్వర్యంలోని వైటిపిఎస్‌లో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ విభాగాలను ప్రయివేటీకరణకు అప్పగించే దిశగా టెండర్ ప్రక్రియ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ టిజిపిఇ జెఎసి సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం గణపురం మండలంలోని చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ ప్రధాన ద్వారం ముందు ఉద్యోగులు కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన, ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో కీలకమైన ఆపరేషన్ విభాగాలను ప్రయివేటీకరించడం వలన ఉద్యోగ భద్రత దెబ్బతినడమే కాకుండా పనిభారం అసమానంగా పెరగడం, అనుభజ్ఞులైన సిబ్బందిని పక్కన పెట్టడం, భద్రతా ప్రమాణాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సిహెచ్‌పి,ఎహెచ్‌పి ప్రయివేటీకరణ టెండర్ ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజారంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రయివేటీకరణ చర్యలు సంస్థ భవిష్యత్తుకు, కార్మికుల హక్కులకు విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక ప్లాంట్‌కు సంబంధించిన సమస్య మాత్రమే కాదని, రాబోయే రోజుల్లో విద్యుత్ రంగంలో మరిన్ని విభాగాలను అవుట్ సోర్సింగ్ లేదా ప్రయివేటీకరణ పేరుతో బలహీనపరిచే ప్రయత్నాలకు ఇది నాంది కావచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యం తమ డిమాండ్లను పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో మరింత ఉధృతమైన ఆందోళనలు చేపడతామని తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు : కలెక్టర్




**ప్రజాపక్షం/కొడకండ్ల:** విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలు, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కొడకండ్లలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్, బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ముఖ్యంగా గణిత బోధనపై ఆరా తీసి, విద్యార్థులకు ప్రశ్నలు అడిగి వారు నేర్చుకునే సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఆహారం నాణ్యత, రుచి, మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వసతి గృహంలోని గదులు, వంటశాల, భోజనశాల, పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. మరుగుదొడ్లను తనిఖీ చేసి వాటిని ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. స్కావెంజర్ అందుబాటులో ఉన్నారా అని ఆరా తీశారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఎదురైతే నేరుగా తనను సంప్రదించాలని తెలిపారు. అందు కోసం తన ఫోన్ నంబర్‌ను పాఠశాల, వసతి గృహ ప్రాంగణాల్లో స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ క్రమంలో మోడల్ స్కూల్ ఆవరణలో మొక్కను నాటి పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని తె లిపారు. ఈ పరిశీలనలోజిసిడిఒ గౌసియా బేగం, ఇతర సం బంధిత అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పకడ్బందీగా ‘సర్’



**ప్రజాపక్షం/జనగామ టౌన్ / జనగామ:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్ర ధా న అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ‘సర్’ ప్రక్రియ ని ర్వహణపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీ డియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సు దర్శన్ రెడ్డి మాట్లాడుతూ అన్ని జిల్లాలలో ‘సర్’ ప్రక్రియలో భాగంగా ఎ న్యుమరేషన్ ఫారంల పంపిణీ, తిరిగి స్వీకరణ, తదితర అంశాలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. జిల్లాల వారీగా ‘సర్’ప్రక్రియ నిర్వహణకు చే పట్టిన చర్యలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాల వివరాలు కలెక్టర్ల ద్వారా తెలుసుకున్నారు. ప్రక్రియను మొత్తం కలెక్టర్లు, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ఈ విసిలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీధర్, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలో నాణ్యతకు ప్రాధాన్యం

“హైజెనిక్, హెల్దీ మీల్ ప్రిపరేషన్” అంశంపై జిల్లా స్థాయి శిక్షణ



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పిఎం పోషన్ (మధ్యాహ్న భోజన పథకం) కింద “హైజీనిక్, హెల్తీ మీల్ ప్రిపరేషన్” అంశంపై శుక్రవారం మోడల్ స్కూల్ అనంతారంలో జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ ఎ. సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పరిశుభ్రత , పోషక విలువలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు , వంట కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు , కుక్‌కమ్ హెల్పర్లకు ఆహార పదార్థాల సురక్షిత నిల్వ, వంటశాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షిత ఆహార తయారీ విధానాలు, పోషకాహార ప్రమాణాలు, ఆహార వ్యర్థాల నివారణ, నాణ్యత నియంత్రణ ,ప్రభుత్వ మార్గదర్శకాల అమలుపై సవివరంగా అవగాహన కల్పించారు.అదేవిధంగా, పిఎం పోషన్ పథకం విజయవంతమైన అమలుకు ప్రతి పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగించాలని, విద్యార్థులకు ఆరోగ్యకరమైన, పోషకాహారం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డి ఇఒ సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రిసో ర్స్ పర్సన్స్‌గా పి. వీరయ్య, బి. నరేందర్ వ్యవహరించి, పరిశుభ్రమైన ఆహార తయారీ, పోషకాహార ప్రమాణాలు ,ఆహార భద్రత అంశాలపై సవివరం గా శిక్షణ అందించారు.మండల విద్యాశాఖ అధికారులు (ఎంఇఓలు), కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, జి ల్లా కోఆర్డినేటర్లు పి. పూర్ణచందర్, వి. సురేష్, వెం కటేశ్వర్లు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు, జిల్లా మధ్యాహ్న భోజన పథకం ఇన్‌చార్జి ఎం.గణేష్, శ్రీకాంత్, సాయిచరణ్, ముజాహిద్ అ లీ, కుక్‌కమ్‌హెల్పర్లు ,ఇతర విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనుల్లో పురోగతి

అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు * మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు, ‘దిశా’ కమిటీ చైర్మన్ పోరిక బలరాం నాయక్



**ప్రజాపక్షం/ములుగు:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణతో పనిచేయాలని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు, దిశా కమిటీ చైర్మన్ పోరిక బలరాం నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం పోరిక బలరాం నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రాధా బాయి, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా పోలీస్ అధికారి సుధీర్ రామ్నాద్ కేకన్, అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, దిశా కమిటీ సభ్యులు పూర్ణచందర్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి పోరిక బలరాం నాయక్ జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని శాఖల వారీగా సమగ్రంగా సమీక్షించి, పనుల అమలులో ఎటువంటి జాప్యం లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కాన్ ఏర్పాటు కోసం తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మెడికల్ కళాశాల విద్యార్థులతో గిరిజన ప్రాంతాలలో వైద్య శిక్షణ శిబిరాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమగ్ర శిక్ష కార్యక్రమం మధ్యాహ్న భోజన పథకం అమలును మరింత సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వ్యవసాయ రంగంపై మాట్లాడుతూ యూరియా వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, ఆన్‌లైన్ విధానం ద్వారానే ఎరువుల కొనుగోలు, అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు చేపట్టాలని సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గుచూపేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ములుగు, ఏటూరునాగారం ప్రాంతాలలో రింగ్ రోడ్డు ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన పనుల జాబితాను రూపొందించి ప్రాధాన్యత క్రమంలో అమలు చేయాలని సూచించారు. సమావేశానికి హాజరైన మహిళా కమిషన్ సభ్యులు, దిశా కమిటీ సభ్యులు, అధికారులు, సమన్వయంతో సహకరించాలని, జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలును మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే దిశగా చర్యలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మూడు నెలలకు ఒకసారి దిశా సమావేశం నిర్వహిస్తూ అభివృద్ధి పనులపై క్రమం తప్పకుండా సమీక్ష కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రవి కుమార్, ములుగు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తుదిశ్వాస వరకు కమ్యూనిస్టుగా, ఆదర్శప్రాయుడిగా బతికిన నేత మల్లారెడ్డి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/బెజ్జంకి:** అన్నాడి మల్లారెడ్డి తుదిశ్వాస విడిచే వరకు కమ్యూనిస్టు నాయకుడిగా కొనసాగారని ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎంఎల్‌ఏ చాడ వెంకటరెడ్డి కొనియాడారు.శుక్రవారం మండల పరిధిలోని గాగిళ్ళాపూర్ గ్రామంలోని మల్లారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాలులర్పించారు. ఆనంతరం వారు మాట్లాడుతూ మొదటి నుండి కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ ఉండేవారని, ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన తర్వాత ఉద్యోగ భాధ్యతలు నిర్వహిస్తు మంచి పేరు సంపాదించుకున్నారని, ఉద్యోగ విరమణ అనంతరం భారత కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శిగా, ఉమ్మిడి కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పార్టీ నిర్మాణం పెంచడం కోసం ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసం అనేక పోరాటాలకు నాయకత్వం వహించి ఉద్యమాలు నిర్వహించారని అన్నారు. పార్టీ పట్ల ఎంతో నిబద్ధతతో నిజాయితీతో ఉండేవారని క్రమశిక్షణకలిగిన నాయకుడిగా అందరికి ఆదర్శంగా ఉన్న నాయకుడిని కోల్పోవడం సిపిఐ పార్టీకి, వారి కుటుంబానికి తీరని లోటని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకట్ రెడ్డి, గూడెం లక్ష్మీ , కోమటిరెడ్డి జైపాల్ రెడ్డి,సదాశివ, కుటుంబ సభ్యులు అన్నాడి సుధాకర్ రెడ్డి,రాంగోపాల్ రెడ్డి, సచిందర్ రెడ్డి,జితేందర్ రెడ్డి తదితరులున్నారు.

## కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలు అక్షరాలతో విద్య వ్యాపారం



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో విద్యా వ్యవస్థలో కార్పొరేట్, ప్రవేట్ సంస్థలు అక్షరాలతో విద్య వ్యాపారం చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుర్ర రాకేష్, మంద అనిల్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లాలో ప్రైవేట్ పాఠశాల విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని జిల్లా విద్యా అధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం – 2009 ప్రకారం ప్రతి ప్రవేట్, కార్పొరేట్ ప్రవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత విద్యా బడుగు బలహీన వర్గాల పేద విద్యార్థులకు ఇవ్వాలని విద్యా హక్కు చట్టంలో పొందుపరిచిన పట్టించుకోకుండా వ్యవహరించటం సరికాదు అన్నారు. కార్పొరేట్ ప్రవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు యూనిఫాంలు బలవంతపు విక్రయాలను నిషేధించాలన్నారు. మరో పక్కన విద్యా రంగంలో సమస్యలు రాకుండా విద్యార్థులకు న్యాయం చేస్తాం అని విద్యార్థుల బలిదానాలతో ఏర్పడిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు అవమానించేలా వ్యవహరిస్తూ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి 27 వేల ప్రభుత్వ పాఠశాలను 4 వేలకు తగ్గిస్తా అన్న మాటను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విద్యా శాఖకు మంత్రిని నియమింకాకపోవటం విద్యను బ్రష్టు పట్టించడం విద్యార్థి అమరవీరులను అవమానించటమే అని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టం అమలు చెయ్యాలి విద్యా వ్యవస్థను కాపాడాలని లేని యడల ఉద్యమాలు తప్పని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ బర్రెంకల శ్రీహారిక ,ఉపాధ్యక్షులు పెండెల ఆదిత్య, సంకే వంశీ, బోధసు ప్రవళిక, మామిండ్ల అనిల్, బండారి చందు, రామ్ చరణ్ పాల్గొన్నారు.

## లక్ష్యాన్ని అధిగమించి, 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

రైతుల ఖాతాల్లో ఇప్పటికే 1036 కోట్లు జమ



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** 2025–26 రబీ సీజన్‌లో సిద్దిపేట జిల్లాలో వరిధాన్యం కొనుగోళ్లు ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ హైమావతి వెల్లడించారు. ప్రభుత్వం నిర్దేశించిన 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని లక్ష్యాన్ని అధికమించి జిల్లా వ్యాప్తంగా 427 కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 5.04.161 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 97.807 రైతుల నుండి రూ.1.204 కోట్ల విలువైన వరిధాన్యం కొనుగోలు చేయగా, ఇప్పటికే 1036 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలో జమచేసినట్లు తెలిపారు. ట్యాబ్, ఎంట్రీ, పూర్తికాగానే మిగిలిన చెల్లింపులు త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు. రైతులు ప్రభుత్వ మద్దతు ధర పథకం ద్వారా లబ్ది పొందినట్లు పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతిగింజకు మద్దతు ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లువిజయవంతంగా పూర్తికావటంతో ప్రజాప్రతినిధులు, రైతులు, కోనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు. రవాణ, కంట్రాక్టర్లు. రెవెన్యూ, వ్యవసాయ, సివిల్ సప్లయ్ అధికారులు, సిబ్బంది అందించిన సహకారాన్ని అభినందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## ఖననం చేసిన మృత దేహానికి పోస్టు మార్టం... తల్లే హంతకురాలు

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** గత ఇరవై రోజుల క్రితం అనుమానస్పధంగా మృతి చెందగా ఖననం చేసిన మూడు సంవత్సరాల బాలుని మృత దేహనికి శుక్రవారం కిసర పోలీసుల ఆధ్వర్యంలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సంఘటనకు సంబంధించి జగదేవ్‌పూర్ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన స్వామి జ్యోతి దంపతులు బతుకుదేరువు కోసం కిసరకు వెళ్లి అక్కడనే నివసిస్తున్నారు. ఆ దంపతులకు మూడు సంవత్సరాల హరికృష్ణ అనే బాలుడు ఉన్నారు. కాగా మే 30న జ్యోతి తన ప్రియుడు నవీన్‌తో కలిసి బాలున్ని హతమార్చారు. అయితే బాలుడు మూర్చ వ్యాధితో మృతి చెందినట్లుగా భర్తా స్వామితో నమ్మ బలికి తమ స్వగ్రామమైన తిగుల్‌లో బాలుని అంత్య క్రియలు నిర్వహించారు. ఆ తర్వాత బాలుని మృతిపై అనుమానం వచ్చిన స్వామితో పాటు అతని కుటుంబ సభ్యులు జ్యోతిని నిలదిశారు. దీంతో తమ నివాసం లోనే తన ప్రీయుడు నవీన్‌దో కలిసి బాలున్ని హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో మాలుని తండ్రి స్వామి శుక్రవారం కిసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకోని జగదేవ్‌పూర్ పోలీసుల సహకారంతో మైద్యుల ఆధ్వర్యంలో ఖననం చేసిన మృత దేహన్ని మయటకు తీసి పోస్టు మార్టనిర్వహించారు. పోస్టుమార్టం ఆధారంగా నిందితులపై చర్యలు ఉంటాయని ఎస్ఐ తెలిపారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ప్రజా ప్రభుత్వం పేదల కలలను సాకారం చేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గోవిందపల్లి గ్రామంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి గ్రామస్తులు తెలిపారు.ఎస్సీ కాలనీలోని ప్రజలు ఇబ్బందులు పడకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. గ్రామంలో రేవేళ్ల లావణ్య శ్రీధర్ దంపతులకు మంజూరైన నూతన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకొని శుక్రవారం రోజున గృహప్రవేశ కార్యక్రమం చేశారు. కాగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో పదేళ్ల లో పేదవారికి ఒక ఇల్లు కూడా ఇవ్వలేదని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చడానికి కృషి చేస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దశలవాదిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,మంత్రి లక్ష్మణ్ కుమార్ సహకారంతో తమ సొంత ఇంటి కల సహకారం అయిందని సంతోషం వ్యక్తం చేస్తూ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాపల్లి గంగన్న, జనరల్ సెక్రెటరీ జెల్లా అనిల్ కుమార్, స్థానిక సర్పంచ్ మ్యాక స్వామి ,ఉప సర్పంచ్ కోట అశోక్, కాంగ్రెస్ నాయకులు ముస్కు విశాంత్ రెడ్డి, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు .

**దేశంకోసం ప్రాణాలర్పించిన చరిత్ర రాహుల్ కుటుంబానిది**

**ధర్మపురి :** దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబానిదని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలోని నందీచౌక్ వద్ద మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి కేక్ కట్ చేసి నాయకులకు,కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ దేశ సమగ్రతకు,ఐక్యత కోసం రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర జరిపారని అన్నారు.దేశం కోసం తమ ప్రాణాలను సైతం అర్పించిన చరిత్ర గాంధీ కుటుంబానిదని,దేశానికి ప్రధానమంత్రి అయ్యే అవకాశం సోనియా గాంధీ,రాహుల్ గాంధీలకు వచ్చినప్పటికీ పదవి చేపట్టకుండా నాటి ఆర్థికమంత్రి మన్మోహన్ సింగ్ కు ఆ అవకాశం ఇచ్చారని అడ్లూరి గుర్తుచేశారు. ప్రస్తుత ప్రధాని మోడీ పేదలకు అన్నం పెట్టే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్.దినేష్, చిలుముల లక్ష్మణ్,నాయకులు ప్రసాద్, సుముఖ్, తిరుపతి, గణేష్, బాలాగౌడ్, సత్యం ,రమేష్, షౌకత్ , పోచయ్య, రవి, సుధాకర్, మహేందర్, శ్రీధర్, ప్రభాకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు

## 21 నుండి గోదావరిఖని కూరగాయల మార్కెట్, హమాలీల సమ్మె



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీల కూలీ రేట్ల పెంపు విషయంలో హోల్‌సేల్ వ్యాపారులు లేబర్ అధికారుల ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారని,దీన్ని నిరసిస్తూ జూన్ 21 నుండి సమ్మెకు వెళ్తున్నామని కరీంనగర్ జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్, గోదావరిఖని కూరగాయల మార్కెట్ అధ్యక్షులు ఎం.ఏ.గౌస్ తెలిపారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో జరిగిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 20లోపు కూలీ రేట్లు పెంచాలని హోల్‌సేల్ వ్యాపారులకు ఇప్పటికే నోటీసు ఇచ్చామని తెలిపారు. డిమాండ్ నెరవేర్చకపోతే 21వ తేదీ నుండి నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, రాంచందర్, జానీ మియా,గాలిపెల్లి సతీష్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/జగిత్యాల:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలోని పురాతన పాఠశాలను కలెక్టర్ సందర్శించారు.పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి,భోజన నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు.విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యత,రుచి పై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.భోజనం సక్రమంగా, సమయానికి అందుతున్నదా అనే అంశాన్ని కూడా పరిశీలించారు. డైట్ మెను,వంటగది పరిశుభ్రత, నీటి వినియోగం, నిల్వ, కిచెన్ షెడ్ విధానాలపై ప్రత్యేకంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను ఖచ్చితంగా అమలు చేసి, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కె. రాము, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్,తదితరులు ఉన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

మంత్రి వివేక్‌వెంకటస్వామి



**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని 1వ వార్డు పరిధిలోని రేణుకామాత ఆలయంలో రాష్ట్ర కార్మిక ఉపాధికల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, సిద్దిపేట నియోజకవర్గం ఇంచార్జి పూజల హరికృష్ణలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఘన స్వాగతం పలికి వారిని సన్మానించారు. ఆలయ అర్చకులు మంత్రి వివేక్‌వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావును ఆశీర్వచనం చేశారు. లింగారెడ్డిపల్లి వార్డులో బోర్‌వేల్ నిర్మాణ పనులకు మంత్రి వివేక్‌వెంకటస్వామి, మైనంపల్లి హన్మంత్‌రావు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ ప్రజలకు అన్ని మౌళిక సదుపాయాలు కల్పించేందుకు కాంగ్రెస్ సర్కార్ ప్రణాళిక బద్దంగా పనిచేస్తుందన్నారు. ప్రజలకు అవసరమగు అన్ని మౌళిక సదుపాయాలు ప్రాధాన్యత క్రమంగా కల్పిస్తామన్నారు. వార్డు పరిధిలోని సమస్యలను నీటి ఎద్దడి, పారిశుధ్యం, విద్యుత్, ఇతర సమస్యలను మైనంపల్లి సోషల్‌సర్వీ సేస్ ఆర్గనైజేషన్ ద్వారా పరిష్కరించేందుకు కృషిచేస్తానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడు మైనంపల్లి సోషల్ సర్వీసెస్ ముందుంటుందన్నారు. ఆనంతరం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో మంత్రి వివేక్‌వెంకటస్వామి, మైనంపల్లి హన్మంత్‌రావు. పూజలు హరికృష్ణలు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రఘువర్ధన్‌రెడ్డి, మార్క సతీష్, దేవులపల్లి యాదగిరి, మీసం మహేందర్, సాకి ఆనంద్, మహేందర్. ఎల్లం, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చెంచులకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు

పారుపల్లి చెంచు గూడెం, పాఠశాల, తహసీల్దార్ కార్యాలయం, ధర్యాపూర్ మోడల్ స్కూల్‌ను పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/ముత్తారం :** ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ముత్తారం మండలంలోని పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించడం జరిగింది. సంచార జీవులైన చెంచు కుటుంబాలకు అవసరమైన అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లాముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామంలో చెంచుల నివాస గృహాలను, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, ముత్తారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులను, ధర్యాపూర్ మోడల్ స్కూల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పారుపల్లి గ్రామంలోని సంచార జీవులైన 15 చెంచు కుటుంబాల వారికి అవసరమైన ఆధార్ కార్డులు,రేషన్ కార్డులు, అర్హులైన వారికి పెన్షన్లు ఇటీవల కలెక్టర్ చెరువతో అధికారులు అందించారు. పారుపల్లి మండల పరిషత్ ప్రైమరీ స్కూల్లో కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు అడ్మిషన్లు అందించారు, అర్హులైన చెంచు కుటుంబాలకు కలెక్టర్ ప్రత్యేక నిధుల ద్వారా షెడ్ల నిర్మాణం పూర్తి చేశారు.చెంచు కుటుంబాల కోసం ఇప్పటికే నిర్మించిన 10 గృహాలను పరిశీలించిన కలెక్టర్,వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేసి జూలై 31 నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ముత్తారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

ధర్యాపూర్ మోడల్ స్కూల్‌ను సందర్శించిన కలెక్టర్, పాఠశాల ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిని లెవెలింగ్ చేసి విద్యా అవసరాలకు అనుగుణంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో ముత్తారం తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో సురేష్, ఏఈలు,డిఇలు, సంబంధిత శాఖల అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

కలెక్టర్ కోయ శ్రీహర్షకు విశిష్ట సన్మానం



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** విద్యా ప్రమాణాల పెంపులో పెద్దపల్లి జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపినందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా విద్యాశాఖ అధికారులకు విశిష్ట గౌరవం లభించింది.ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గౌరవ గవర్నర్, ముఖ్యమంత్రి చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ను సన్మానించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.విద్యా రంగంలో నాణ్యతాభివృద్ధి, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల, పాఠశాలల సమర్థ నిర్వహణలో పెద్దపల్లి జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపినందుకు ఈ గుర్తింపు లభించింది. వేలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా శాఖ సిబ్బంది సమక్షంలో ఈ సత్కార కార్యక్రమం ఘనంగా జరిగింది.జిల్లా విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి చేసిన జిల్లా విద్యా శాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యా రంగ భాగస్వాములు మరియు సిబ్బంది అందరికీ జిల్లా యంత్రాంగం అభినందనలు తెలియజేసింది. జిల్లా విద్యా రంగ అభివృద్ధికి అందరూ సమష్టిగా కృషి చేయడం వల్లే ఈ గౌరవం సాధ్యమైందని, భవిష్యత్తులో కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు.

## రైతులను నమ్మించి గొంతుకోసిన కాంగ్రెస్ ప్రభుత్వం

మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు



**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిఎం రాహుల్ గాంధీ జన్మదినం రోజే కాంగ్రెస్ రైతు డిక్లరేషన్‌ను బొందపెట్టారని మాజీ మంత్రి, అసెంబ్లీ డిప్యూటి ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ఆరోపించారు. వరంగల్ రాహుల్‌గాంధీ ప్రకటించిన డిక్లరేషన్‌లో అన్ని పంటలకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తానని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి బోనస్‌లేదని. అన్ని పంటలను రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర కూడ కోనుగోలు చేయదని, కేంద్రం ఏపంట కొనుగోలు చేయమంటే ఆపంటనే కొనుగోలు చేస్తామని, ఎంత కొనమంటే అంతే కొంటామని తెల్చిచెప్పటం రైతాంగాన్ని నమ్మించి మోసం చేయటం అన్ని విమర్శించారు. రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీలు గతంలో మాట్లాడుతూ ఎంతైన వడ్లు పండించండి, పండించినదంతా మేమే కొనుగోలు చేస్తామని రైతులకు నమ్మబలికారన్నారు. నిన్న కేబినేట్ మీటింగ్ తర్వాత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేపర్‌పై రాసుకొచ్చిన దాన్ని జాగ్రత్తగా చదివి వినిపిస్తూ కేంద్రం మద్దతు ధర నిర్ణయించిన పంటలు ఎంత కొనమంటే..అంతే కొంటామని స్పష్టంగా చెప్పారన్నారు. ఇది పేపల్ లేస్ కెబినేట్ కాదని..ఇది ఫెయిత్‌లేస్ కెబినేట్ , రైతుల పట్ల నమ్మకంలేని విశ్వాసఘాతకమైన ప్రభుత్వమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్ల విషయంలో తన బాధ్యతల నుండి తప్పించుకునే యత్నం చేస్తుందన్నారు. కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడు కేంద్రం కొన్న, కొనకున్న రాష్ట్ర ప్రభుత్వం అన్ని పంటలను కొనుగోలు చేసి రైతులను మద్దతు ధర కల్పించినట్లు తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ మాటాల ప్రకారం కేంద్రం ప్రభుత్వం జొన్నలు, మక్కలు కొనదని, అంటే వర్షాకాలం నుండి రాష్ట్ర ప్రభుత్వం మక్కలు, జొన్నలు కొనమని చెతులెత్తేసినట్లేనని, కాని కెసిఆర్ ప్రభుత్వం మక్కలు, జొన్నలు కొని అండగా నిలిచినట్లు చెప్పారు. పప్పుదినుసులు, నూనే విత్తనాలు, కందులు,పెసర్లు, శనిగలు, సన్‌ఫ్లవర్ లాంటి పంటలను కేవలం 25శాతం మాత్రమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతులకు భేషరతుగా క్షమాపణ చెప్పి, యదావిధిగా అన్ని పంటలను కొనుగోలు చేయాలని బిఆర్ఎస్ పక్షాన మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఈసమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఫారుక్‌హుస్సేన్, రాధకిషన్‌శర్మ, మచ్చవేణుగోపాల్ రెడ్డి,కాముని శ్రీనివాస్, పాల్గొన్నారు.

## ఇసుక బకాసురులు...యథేచ్ఛగా రవాణా

నిద్రపోతున్న రెవెన్యూ అధికారులు



**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ మండలం తో పాటు పట్టణంలో ఇసుక బకాసురులు రెచ్చిపోతున్నారు. నెంబర్ ప్లేట్లు లేని వాహనాలతో ఇసుక అక్రమంగా రవాణా చేస్తూ కోట్లాది రూపాయలు దండుకుంటున్నారు.ఒకపక్క భూగర్భ జలాలు ఎండిపోతుంటే మరోపక్క ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు.రాయికల్ మండలంలోని చుట్టుపక్కల గ్రామాలైన ఇటిక్యాల కొత్తపేట బోర్నపల్లి వాగుల్లో ఇసుకను రాత్రి పగలు తేడా లేకుండా ఇసుకను తోడేస్తున్నారు. ప్రభుత్వం ఆన్లైన్ ద్వారా ఇసుకను కొనుగోలు చేయాలని వినియోగదారులకు సూచిస్తున్న ఇలాంటి నిబంధనలు ఏమీ పట్టకుండా అక్రమార్కులు దాదాపు ఒక ట్రిప్పుకు దాదాపు రూపాయలు 3000 చొప్పున దండుకుంటున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఇలా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే భవిష్యత్తులో భూగర్భ జలాలు పూర్తిగా ఇంకిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాత్రి వేళల్లో ఇసుకను గ్రామ శివారులో డంపు చేసి నెంబర్ ప్లేట్ లేని వాహనాలతో రవాణా చేస్తూ అక్రమార్కులు అందిన కాడికి దండుకుంటున్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడంతో ఇసుక వాడకం అధికంగా పెరిగింది. ఇట్టి వాడకానికి అనుగుణంగా అక్రమార్కులు అక్రమ ఇసుక రవాణాకు తెర లేపారు. చిన్న చిన్న గల్లీలో నుండి ట్రాక్టర్లను అధిక స్పీడ్ తో నడుపుకుంటూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. రోడ్లపై వస్తే అధికారులకు,పోలీసులకు దొరికిపోతామనే భయంతో వారు గల్లీలలో అతివేగంతో ట్రాక్టర్లను నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉంది. ఓవైపు అధికారులు ఇసుక డంపులు సీజ్ చేస్తున్నప్పటికీ కూడా ఇసుక అక్రమ రవాణాకు అడ్డు అడ్డుకట్ట వేయడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రోజుకు వందల ట్రాక్టర్లు అక్రమంగా ఇసుకను రవాణా చేస్తుంటే రెవెన్యూ అధికారులు మాత్రం నిద్రపోతున్నట్టు వ్యవహరిస్తున్నారు. వార్తలు రాసిన మరుసటి రోజు హడావిడిగా ట్రాక్టర్లు పట్టుకొచ్చి సీజ్ చేసి ఫైన్ కట్టించుకుని వదిలేయడం. తరువాత తెల్లారి నుంచి షరా మామూలే అన్నట్టు అధికారులు మాత్రం చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. రాయికల్ పట్టణంలోని పంట కాలువ కేశవ్ నగర్ మీదుగా సాయంత్రం దాదాపు 6 గంటల నుండి ఇసుక ట్రాక్టర్ల రవాణా ప్రారంభమవుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.


## 56వ ఏట అడుగిడిన రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ 56వ ఏటా అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ప్రజలతో మమేకమవడం ద్వారా, అధికారానికి నిజం చెప్పే ధైర్యాన్ని ప్రదర్శించడం ద్వారా అత్యంత బలహీన, అణగారిన వర్గాల ప్రయోజనాల కోసం నిరంతరం పోరాడుతున్నారని పార్టీ అధినేత మల్లికార్జున్ ఖర్గే ఆయనను ప్రశంసించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాహుల్‌గాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆరోగ్యంతో దీర్ఘాయువుతో ఉండాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడైన గాంధీకి, ఆర్జేడీకి చెందిన తేజస్వి యాదవ్, ఎన్‌సిపి (ఎస్‌పి)కి చెందిన సుప్రియా సూలే తదితరులు శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు, ఇండియా కూటమిలోని పలు భాగస్వామ్య పార్టీల నాయకుల నుంచి కూడా హృదయపూర్వక శుభాకాంక్షలు అందాయి. దేశ ప్రగతి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం గళం విప్పినందుకు తమిళనాడు ముఖ్యమంత్రి, టివికె అధినేత సి. జోసెఫ్ విజయ్ కూడా రాహుల్‌గాంధీని ప్రశంసించారు. 'రాజ్యాంగ ఆదర్శాల పట్ల మీ అపరిమితమైన అంకితభావం, అణగారిన గొంతుల కోసం మీరు చేసిన రాజీలేని పోరాటం లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చాయి' అని ఖర్గే పేర్కొన్నారు. సమ్మిళితత్వం, సామాజిక న్యాయం, సామరస్యం, కరుణ అనే కాంగ్రెస్ పార్టీ సంప్రదాయాలు ఆయన ప్రజా జీవితంలో, నాయకత్వంలో ప్రతిరూపాలుగా కనిపిస్తాయన్నారు. దేశ ప్రగతి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం రాహుల్‌గాంధీ వినిపిస్తూనే ఉన్నందున, మంచి ఆరోగ్యం, దీర్ఘాయువు కలగాలని ఆకాంక్షిస్తున్నట్లు విజయ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రులు వి.డి. సతీసన్ (కేరళ), సుఖ్వీందర్ సింగ్ సుఖు (హిమాచల్ ప్రదేశ్), డి.కె. శివకుమార్ (కర్ణాటక) తెలంగాణ ఎ. రేవంత్ రెడ్డి, సీనియర్ నాయకులు సచిన్ పైలట్, అశోక్ గెహ్లాట్ తదితరులు రాహుల్ గాంధీకి ఆయన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ గాంధీకి శుభాకాంక్షలు తెలిపి, ఆయనను ప్రశంసించారు.


## క్రాస్ ఓటింగ్ ఆరోపణలు దురుద్దేశపూరితం

### కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేకు సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ లేఖ



**న్యూఢిల్లీ :** జార్ఖండ్‌లో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ఎమ్మెల్యేలు క్రాస్‌ఓటింగ్‌కు పాల్పడ్డారని వచ్చిన ఆరోపణలను దురుద్దేశపూరితమైనవిగా పార్టీ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అభివర్ణించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు లేఖ రాస్తూ ఆ ఆరోపణలపై తీవ్ర నిరసన తెలిపారు.
కూటమి ఏర్పడినప్పటి నుండి సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ అత్యంత నిబద్ధత కలిగిన భాగస్వామ్య పక్షాలలో ఒకటిగా ఉందని, కూటమిలోని పార్టీల మధ్య పరస్పర విశ్వాసాన్ని దెబ్బతీసే అనవసరమైన ఆరోపణల పట్ల భట్టాచార్య హెచ్చరికలు చేశారు. గురువారం జార్ఖండ్ నుంచి జరిగిన రాజ్యసభ ఎన్నికలలో తమ అభ్యర్థి ప్రణవ్ ఝా ఓటమికి తమ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ నిందించడం చూసి తాము దిగ్భ్రాంతి చెందామని భట్టాచార్య ఆ లేఖలో పేర్కొన్నారు. 'ఇది దురుద్దేశపూరితమైన అబద్ధం. ప్రతిపక్ష ఎమ్మెల్యేల సమావేశంలో ప్రణాళిక ప్రకారం మా ఇద్దరు ఎమ్మెల్యేలు ఝాకే ఓటు వేశారు. ఓట్లు వేయడానికి ముందే మా పోలింగ్ ఏజెంట్లు ఓట్లను సక్రమంగా ధృవీకరించారు' అని ఆయన అన్నారు. తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ ఈ చర్యను దీపాంకర్ తమ ఎమ్మెల్యేలపై పూర్తిగా నిరాధారమైన, దురుద్దేశపూర్వక ప్రచారం అని మండిపడ్డారు. తమ పార్టీ ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నమని పేర్కొన్నారు. ఎన్నికలలో బిహార్, జార్ఖండ్‌లో తమ ఎమ్మెల్యేలు రాజ్యసభలో ప్రతిపక్ష అభ్యర్థులకే ఓటు వేశారని, ఇండియా కూటమి ఏర్పడినప్పటి నుండి తమ పార్టీ కూటమికి అత్యంత నిబద్ధత కలిగిన భాగస్వాములలో ఒకటిగా ఉందన్నారు. 'ఇండియా కూటమిలోని పార్టీల మధ్య పరస్పర విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా మిత్రపక్షాలపై ధృవీకరించని, అనవసరమైన ఆరోపణలు చేయడం ఆపాలని కాంగ్రెస్ నాయకులను కోరాలని తాము మిమ్మల్ని విజ్ఞప్తి చేస్తున్నామని అని భట్టాచార్య స్పష్టం చేశారు. క్రాస్ ఓటింగ్ జరిగిందన్న కాంగ్రెస్ ఆరోపణలను తోసిపుచ్చుతూ ఎన్నికలలో తమ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ అభ్యర్థికే ఓటు వేశారని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ గురువారం స్పష్టం చేసింది. కాంగ్రెస్ తన సొంత ఎమ్మెల్యేలందరి మద్దతును పొందడంలో విఫలమైందని కూడా ఆ పార్టీ ఆరోపించింది.

## టెలిగ్రామ్ యాప్‌పై తాత్కాలిక బ్యాన్.. కేంద్ర నిర్ణయానికి ఢిల్లీ హైకోర్టు సమర్థన




**న్యూఢిల్లీ :** నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్ యాప్‌ను తాత్కాలికంగా కేంద్రం బ్యాన్ చేసిన విషయం తెలిసిందే. అయితే కేంద్ర నిర్ణయాన్ని ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ఆ నిర్ణయం తీసుకున్నట్లు హైకోర్టు చెప్పింది. టెలిగ్రామ్ యాప్ కేసులో శుక్రవారం జస్టిస్ తేజస్ కరియా తన తీర్పును వెలువరించారు. సెక్షన్ 69ఎ కింద ప్రభుత్వం టెలిగ్రామ్ మెసేజింగ్ యాప్‌ను బ్యాన్ చేసిందని, ఆ యాప్‌ను బ్యాన్ చేయడానికి గల కారణాలు సంతృప్తికరంగా ఉన్నాయని, ప్రభుత్వం రక్షణాత్మక చర్యలు తీసుకున్నదని, కేంద్రం ఇచ్చిన ఆదేశాలు అసమతుల్యంగా ఉన్నట్లు భావించలేమని ఢిల్లీ హైకోర్టు చెప్పింది. తాత్కాలిక బ్యాన్ కోసం ప్రభుత్వం సమర్పించిన కారణాలు సరిపోతాయని, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆ యాప్‌పై బ్యాన్ తప్పదని, ఐటి చట్టంలోని 69ఎ సెక్షన్ ప్రకారం ప్రభుత్వం యాప్‌ను బ్లాక్ చేసిందని కోర్టు పేర్కొన్నది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించేందుకు అన్ని కారణాలు ఉన్నాయని జస్టిస్ తేజస్ అన్నారు. కేంద్రం అనాలోచితంగా ఆదేశాలు ఇవ్వలేదని, ఐటి చట్టం ప్రకారమే ఆ నిర్ణయం తీసుకున్నట్లు కోర్టు తెలిపింది. ప్రశ్నాపత్రాల పేపర్లను లీకేజ్ చేసి.. కొన్ని ముఠాలు చీటింగ్‌కు పాల్పడుతున్నాయని, కొందరు ఆ పేపర్లను టెలిగ్రామ్ యాప్ ద్వారా కూడా షేర్ చేసుకున్నట్లు కోర్టు చెప్పింది. ఈ నేపథ్యంలో నీట్‌రీఎగ్జామ్‌ను దృష్టిలో పెట్టుకుని, టెలిగ్రామ్ యాప్‌ను జూన్ 22వ తేదీ వరకు కేంద్రం బ్లాక్ చేసింది. ఇక జూన్ 30వ తేదీ వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను డిజేబుల్ చేసింది. దేశంలో ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు స్వేచ్ఛగా ఆపరేట్ చేస్తుండగా, కేవలం తమపై ఎందుకు బ్యాన్ విధించారని టెలిగ్రాం యాప్ కేంద్ర ఆదేశాలను సవాల్ చేస్తూ కోర్టుకు వెళ్లింది. జూన్ 21వ తేదీన నీట్ రీఎగ్జామ్‌ను నిర్వహించనున్నారు.

# రూ. కోటి పరిహారమివ్వండి

### పరీక్షల వివాదాల మధ్య ఆత్మహత్య విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటునందించాలి

### ప్రధాని మోదీకి సిజెపి వ్యవస్థాపకుడు దీప్కే లేఖ




**న్యూఢిల్లీ :** పరీక్షల వివాదాల మధ్య ఆత్మహత్య చేసుకున్నట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం అందించాలని యువత నేతృత్వంలోని 'బొద్దింకల జనతా పార్టీ' (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. జంతర్ మంతర్ వద్ద ప్రతిపాదిత విద్యార్థుల నిరసన ప్రదర్శనకు ముందు ఆయన ప్రధానికి లేఖ రాయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలన్న తమ సంస్థ డిమాండ్‌ను ఆయన లేఖలో పునరుద్ఘాటించారు. జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న జంతర్ మంతర్ వద్ద సిజెపి రెండవసారి నిరసన ప్రదర్శన నిర్వహించనుంది. ఈ ప్రదర్శనలో పరీక్షలలో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా, విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ తమ ప్రచారాన్ని తీవ్రతరం చేయాలని ఆ సంస్థ యోచిస్తోంది. 'మన దేశ భవిష్యత్తుకే ముప్పుగా పరిణమించిన, తీవ్రమవుతున్న ఒక సంక్షోభంపై మీ తక్షణ దృష్టిని ఆకర్షించడానికి, అంటే మన యువ విద్యార్థుల జీవితాలు, మానసిక శ్రేయస్సుకు సంబంధించిన విషయంపై, తాను భారమైన హృదయంతో రాస్తున్నాను' అని దీప్కే ఆ లేఖలో పేర్కొన్నారు. ఇటీవలి వారాల్లో 11 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, వీరిలో గత 48 గంటల్లోనే ఐదుగురు మరణించారని ఆయన పేర్కొన్నారు. తిరిగి పరీక్షలు జరిగే అవకాశంపై అనిశ్చితితో విద్యార్థులు సతమతమవుతుండటంతో పరిస్థితి మరింత దిగజారుతోందని ఆయన అన్నారు. తమ పిల్లల విద్యా ఆకాంక్షలకు మద్దతుగా చాలా కుటుంబాలు భారీ విద్యా రుణాలు తీసుకున్నాయని పేర్కొంటూ బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని ఆయన కేంద్రాన్ని కోరారు. తమ జీవితకాలపు సొమ్మును ధారపోసి చదివించిన పిల్లలనే కోల్పోయి, ఈ కుటుంబాలు పూర్తిగా నిరుపేదలుగా మిగిలిపోయాయి అని దీప్కే రాశారు. పేపర్ లీక్‌లు తీవ్ర సంక్షోభంగా అభివర్ణిస్తూ దానివల్ల ప్రభావితమైన కుటుంబాలకు కోటి రూపాయల పరిహార ప్యాకేజీని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాన్‌ను తొలగించాలన్న తన డిమాండ్‌ను సిజెపి వ్యవస్థాపకుడు పునరుద్ఘాటించారు. విద్యార్థులు జవాబుదారీతనం కోరుకుంటున్నారని ఆయన నొక్కి చెప్పారు. 'బొద్దింకల జనతా పార్టీ గత నెల రోజులుగా విద్యాశాఖ మంత్రి రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు చేస్తోంది. విద్యార్థుల మైన తాము కోరుకునేదల్లా, ఈ ప్రాణనష్టానికి కొంత జవాబుదారీతనం చూడటమేనని అన్నారు. విద్యాశాఖ మంత్రిని తొలగించడం ప్రభుత్వ బలహీనతను కాకుండా, జవాబుదారీతనం పట్ల నిబద్ధతను ప్రదర్శిస్తుందని దీప్కే వ్యాఖ్యానించారు. చర్యలు తీసుకోకపోవడం విద్యార్థులు, తల్లిదండ్రులలో నిరాశా భావాలను మరింత పెంచుతుందని ఆయన హెచ్చరించారు. తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన నొక్కిచెప్పారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యాపరమైన నిరాశతో ఇంకెంతమంది యువ జీవితాలు అకాలంగా ముగిసిపోకుండా చూసేందుకు నిర్మాణాత్మక సంస్కరణలు తీసుకురావాలని ఆయన కోరారు. 'మా డిమాండ్‌ను వినిపించేందుకు భారతదేశం నలుమూలల నుండి విద్యార్థులు జూన్ 20వ తేదీ నుంచి జంతర్ మంతర్ వద్ద సమావేశమవుతున్నారు. భారతదేశ భవిష్యత్తు గొంతును మీ ప్రభుత్వం వింటుందని మేము ఆశిస్తున్నాము,' అని ఆయన స్పష్టం చేశారు.

## అసమ్మతి ఎంపిల మధ్య విభేదాలు

### పదవి దక్కని వారికి అదనంగా రూ. 25 కోట్లు ఇచ్చేలా ఒప్పందం కుదిరింది : సంజయ్‌రౌత్ ఆరోపణ



**ముంబయి :** కేంద్ర మంత్రి పదవిని ఎవరు చేపట్టాలనే విషయంలో తమ పార్టీకి చెందిన అసమ్మతి ఎంపిల మధ్య విభేదాలు తలెత్తాయని శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ చెప్పారు. పదవి దక్కని వారికి అదనంగా రూ. 25 కోట్లు ఇచ్చేలా ఒక ఒప్పందం కుదిరిందని ఆయన ఆరోపించారు. సేన (యుబిటి) ఎంపిలు సంజయ్ దినా పాటిల్, సంజయ్ దేశ్‌ముఖ్, సంజయ్ జాదవ్, భాసాహెబ్ వాక్‌చౌరే, నాగేశ్ పాటిల్‌అష్టికర్, ఓంప్రకాష్ రాజే నింబాల్కర్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని అధికార శివసేనలో చేరే అవకాశం ఉన్నట్లు వర్గాల సమాచారం. ఉద్ధవ్ థాక్రే నాయకత్వంతో తమకు విభేదాలు ఉన్నాయని స్పష్టం చేస్తూ, వీరు గురువారం జరిగిన సేన (యుబిటి) పార్లమెంటరీ పార్టీ సమావేశానికి హాజరుకాలేదు. కాగా, రౌత్ శుక్రవారం విలేకరులతో కేంద్రంలో మంత్రి పదవిని ఎవరు చేపట్టాలనే విషయంలో ఆ అసమ్మతి వర్గంలో ఘర్షణలు ఉన్నాయి అని అన్నారు. ఆరుగురిలో ఒకరు మాత్రమే మంత్రి కాగలరు, కాబట్టి మిగిలిన వారికి (పార్టీ మారినందుకు) అదనంగా రూ. 25 కోట్లు ఇచ్చేలా నిర్ణయం, ఒప్పందం కుదిరాయని ఆయన ఆరోపించారు. తిరుగుబాటుకు దిగిన ముంబ.ఇ ఈశాన్య నియోజకవర్గ ఎంపి సంజయ్ దినా పాటిల్‌ను విమర్శిస్తూ, ఆయన పార్టీని విడిచిపెట్టడానికి ఎటువంటి కారణం లేదని థాక్రే అన్నారు. ఒక 'విధేయుడిని' కాదని, ఆయన కుమార్తె రాజుల్ పాటిల్‌కు కూడా బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం (టికెట్) కల్పించారు. రాజుల్ ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించారని గుర్తు చేశారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన పార్టీ సమావేశానికి సంజయ్ దినా పాటిల్ హాజరవుతారని తాము చాలా నమ్మకంతో ఉన్నామని రౌత్ చెప్పారు. అయితే అసమ్మతి ఎంపిలకు 'వైప్లస్' భద్రత కల్పించినందుకు మహారాష్ట్ర ప్రభుత్వంపై కూడా రౌత్ విమర్శలు గుప్పించారు. అలాగే ఎటువంటి రక్షణ లేకుండా తిరగాలని వారికి సవాలు విసిరారు. పోలీసు శాఖ ఉన్నది కేవలం ద్రోహుల రక్షణ కోసమేనా? ప్రజల డబ్బు వృథా అని రౌత్ అన్నారు. అసమ్మతి ఎంపిలు ముందుగా రాజీనామా చేసి, ప్రజల నుండి కొత్త తీర్పును కోరాలని ఆయన డిమాండ్ చేశారు.

## 'గ్రేట్ నికోబార్' పర్యావరణ అంచనాలు పూర్తిగా అసంపూర్ణం

### కేంద్రమంత్రి భూపేందర్‌కు కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ లేఖ



**న్యూఢిల్లీ :** గ్రేట్ నికోబార్ దీవి ప్రాజెక్టు విషయంలో పారదర్శకత లోపించిందని, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై పర్యావరణ ప్రభావ అంచనాలు పూర్తిగా అసంపూర్ణంగా కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ శుక్రవారం పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు లేఖ రాశారు. గత రెండేళ్లుగా ఈ ప్రాజెక్టుపై వీరిద్దరి మధ్య జరిగిన లేఖల పరంపరలో భాగంగా రమేశ్ ఈ తాజాగా మరోసారి లేఖ సంధించారు. ఈనెల 3న రాసిన లేఖకు భూపేందర్ 13వ తేదీన ఇచ్చిన సమాధానం నిరాశాజనకంగా, అసంతృప్తికరంగా ఉన్నప్పటికీ, అందుకు ధన్యవాదాలు అని అన్నారు. గ్రేట్ నికోబార్ దీవి ప్రాజెక్టులోని వివిధ అంశాలకు సంబంధించిన పర్యావరణ ప్రభావ అంచనాలు స్పష్టంగా అసంపూర్ణంగా ఉన్నాయని, అవి స్వయంగా పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నిర్దేశించిన మార్గదర్శకాలకు ఏమాత్రం అనుగుణంగా లేవని మరోసారి చెప్పడానికి చింతిస్తున్నానని మాజీ పర్యావరణ మంత్రి యాదవ్‌కు రాసిన లేఖలో రమేశ్ పేర్కొన్నారు. ఈ విషయాలను తాను గతంలో రాసిన లేఖలలోనే వివరంగా పేర్కొన్నానని, వాటికి యాదవ్ వద్ద సరైన సమాధానం లేదని గుర్తుచేశారు. 'పర్యావరణ అనుమతిలో భాగంగా విధించిన షరతులకు నిరంతర పర్యవేక్షణ అవసరమని మీ వాదన. ఈ నేపథ్యంలో, మీ పరిశీలన కోసం కొన్ని అంశాలను తెలియజేస్తున్నాను. ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిబంధనల అమలుకు సంబంధించిన నివేదికలను (compliance reports) బహిర్గతం చేయాలి. కానీ మార్చి 2024 తర్వాత అటువంటి నివేదికలేవీ అందుబాటులో ఉంచలేదు. ప్రాజెక్ట్ పర్యవేక్షణ కమిటీ సమావేశాల వివరాలను అవి జరిగిన చాలా నెలల తర్వాత అప్‌లోడ్ చేస్తున్నారు' అని రమేశ్ అన్నారు. గాలథియా బేలోని ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్ట్ పర్యావరణ విధ్వంసానికి దారితీస్తుందని, పగడపు దిబ్బల భారీ నాశనానికి కారణమవుతుందని పేర్కొంటూ, బుధవారం కాంగ్రెస్ ఈ ప్రాజెక్ట్‌పై ప్రభుత్వాన్ని విమర్శించింది. ఈ ప్రాజెక్ట్‌పై రమేశ్ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు రెండు లేఖలు కూడా రాశారు. ఐఎన్ఎస్ బాజ్ రన్‌వే పూర్తి విస్తరణ తిరస్కరణను పునఃపరిశీలించాలని ఆయనను కోరారు. అటవీ హక్కుల చట్టం, 2006లోని నిబంధనలు అక్షరాలా, స్ఫూర్తితో అమలు అయ్యేలా చూడటమే కాకుండా, వాస్తవంగా అమలు అయ్యేలా చూడాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరమ్‌కు రెండు లేఖలు కూడా రాశారు.

## 'బెస్ట్' ఉద్యోగులు నిరవధిక సమ్మె

### 32 బస్సులు మాత్రమే రోడ్లపై రాకపోకలు


### తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న వేలాది మంది ప్రయాణికులు



**ముంబయి :** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ డిమాండ్లు వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తూ బృహన్ ముంబయి ఎలక్ట్రిక్ సప్లయ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ (బెస్ట్) ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగారు. దీంతో శుక్రవారం ఉదయం రద్దీ వేళల్లో ఆ సంస్థకు చెందిన 2,766 బస్సులలో కేవలం 32 మాత్రమే నగర రోడ్లపై తిరిగాయని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. నగరంలోని వివిధ డిపోల నుండి కేవలం 38 బస్సులు మాత్రమే బయలుదేరగలిగాయని, సమ్మె చేస్తున్న ఉద్యోగులు రాళ్లు రువ్వడం, అడ్డంకులు సృష్టించడం వంటి ఘటనల కారణంగా వాటిలో ఆరు బస్సులు వెనక్కి తిరిగి రావాల్సి వచ్చిందన్నారు. దీంతో కేవలం 32 బస్సులు మాత్రమే రాకపోకలు సాగించాయన్నారు. బృహన్ ముంబయి ఎలక్ట్రిక్ సప్లయ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ (బెస్ట్) ఉద్యోగుల సమ్మె కారణంగా ఉదయం రద్దీ సమయంలో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నగరవ్యాప్తంగా బస్ స్టాప్‌ల వద్ద పొడవైన క్యూలు కనిపించాయి. తరువాత చాలా మంది ప్రయాణికులు సబర్బన్ రైళ్లు, మెట్రో సేవలు, ఆటోరిక్షాలు, టాక్సీలు, యాప్ ఆధారిత క్యాబ్‌ల వంటి ప్రత్యామ్నాయ రవాణా మార్గాలపై ఆధారపడవలసి రాగా, మరికొందరు తమ కార్యాలయాలకు, విద్యాసంస్థలకు చేరుకోవడంలో జాప్యం జరిగినట్లు తెలిపారు. వారపు రోజులలో ప్రజా రవాణాలో పనికి వెళ్తానని, కానీ శుక్రవారం రోడ్లపై బస్సులు లేకపోవడంతో బైక్‌పై వచ్చినట్లు కన్సల్టెంట్‌గా పనిచేసే సచిన్ నలవాడే అన్నారు. గురువారం అర్ధరాత్రి తర్వాత ప్రారంభమైన ఈ నిరవధిక సమ్మెకు 12 యూనియన్లతో కూడిన సంయుక్త కార్యాచరణ కమిటీ అయిన 'బెస్ట్ సంయుక్త కామ్‌గార్ కృతీ సమితి' పిలుపునిచ్చింది. నగరాన్ని బందీగా పట్టుకోవద్దని, తిరిగి విధుల్లో చేరాలని తాను సమ్మె చేస్తున్న ఉద్యోగులకు విజ్ఞప్తి చేసినట్లు బెస్ట్ చైర్మన్ తృష్ణ విశ్వరావ్ పిటిఐకి తెలిపారు. బెస్ట్ బడ్జెట్‌ను బిఎంసి (బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్) బడ్జెట్‌తో విలీనం చేయడం, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల చట్టపరమైన బకాయిలను ఒకేసారి చెల్లించడం, 2016–2026 కాలానికి ఏడవ వేతన సంఘం సిఫార్సులను అమలు చేయడం, రవాణా, విద్యుత్ విభాగాలలో కాంట్రాక్టు పద్ధతులను రద్దు చేయడం, వెటొలీజు బస్సు కార్మికులను బెస్ట్‌లో విలీనం చేసుకోవడం వంటివి ఉద్యోగుల కీలక డిమాండ్లలో ఉన్నాయి. సమ్మెకు దిగవద్దని ఉద్యోగులను నిరోధిస్తూ పారిశ్రామిక న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, నిత్యావసర సేవలకు అంతరాయం కలిగించడాన్ని నిషేధించే మహారాష్ట్ర నిత్యావసర సేవల నిర్వహణ చట్టం (మెస్మా)ను మహారాష్ట్ర ప్రభుత్వం ప్రయోగించినప్పటికీ, సమ్మె ప్రారంభమైంది. ముంబై సబర్బన్ రైల్వే నెట్‌వర్క్ తర్వాత, బెస్ట్ రెండవ అతిపెద్ద ప్రజా రవాణా సంస్థగా ఉంది. ఇది తన బస్సు సర్వీసుల ద్వారా ప్రతిరోజూ సుమారు 25 లక్షల మంది ప్రయాణికులను రవాణా చేస్తుంది. అంతేకాకుండా, ఇది దక్షిణ , మధ్య ముంబైలోని 10 లక్షలకు పైగా వినియోగదారులకు విద్యుత్‌ను కూడా సరఫరా చేస్తుంది.

## నీట్ రీ-ఎగ్జామ్‌కు లైన్ క్లియర్


### ఆ పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ :** వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ రీ ఎగ్జామ్‌కు అడ్డంకులు తొలగిపోయాయి. ఈ పరీక్షను నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈనెల 21న జరగబోయే రీ ఎగ్జామ్ యథాతథంగా కొనసాగుతుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇటీవల పరీక్ష నిలిపివేయాలంటూ కొందరు విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం అందుకు నిరాకరించింది. పిటిషన్లను అత్యవసరంగా విచారణ జరపాలంటూ అభ్యర్థుల తరఫు న్యాయవాది కోరగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం దాన్ని తోసిపుచ్చింది. నీట్‌కు సంబంధించిన అన్నీ పిటిషన్లు జస్టిస్ పిఎస్ నరసింహ ధర్మాసనం ముందుకు వెళ్లాయని వీటిని కూడా ఆ ధర్మాసనమే విచారిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులు వేసిన పిటిషన్లలో అత్యవసర పరిస్థితి లేదని ఆయన తేల్చిచెప్పారు. పేపర్ లీకేజీ, అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్‌లో సమస్యలు ఉన్నాయన్న పిటిషన్లను ఈ మేరకు సుప్రీంకోర్టు కొట్టివేసింది. విద్యార్థులు, నీట్‌యూజీ అభ్యర్థులు దాఖలు చేసిన ఒక ప్రత్యేక పిటిషన్‌పై తక్షణమే విచారణ చేపట్టాలని న్యాయవాది అదీల్ అహ్మద్ కోరారు. అభ్యర్థుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని 21న పరీక్ష నిర్వహించే సాధ్యాసాధ్యాలను పునఃపరిశీలించాలని ఈ మేరకు కేంద్రాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. 'మానసిక క్షోభ, తీవ్ర ఆందోళన, పరీక్ష రద్దు కావడం వల్ల తలెత్తిన అనిశ్చితి, తగినంత సన్నద్ధత సమయం లేకపోవడం, పరీక్ష సమగ్రతపై అనుమానాలు, ఇతర పరీక్షలతో తేదీలు ఒకేలా ఉండటం, నిర్వహణాపరమైన ఇబ్బందులు, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు వంటి అంశాల నేపథ్యంలో ఈ విజ్ఞప్తులు వస్తున్నాయి.' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, రీ ఎగ్జామ్ నిర్వహించాలన్న నిర్ణయాన్ని ఎవరూ సవాలు చేయలేదని, అభ్యర్థులకు తగినంత సన్నద్ధత సమయం ఇవ్వకుండా రీ ఎగ్జామ్ తేదీని ఏకపక్షంగా, అసమంజసంగా నిర్ణయించారని మాత్రమే పిటిషన్‌లో పేర్కొన్నారని న్యాయవాది తెలిపారు. 'రీ ఎగ్జామ్‌కు సంబంధించిన వాతావరణం, ప్రశ్నపత్రం లీక్ అయ్యిందన్న ఆరోపణలు, లీక్ అయినట్లు చెబుతున్న ప్రశ్నపత్రాలు, సోషల్ మీడియాలో వదంతులు, విస్తృతమైన తప్పుడు సమాచారం వంటి వాటితో నిండిపోయింది. దీనివల్ల అధికారులు పదేపదే స్పందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరీక్షా ప్రక్రియ రద్దు, తదనంతర వివాదాల కారణంగా నీట్ అభ్యర్థులు తీవ్ర మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. కొందరు అభ్యర్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్న వార్తలు కూడా వచ్చాయని బహిరంగ నివేదికలు వెల్లడించాయి' అని పిటిషన్ పేర్కొంది. బాధిత అభ్యర్థులందరికీ పరీక్షకు సిద్ధమయ్యేందుకు తగినంత సమయం కల్పించిన తర్వాతే నిర్వహించాలని కోరారు. పునఃపరీక్షను వాయిదా వేసి కొత్త తేదీని ఖరారు చేయాలని అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

## ఫుట్‌పాత్‌పై... నడిచే హక్కు ప్రాథమిక హక్కు

### సుప్రీంకోర్టు కీలక తీర్పు



**న్యూఢిల్లీ :** గుర్తించబడిన మార్గంలో నడిచే హక్కు ప్రాథమిక హక్కు అని గురువారం సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఒక ముఖ్యమైన తీర్పులో, సుప్రీంకోర్టు ఈ హక్కుకు గుర్తించబడిన మార్గాలలో మోటారు వాహనాల కంటే ప్రాముఖ్యత ఉంటుందని, ఇది ఆర్టికల్ 19 (1) (డి) కింద హామీ ఇవ్వబడిన సంచారహక్కు, ఆర్టికల్ 21 (జీవించే, స్వేచ్ఛ హక్కు)తో సహా ఇతర ప్రాథమిక హక్కులలో ఒక భాగమని పేర్కొంది.గుర్తించబడిన ఫుట్‌పాత్‌పై నడవడానికి పౌరుడికి ఉన్న ప్రాథమిక హక్కు ప్రధానమైనదని, మోటారు వాహనాల రాకపోకల కంటే దీనికే ప్రాధాన్యత ఉండాలని న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్.నర్సింహ, జస్టిస్ చందుర్కర్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. పాఠశాలకు తీసుకెళ్తుండగా తన ఐదేళ్ల కుమారుడికి సంబంధించిన ఒక దురదృష్టమైన ప్రమాద పరిహార కేసులోఅత్యున్నత న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది.'రాజ్యాంగంలోని పార్ట్–3 ప్రకారం నడిచే హక్కు ఒక ప్రాథమిక హక్కు. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (డి) , ఆర్టికల్ 19 (1) (ఎ), ఆర్టికల్ 19 (1) (సి), ఆర్టికల్ 21 కింద హామీ ఇవ్వబడిన సంచార హక్కులో అంతర్భాగం. నడిచే ప్రాథమిక హక్కులోకి, గుర్తించబడిన ఫుట్‌పాత్‌లపై నడిచే హక్కు కూడా వస్తుంది.ఈ హక్కులు ప్రాథమికమైనవి. మోటారు వాహనాల రాకపోకల కంటే కూడా వీటికి ప్రాధాన్యత ఉంటుంది' అని ధర్మాసనం తీర్పు ఇచ్చింది.'గుర్తించబడిన కాలిబాటలపై నడిచే ప్రాథమిక హక్కుకు అనుగుణమైన విధి కూడా ఉందని, రహదారి ఉన్నప్పుడు నడిచే వారి కోసం గుర్తించబడిన, చక్కగా నిర్వహించబడిన కాలిబాటలు ఉండేలా చూసుకోవాల్సిన విధి ఉంది' అని ధర్మాసనం పేర్కొంది.

## టిఎంసికి మరో ఇద్దరు నేతలు రాజీనామా

**కోల్‌కతా :** మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌లో నాయకత్వ సంక్షోభం మరింత తీవ్రమైంది. పశ్చిమ బెంగాల్ మాజీ మంత్రి జ్యోతి ప్రియ మల్లిక్ అనారోగ్య కారణాలతో పార్టీలోని అన్ని సంస్థాగత పదవులకు రాజీనామా చేయగా, ఉత్తర బెంగాల్‌కు చెందిన సీనియర్ నాయకుడు గౌతమ్ దేబ్ సిలిగురి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి నుంచి తప్పుకున్నారు. టిఎంసి అధినేత్రికి అత్యంత సన్నిహితుడైన మల్లిక్, తన నిర్ణయాన్ని పార్టీ నాయకత్వానికి ఇప్పటికే తెలియజేసినట్లు చెప్పారు. మరోవైపు, దేబ్ తన అధికారిక వాహనం, భద్రతా సిబ్బందిని వదులుకుని, సిలిగురి మున్సిపబల్ కమిషనర్‌కు తన రాజీనామా లేఖను పంపినట్లు అధికారులు తెలిపారు. 'గత కొన్ని నెలలుగా నా ఆరోగ్యం తీవ్రంగా క్షీణించినందున, టిఎంసిలోని అన్ని పదవులకు రాజీనామా చేశాను. అనారోగ్యం దృష్ట్యా పార్టీ వర్కింగ్ కమిటీ, ఇతర పదవులలో బాధ్యతలు నిర్వహించడం అసాధ్యంగా మారింది. పని చేయలేనప్పుడు పదవిని అంటిపెట్టుకుని ఉండటంలో అర్థం లేదు' అని మల్లిక్ అన్నారు. బెనర్జీ పార్టీలో పెద్ద ఎత్తున సంస్థాగత మార్పులు చేపట్టి, పునర్వ్యవస్థీకరించిన వర్కింగ్ కమిటీలో మల్లిక్‌ను చేర్చుకున్న కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన మల్లిక్, 2011 నుండి 2021 వరకు రాష్ట్ర ఆహార, సరఫరాల శాఖ మంత్రిగా, ఆ తర్వాతి మూడేళ్లు అటవీ శాఖ మంత్రిగా పనిచేశారు. కాగా, టిఎంసిలో తలెత్తిన ఈ తిరుగుబాటు, పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో అత్యంత కీలకమైన పరిణామాలలో ఒకటిగా నిలిచింది.

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP20AV-6624 | Suresh Bommakanti | SWIFT VDI DIESEL 5 SEATER | 2014 |
| 2 | TS03UD0017 | Khalil Mohammed | APE XTRA LDX BS6 DIESEL | 2021 |
| 3 | TS03EA-6888 | Pesaru Raj Kumar | INDICA VISTA VX TECH QUADRAJET BS4 DIESEL 5 SEAT | 2014 |
| 4 | TS31G-6017 | Arunkumar Kandhula | INDICA V2 LS TDI DIESEL 5 SEATER | 2015 |

**AUCTION DATE : 20-06-2026**
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**
H.No :31-3-2086/1, 1st Floor, Above City Union Bank, 100 Feet Road, Near Shyamala Garden, TNGO'S Colony, Waddepalliy, Hanamkonda – 506370. Cell : 9849955900 & 9573787776

# ఘర్షణల్లో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు మృతి

**బీరూట్:** దక్షిణ లెబనాన్‌లో జరిగిన ఘర్షణల్లో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు మరణించారు. వారిలో ఒక లెఫ్టినెంట్ కల్నల్ కూడా ఉన్నారు. పేలుడు పదార్థాలతో కూడిన డ్రోన్ దాడిలో మరో ఐదుగురు గాయపడ్డారు. అదనంగా, ఇజ్రాయెల్ సైన్యం తూర్పు లెబనాన్‌లోని బెకా లోయలో కూడా దాడులు నిర్వహించింది. ఇటీవల కుదిరిన తాత్కాలిక ఒప్పందం ప్రకారం లెబనాన్ సహా అన్ని రంగాల్లో సైనిక చర్యలను వెంటనే నిలిపివేయాలని, లెబనాన్ భౌగోళిక సమగ్రత, సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని పేర్కొన్నారు. అయితే ఇజ్రాయెల్, హెజ్బొల్లా ఈ ఒప్పందంలో ప్రత్యక్ష భాగస్వాములు కాకపోవడం సమస్యను మరింత క్లిష్టం చేస్తోంది. ఇరాన్ మద్దతుతో పనిచేస్తున్న హెజ్బొల్లాతో ఇజ్రాయెల్ యుద్ధం కొనసాగుతుండటంతో ఒప్పందం భవిష్యత్తుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్ దృష్టి, దక్షిణ లెబనాన్‌లో ఆక్రమించిన ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ తప్పుకోవడం తప్పనిసరి. అయితే ఒప్పందంలో అలాంటి స్పష్టమైన నిబంధన లేదు. ఇదే సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భద్రతా అవసరాలున్నంతకాలం తమ సైన్యం దక్షిణ లెబనాన్‌లో కొనసాగుతుందని ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు ఒప్పంద స్ఫూర్తికి విరుద్ధమని ఇరాన్ భావిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం నెతన్యాహు వైఖరిపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. అమెరికా సహకారం లేకుంటే ఇజ్రాయెల్ ఈ స్థితి లో ఉండేది కాదని వ్యాఖ్యానిస్తూ, లెబనాన్ విషయంలో నెతన్యాహు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఇది అమెరికా–ఇజ్రాయెల్ మధ్య వ్యూహాత్మక విభేదాలు పెరుగుతున్న సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. లెబనాన్‌లో పోరాటాలు తీవ్రతరం కావడం తో స్విట్జర్లాండ్ చర్చలకు హాజరుకాకూడదని ఇరాన్ నిర్ణయించినట్లు ప్రాంతీయ వర్గాలు వెల్లడించాయి. ముఖ్యంగా నెతన్యాహు వ్యాఖ్యలు, ఇజ్రాయెల్ సైనిక చర్యలు తాత్కాలిక ఒప్పంద ఉల్లంఘనగా ఇరాన్ భావించినట్లు సమాచారం. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య జరగాల్సిన కీలక చర్చలు నిలిచిపోయాయి. ఆ చర్చల్లో ఆర్థిక ఆంక్షల సడలింపు, సముద్ర భద్రత, అణు కార్యక్రమంపై పర్యవేక్షణ, అమలు దశలు, ప్రాంతీయ భద్రతా హామీల వంటి అంశాలు చర్చించాల్సి ఉంది. ఇవే తుది ఒప్పందానికి పునాది కావాల్సి ఉంది. ఇదిలా ఉండగా, హోర్ముజ్ జలసంధిపై అమెరికా విధించిన నిర్బంధాన్ని ఎత్తివేయడంతో చమురు ట్యాంకర్లు మళ్లీ స్వేచ్ఛగా ప్రయాణించడం ప్రారంభించాయి. ఒప్పందం కుదిరిన తర్వాత ఒక్క రాత్రిలోనే 1.25 కోట్ల బ్యారెళ్లకుపైగా చమురు ఈ మార్గం మీదుగా రవాణా జరిగిందని అమెరికా తెలిపింది. ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతొల్లా మొజ్తబా ఖమేనీ ప్రత్యక్ష అమెరికా–ఇరాన్ చర్చలకు మద్దతు తెలుపుతూ చేసిన ప్రకటన కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. భవిష్యత్తులో జరిగే ముఖాముఖి చర్చలు శత్రువు అభిప్రాయాలను అంగీకరించడం కాదని ఆయన స్పష్టం చేశారు. ఇది ఇరాన్ వైఖరిలో మార్పుకు సంకేతంగా పరిగణిస్తున్నారు.



# కొత్త అవకాశాలకు ద్వారాలు తెరచిన ఒప్పందం

**బ్రిటన్‌తో వాణిజ్య భాగస్వామ్యంపై భారత విదేశంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రి**

**పారిస్:** భారత్–బ్రిటన్ మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య భాగస్వామ్య ఒప్పందం (సిఇటిఏ) కేవలం వాణిజ్యం, సాంకేతికతకే పరిమితం కాదని, రెండు దేశాల ప్రజలకు కొత్త అవకాశాల ద్వారాలు తెరిచే చారిత్రాత్మక ఒప్పందమని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రి వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్‌లో జరిగిన జి7 సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన అనంతరం మీడియాతో మాట్లాడిన మిశ్రి, వాణిజ్యం, సాంకేతికత, ప్రాంతీయ భద్రత, అంతర్జాతీయ భద్రతలు భారత్–బ్రిటన్ సంబంధాల ప్రధాన స్తంభాలని వివరించారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో జరిగిన సమావేశంలో సిఇటిఏ జూలై 15 నుంచి అమల్లోకి వస్తుందని రెండు దేశాల నాయకులు ప్రకటించారు. గత ఏడాది బ్రిటన్‌లో ఇరు ప్రధానుల సమక్షంలో సంతకం చేసిన ఈ ఒప్పందం అమలులోకి రావడం ద్వైపాక్షిక సంబంధాల్లో ఒక కీలక మైలురాయిగా మిశ్రి అభివర్ణించారు. ప్రస్తుతం సుమారు 48 బిలియన్ పౌండ్లుగా ఉన్న వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఇప్పటికే రెండు దేశాల వ్యాపార సంస్థలు ఈ ఒప్పందం అమలుకు సిద్ధమవుతున్నాయని చెప్పారు. బ్రిటన్ భారత దేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వాముల్లో ఒకటే కాక, కీలక సాంకేతిక భాగస్వామి కూడా అని మిశ్రి పేర్కొన్నారు. అయితే ఈ ఒప్పందం వాణిజ్యం, సాంకేతికతకు మించి ప్రజల రాకపోకలు, ఉపాధి అవకాశాలు, విద్యా, వృత్తిపరమైన సహకారాన్ని కూడా విస్తరించనుందని ఆయన అభిప్రాయపడ్డారు. దీంతో ఇరు దేశాల పౌరులకు కొత్త అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే సమయంలో భారత్–యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) చర్చలూ పురోగతి సాధించాయని మిశ్రి తెలిపారు. ప్రధాని మోదీ, ఉర్సులా వాన్ డెర్ లేయెన్, అంటోనియో కోస్టాలతో సమావేశమై, ఈ ఏడాది చివరి నాటికి భారత్–ఇయు ఎఫ్‌టిఏపై సంతకాలు జరిగేలా చర్యలు వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఫ్రాన్స్‌తో సంబంధాల గురించి మాట్లాడుతూ, భారత్–ఫ్రాన్స్ బంధాన్ని ప్రపంచంలోని అత్యంత బలమైన ద్వైపాక్షిక సంబంధాల్లో ఒకటిగా మిశ్రి అభివర్ణించారు. రక్షణ, అణు శక్తి, అంతరిక్ష రంగాల్లో ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా సన్నిహిత సహకారం కొనసాగుతోందని చెప్పారు. అంతేకాకుండా అంతర్జాతీయ వేదికలపై, అనేక ప్రాంతీయ అంశాలపై భారత్, ఫ్రాన్స్ దాదాపు ఒకే విధమైన దృక్పథాన్ని కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలో ఫ్రాన్స్ ఒక కీలక శక్తిగా ఉండటం వల్ల రెండు దేశాల మధ్య వ్యూహాత్మక సహకారానికి మరిన్ని అవకాశాలు ఏర్పడుతున్నాయని మిశ్రి వివరించారు.




# అంతర్జాతీయంగా ఒంటరైన ఇజ్రాయెల్

**అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ వ్యాఖ్య**

**వాషింగ్టన్ డిసి:** అమెరికా–ఇజ్రాయెల్ సంబంధాల్లో విభేదాలు మరింత బహిర్గతమయ్యాయి. ఇరాన్‌తో అమెరికా కుదుర్చుకున్న తాత్కాలిక శాంతి ఒప్పందాన్ని విమర్శించిన ఇజ్రాయెల్ ప్రభుత్వ సభ్యులపై అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇజ్రాయెల్ అంతర్జాతీయంగా ఒంటరైందని, అమెరికా అందిస్తున్న దౌత్య, సైనిక మద్దతు విలువను అక్కడి కొందరు నాయకులు గుర్తించడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. వైట్ హౌస్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన వాన్స్, ప్రస్తుతం ప్రపంచ నాయకులలో ఇజ్రాయెల్ పట్ల నిజమైన సానుభూతి చూపుతున్న ఏకైక నాయకుడు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రమేనని అన్నారు. ఇజ్రాయెల్‌కు ప్రధాన సమస్య ట్రంప్ కాదని, అమెరికా అధ్యక్షుడినే తమ పెద్ద సమస్యగా భావించే వారు వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవాలని హెచ్చరించారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై సైనిక చర్యలు ప్రారంభించాయి. నెలకుపైగా సాగిన ఈ యుద్ధంలో రెండు దేశాలు సమన్వయంతో పనిచేశాయి. అయితే ఏప్రిల్ 8న కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత విభేదాలు ప్రారంభమయ్యాయి. ఇజ్రా యెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు యుద్ధాన్ని కొనసాగించాలని భావించగా, అమెరికాలో యుద్ధ వ్యతిరేక భావనలు పెరగడం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడటం కారణంగా ట్రంప్ యుద్ధాన్ని ముగించే దిశగా అడుగులు వేశారు. నెతన్యాహు బహిరంగంగా ఒప్పందాన్ని విమర్శించకపోయినా, ఆయన మంత్రివర్గంలోని కొందరు సభ్యులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ముఖ్యంగా జాతీయ భద్రతా మంత్రి ఇటామర్ బెన్‌గ్వీర్, ట్రంప్ కుదుర్చుకున్న ఒప్పందానికి ఇజ్రాయెల్ కట్టుబడి ఉండదని ప్రకటించారు. అంతర్జాతీయ ఒత్తిడికి తలొగ్గబోమని కూడా స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన వాన్స్, నెతన్యాహు వ్యక్తిగతంగా ట్రంప్‌ను విమర్శించలేదని అంగీకరించినప్పటికీ, ఆయన కేబినెట్‌లోని కొందరు సభ్యులు కృతజ్ఞత లేని వైఖరి ప్రదర్శిస్తున్నారని అన్నారు. అమెరికా ఆర్థిక సహాయంతో కొనుగోలు చేసిన భారీ ఆయుధ సంపత్తి ద్వారానే ఇజ్రాయెల్ తన రక్షణను బలోపేతం చేసుకుందని గుర్తు చేశారు. అంతర్జాతీయ సమాజంలో ఇజ్రాయెల్‌కు మద్దతుదారులు చాలా తక్కువగా ఉన్నారని కూడా వ్యాఖ్యానించారు. ఇటీవల ట్రంప్ కూడా నెతన్యాహుపై అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.



# బ్రిటన్ పార్లమెంటుకు బర్న్‌హామ్ ఎన్నిక

# ప్రధాని స్టార్మన్ నాయకత్వానికి సవాలు!

**లండన్:** బ్రిటన్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అధికార లేబర్ పార్టీకి చెందిన ప్రముఖ నాయకుడు, గ్రేటర్ మాంచెస్టర్ మేయర్ ఆండీ బర్న్‌హామ్ ప్రత్యేక ఉపఎన్నికలో విజయం సాధించి పార్లమెంట్‌లోకి ప్రవేశించారు. ఈ విజయంతో ఆయన ప్రధాని కీర్ స్టార్మర్ నాయకత్వానికి ప్రధాన సవాలుదారుగా అవతరించారు. వాయువ్య ఇంగ్లాండ్‌లోని మేకర్‌ఫీల్డ్ నియోజకవర్గంలో జరిగిన ఉపఎన్నికలో బర్న్‌హామ్, వలస వ్యతిరేక విధానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్న రాబ్ కెన్‌యాన్‌ను ఓడించారు. ఈ విజయం ఆయనను లేబర్ పార్టీ భవిష్యత్ నాయకుడిగా, తద్వారా ప్రధానమంత్రి పదవికి బలమైన అభ్యర్థిగా నిలిపింది. 2024 సాధారణ ఎన్నికల్లో ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చిన స్టార్మర్ ప్రజాదరణ గత ఏడాదిలో గణనీయంగా తగ్గిపోయింది. ఆర్థిక వృద్ధిని సాధించడంలో, జీవన వ్యయ సంక్షోభాన్ని తగ్గించడంలో, ప్రజా సేవలను మెరుగుపరచడంలో ఆయన ప్రభుత్వం ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోయిందనే విమర్శలు పెరిగాయి. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో లేబర్ పార్టీ నిరాశాజనక ఫలితాలు సాధించడంతో పార్టీ ఎంపిలలో అసంతృప్తి మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో పలువురు సీనియర్ నాయకులు స్టార్మర్ నాయకత్వంపై బహిరంగంగానే విమర్శలు లేవనెత్తారు. మాజీ ఆరోగ్య మంత్రి వెస్ స్ట్రీటింగ్ కూడా నాయకత్వ మార్పు అవసరమని సంకేతాలు ఇచ్చారు. మేకర్‌ఫీల్డ్ ఎంపి జోష్ సైమన్స్ రాజీనామా చేయడంతో బర్న్‌హామ్‌కు పార్లమెంట్‌లోకి తిరిగి వచ్చే అవకాశం లభించింది. 56 ఏళ్ల బర్న్‌హామ్‌ను ‘కింగ్ ఆఫ్ ది నార్త్‘ అని పిలుస్తారు. 2017 నుంచి మాంచెస్టర్ మేయర్‌గా పనిచేస్తూ నగర అభివృద్ధికి నాయకత్వం వహించారు. స్థానిక స్థాయిలో అమలు చేసిన ‘మాంచెస్టరిజం‘ అభివృద్ధి నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేస్తానని ఆయన హామీ ఇస్తున్నారు. ‘ప్రజలు నాపై విశ్వాసం ఉంచితే రాజకీయాలను మార్చగలను‘ అని ఆయన ప్రకటించారు. బ్రిటన్ పార్లమెంటరీ వ్యవస్థ ప్రకారం అధికార పార్టీ మధ్యంతర కాలంలోనే నాయకుడిని మార్చుకునే అవకాశం ఉంది. లేబర్ పార్టీ ఎంపిలలో ఐదో వంతు మద్దతు లభిస్తే నాయకత్వానికి సవాలు విసరొచ్చు. ప్రస్తుతం బర్నమ్ పార్లమెంట్‌లోకి రావడంతో స్టార్మర్‌పై ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే స్టార్మర్ మాత్రం రాజీనామా చేసే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన అధికారాన్ని కొనసాగిస్తూ మార్పు తీసుకురావడానికి తాను పోరాడతానని తెలిపారు. అయినప్పటికీ, బర్నహామ్ విజయం లేబర్ పార్టీలో నాయకత్వ పోటీకి నాంది పలికే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి.



## కీలక చర్చలు వాయిదా (మొదటి పేజీ తరువాయి)

పర్యటనను తాత్కాలికంగా రద్దు చేసినట్లు వైట్ హౌస్ ప్రకటించింది. ఈ పరిణామానికి నేపథ్యంగా దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్–హెజ్బొల్లా మధ్య పోరాటాలు తీవ్రరూపం దాల్చడం ప్రధాన కారణంగా కనిపిస్తోందని అంతర్జాతీయ వార్తా కథనాలు పేర్కొంటున్నాయి. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో కనీసం 18 మంది మరణించగా, నలుగురు ఇజ్రాయెల్ సైనికులు కూడా హతమయ్యారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు దక్షిణ లెబనాన్‌లోని భద్రతా మండలంలో తమ సైన్యం అవసరమైనంతకాలం కొనసాగుతుందని ప్రకటించారు. ఇరాన్ మాత్రం ఇజ్రాయెల్ ఆక్రమించిన ప్రాంతాల నుంచి వెనక్కి వెళ్లాలని డిమాండ్ చేస్తోంది. అయితే, చర్చలకు అనుకూల సంకేతంగా ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతొల్లా మొజ్తబా ఖమేనీ అమెరికాతో ప్రత్యక్ష చర్చలకు మద్దతు ప్రకటించారు. భవిష్యత్తులో జరిగే ముఖాముఖి చర్చలు శత్రువు అభిప్రాయాన్ని అంగీకరించడమనే అర్థం కాదని ఆయన స్పష్టం చేశారు. దీంతో ఇరాన్ నాయకత్వానికి చర్చలు ముందుకు తీసుకెళ్లేందుకు రాజకీయంగా అవకాశం లభించినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. మొదట ఈ సమావేశం ఒప్పందంపై అధికారిక సంతకాల కార్యక్రమంగా జరగాల్సి ఉండగా, చివరకు ట్రంప్ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మాక్రాన్ సమక్షంలో వెర్సాయిల్స్ రాజభవనంలో ఒప్పందంపై సంతకం చేశారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ వేరుగా సంతకం చేశారు. ఈ ఒప్పందం ప్రకారం ఇరాన్ వద్ద ఉన్న అధిక సాంద్రత యురేనియం నిల్వలను అంతర్జాతీయ పర్యవేక్షణలో తగ్గించాల్సి ఉంటుంది. అలాగే అణ్వాయుధాల అభివృద్ధి చేయబోమని ఇరాన్ మరోసారి హామీ ఇచ్చింది. హోర్ముజ్ జలసంధిని సమర్థవంతంగా మూసివేసి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపగలిగినందున ఇరాన్ ప్రస్తుతం చర్చల్లో బలమైన స్థితిలో ఉందని నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు యుద్ధం కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన నష్టం వాటిల్లేదని ట్రంప్ కూడా అంగీకరించారు. అందువల్ల యుద్ధానంతర పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడమే ఇప్పుడు అమెరికా ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ చర్చల విజయం లేదా వైఫల్యం వాన్స్ రాజకీయ భవిష్యత్తుపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. విదేశీ యుద్ధాలకు వ్యతిరేకతను తన రాజకీయ గుర్తింపుగా మలచుకున్న వాన్స్, ఇప్పుడు ట్రంప్–ఇరాన్ ఒప్పందాన్ని సమర్థిస్తూ సంక్లిష్ట రాజకీయ వేడిని ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఇరాన్ పునర్నిర్మాణం కోసం ప్రతిపాదించిన 300 బిలియన్ డాలర్ల నిధిపై రిపబ్లికన్ పార్టీలోనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయినప్పటికీ అమెరికా పన్ను చెల్లింపుదారుల డబ్బు ఈ నిధికి వినియోగించబోమని ట్రంప్, వాన్స్ స్పష్టం చేశారు.

## 23న భారీ ప్రదర్శన (మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్, ఎంపి మల్లు రవి, టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రొఫెసర్ జి.హరగోపాల్, సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు అబ్బాస్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చలపతి, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హన్మేష్, ఎస్‌యుసిఐ రాష్ట్ర కార్యదర్శి మురహరి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా, ప్రొఫెసర్ జి.హరగోపాల్, వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు. గ్రామసభ లేదా వార్డు కమిటీలలో ముసాయిదా ఓటర్ల జాబితాను వెల్లడించడం, ఓటు హక్కు నిర్ధారణకు గ్రామ సభలు, వార్డు కమిటీలను అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం, ప్రజల వద్ద అందుబాటులో ఉన్న ధృవీకరణ పత్రాలను ఆమోదించడం, అలాగే ఓటు హక్కును, పౌరసత్వానికి ముడి పెట్టరాదని తదితర తీర్మానాలను రౌండ్ టేబ్ల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

### ప్రజా ఉద్యమాల ద్వారానే కేంద్ర ప్రభుత్వానికి అడ్డుకట్ట సాధ్యం : మల్లు రవి

ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలను అడ్డుకోవడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ద్వారానే అడ్డుకట్ట వేయగలుగుతామని, ఇందుకు అన్ని పార్టీలు కలిసి రాజకీయంగా చేపట్టాల్సిన వ్యూహాలకు పదును పెట్టాలని కాంగ్రెస్ ఎంపి మల్లు రవి అన్నారు. ఈనెల 25 నుంచి ఎస్‌ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో నిరంతరం సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, త ద్వారా ఓ బలమైన ప్రజా ఉద్యమం నిర్మించగలిగితే తప్ప కేంద్ర ప్రభుత్వం లొంగదన్నారు. ఇందుకు నాటి రైతు ఉద్యమమే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

### ఓటు ప్రాణ వాయువు : కూనంనేని సాంబశివరావు

ప్రజాస్వామ్యానికి ఓటు అనేది ప్రాణ వాయువు లాంటిదని కూనంనేని సాంబశివరావు అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడేందుకు ఎంత వరకైనా ఉద్యమాలకు సిద్ధమని ఆయన ప్రకటించారు. రాష్ట్రంలో దాదాపు 80 లక్షల మంది ఓటర్ల వివరాలు నిర్ధారణ కాలేదంటూ పత్రికల్లో వస్తున్న వార్తలు తీవ్రంగా కలవరపెడుతున్నాయని, రాష్ట్రంలో మూడు కోట్లకు పైగా ఓటర్లు ఉంటే వారిలో 80 లక్షల మంది వివరాలు లభ్యం కాకపోవడం చిన్న విషయం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు హక్కు నిరూపణకుగాను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ధృవీకరణ పత్రాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓటర్ల హక్కులను కాపాడేందుకు అఖిలపక్షం ఆధ్వర్యంలో ఎన్నికల కమిషనకు వినతిపత్రం అందజేయడంతో పాటు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించేలా ఒత్తిడి తెచ్చేందుకు పెద్ద ఎత్తున నిరసనలు, ఉద్యమాలకు సంసిద్ధం అవుదామని ఆయన పిలుపునిచ్చారు.

### ఓటుహక్కు లేకపోతే పౌరసత్వం లేనట్లే : కోదండరామ్

ఎంఎల్‌సి, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ ఓటు హక్కు కోల్పోవడం అంటే కేవలం ఓటు వేసే అవకాశం పోవడం మాత్రమే కాదని, ఇది భవిష్యత్తులో పౌరసత్వాన్ని కూడా కోల్పోయే ప్రమాదానికి దారితీయవచ్చని హెచ్చరించారు. పౌరసత్వం లేకపోతే రేషన్ కార్డు, ఆధార్ కార్డు లభించవని, తద్వారా ఇల్లు, రేషన్ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు పేద ప్రజలు దూరమయ్యే ప్రమాదం ఉందని, ఇది ముఖ్యంగా దళితులు, ఆదివాసీలు ప్రతి పేద వర్గానికి పెద్ద సమస్యగా మారనుందన్నారు. తాము ఈ దేశ పౌరులమేనని, ఇక్కడ ఓటు వేయడానికి అర్హులమేనని ప్రజలే స్వయంగా నిరూపించుకోవాల్సిన పరిస్థితి రావడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రమైన సమస్యను అధిగమించడానికి ఐక్య కార్యాచరణకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

### ఓటు హక్కును తొలగించడం పౌర హక్కుల హరించడమే : హరగోపాల్

ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో భాగంగా ఓటర్ల జాబితా నుండి పేర్ల తొలగింపు ప్రక్రియకు సమాజంలో ప్రశ్నించే గొంతులను, మేధావులను 'అర్బన్ నక్సల్స్'గా ముద్ర వేయడం వెనుక ఒక నిర్దిష్టమైన రాజకీయ భావజాలం దాగి ఉందని ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. ఒకప్పుడు ఎన్నికలను బహిష్కరించాలని నక్సల్స్ పిలుపునిచ్చేవారని, కానీ నేడు సాధారణ ప్రజల్లో చైతన్యం పెరిగి వారు ఓటు వేస్తున్న ఈ తరుణంలో ఓటర్ల జాబితా నుండి లక్షలాది మంది పేర్లను తొలగించడం ద్వారా పౌరుల ప్రాథమిక హక్కును హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ వంటి మైనారిటీలు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఓట్ల తొలగింపు ప్రక్రియపై అధికార పక్షాలు ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాయని, దీనిని తిప్పికొట్టడానికి వామపక్షాలు, ఇతర ప్రజాస్వామ్య శక్తులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు.

### సర్ ప్రక్రియ ఫాసిస్ట్ విధానం : మురహరి

‘సర్’ ప్రక్రియ పూర్తిగా ఫాసిస్ట్, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానమని, దీనిని విధానపరంగా ముక్త కంఠంతో ఖండించాలని ఎస్‌యుసిఐ రాష్ట్ర కార్యదర్శి మురహరి అన్నారు. ఎస్‌ఐఆర్ అనేది ఒక నిర్దిష్టమైన, వివక్షాపూరితమైన లక్ష్యంతో తీసుకువచ్చిన విధానమని విమర్శించారు. ఎస్‌ఐఆర్ పేరుతో ముఖ్యంగా ముస్లింలను లక్ష్యంగా చేసుకుని, వారి పౌరసత్వాన్ని ప్రశ్నించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. గతంలో జర్మనీలో హిట్లర్ ఏ విధంగానైతే యూదులను వేటాడి చంపేశాడో, ఈ విధానం కూడా అదే తరహాలో జాతి వివక్షతో, ఒక వర్గాన్ని నిర్మూలించే విధంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

### జీవించే హక్కును కాలరాయడమే : హన్మేష్

ఓటు హక్కును తొలగించడమంటే ఇది మనిషి జీవించే హక్కును కాలరాయడమేనని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హన్మేష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం మొత్తం వ్యవస్థలనే మార్చేలా, తన అధీనంలోకి తెచ్చుకునేలా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఓటు హక్కు తొలగించడమంటే పౌర సత్వం నిరాకరించడమేనని ఇదే జరిగితే లక్షలాది మంది ప్రజలు కాన్సంట్రేషన్ క్యాంపులలో ఉండాల్సి వచ్చే ప్రమాదం కూడా లేకపోలేదన్నారు.

రిటర్నింగ్ అధికారి దయ ఉంటేనే ఓటు హక్కు ఉంటుంది :అబ్బాస్

ఎస్‌ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటు హక్కును అనుమతించాలా లేదా అనే విషయంలో రిటర్నింగ్ ఆఫీసర్లకే పూర్తి విచక్షణాధికారాలు ఉంటాయని ఎలక్షన్ కమిషన్ స్వయంగా స్పష్టం చేసిందని సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు అబ్బాస్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఓటు నిర్ధారణకు సర్టిఫికెట్ ఉన్నంత మాత్రాన సరిపోదని, దానిని ఆమోదించాలా లేదా అనేది ఆ అధికారి భావజాలంపై ఆధారపడి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

### రాజకీయ దురుద్దేశంతో ఓటు హక్కు తొలగింపు : చలపతి

పౌరసత్వ చట్టం, ఎన్‌ఆర్‌సి లాంటి విధానాలు దేశంలోని మైనారిటీలను, ముఖ్యంగా ముస్లింలను గురిచేస్తున్నాయని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చలపతి ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా నుండి పేర్ల తొలగింపు ప్రక్రియ వెనుక ఒక రాజకీయ ఉద్దేశం ఉందని, వలసదారులు, పేదలు, ఆదివాసీలను ఇది ఇబ్బందుల్లోకి నెడుతుందని పేర్కొన్నారు.

## దారి చూపేనా? (మొదటి పేజీ తరువాయి)

అందులో 0.18 ఎకరాల భూమి కాలువ నిర్మాణం కోసం ప్రభుత్వం తీసుకుంది. మిగిలిన 1.06 ఎకరాల భూమి రైతు ఆధీనంలో ఉండి దీనిపై హక్కు కలిగి ఉన్నాడు. కానీ ధరణితో ప్రభుత్వం స్వీకరించిన మొత్తం సర్వే నెంబర్‌ను నిషేధిత జాబితాలో చేర్చడంతో ఇప్పుడు ఆ రైతుకు చెందిన 1.06 ఎకరాలకు పట్టా దక్కలేదు. దీని కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు.

**నిజాం నాటి హద్దులే :** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా ఇంత వరకు సమగ్ర భూ సర్వే జరగలేదు. చాలా గ్రామాల్లో రెవెన్యూ అధికారుల తప్పిదాలు రైతులకు శాపంగా మారాయి. పట్టాదారు పాసుపుస్తకంలో ఉన్న సర్వే నెంబర్‌కు ఆ రైతు సాగు చేసుకుంటున్న సర్వే నెంబర్‌కు పొంతన కుదర డం లేదు. హక్కు ఒక చోట ఉంటే సాగు మరో చో ట చేసుకుంటున్నాడు. ఇది అనేక దశాబ్దాలుగా జరుగుతూనే ఉంది. కానీ భూ ధరలు పెరిగిన తర్వా త కొందరు పైరవీకారులు దీనిని ఆధారంగా చేసుకుని అమాయక రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. ఉదాహరణకు ఖమ్మంజిల్లా కొణిజర్ల మం డలం గుబ్బగుర్తి రెవెన్యూలో ఈ పరిస్థితిని ఉన్నతాధికారులు సైతం గుర్తించారు. రైతులు ఇప్పుడు సా గు చేసుకుంటున్న దానిని బట్టి భూ హద్దులు కేటాయించాలని రైతాంగం దశాబ్దాలుగా కోరుతున్నా దీనికి పరిష్కారం దొరకడం లేదు. రైతులు రాష్ట్ర ఉ న్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి మా భూమి ఎ క్కడుందో తేల్చండి అని 10 నుంచి 12 సంవత్సరాలు గడిచినా సమస్యకు పరిష్కారం దొరకలేదంటే భూ సమస్య ఎంత తీవ్రంగా ఉందో అవగతమవుతుంది. మారిన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని భూ సమగ్ర సర్వే చేసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ పనికి పూనుకోవడం లే దు. కాగితాల పైన తప్ప వాస్తవ పరిశీలన జరగకపోవడం భూ సమస్య మరింత పెరగడానికి కారణమవుతుంది. కనీసం సమస్యాత్మాక గ్రామాల్లోనైనా భూ సమస్యకు సంబంధించి సత్వర పరిష్కారం ల భించేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**అసైన్డ్‌కు దొరకని పట్టా :** 1960 దశకంలో తెలంగాణలో భూమి లేని నిరుపేదలకు అప్పటి ప్రభుత్వం భూ పంపిణీ చేసింది. అప్పట్లోనే రైతులకు సామూహిక పట్టాలను అందజేశారు. కొంత మంది రైతుల వద్ద వివిధ పనుల నిమిత్తం కేటాయించిన భూమిని తీసుకోగా మరికొన్ని చోట్ల రైతులు ఆర్థిక ఇబ్బందులతో భూమిని విక్రయించారు. కానీ 60 శాతం మంది రైతుల చేతుల్లో ఇంకా అసైన్డ్ భూమి ఉన్నది. ఇందులో పైరవీకారులకు భూమిపై హక్కు దక్కింది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు అందజేసిన పాసుపుస్తకాల్లో అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చారు. 1960 దశకం నుండి ఇప్పటి వరకు అదే భూమిని సాగు చేసుకుంటున్న వ్యక్తులకు మాత్రం పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వలేదు. అసైన్డ్ భూములను లబ్దిదారుల నుంచి కొనుగోలు చేసిన వారికి సైతం ప ట్టాలు ఇచ్చిన అధికారులు లబ్దిదారుల వారసుల కు పట్టాలు ఇవ్వడానికి రక రకాల కొర్రీలు పెడుతున్నారు. ఒక ఖమ్మం జిల్లాలోనే సుమారు రెండు లక్షల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయి. వీ టి పై సమగ్ర విచారణ జరిపించి 1960 దశకంలో ప ట్టా పొందిన వారసులకు భూ భారతి ద్వారా ప ట్టాలు అందజేయాలని అసైన్డ్ భూములు కలిగిన రైతులు కోరుతున్నారు.

**భూ భారతిపైనే ఆశలు :** ఏ రెవెన్యూ కార్యాలయానికి వెళ్లినా భూ సమస్యల పైనే ప్రజలు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్‌డేలోనూ ఇతర సందర్భాల్లోనూ భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులే అధికంగా వస్తున్నాయి. స్వాధీనంలో ఉండి సాగు చేసుకుంటున్న హక్కు దక్కకపోవడం అంటే పట్టాదారు పాసుపుస్తకం రాకపోవడం, సాగు చేసుకుంటున్న మొత్తం విస్తీర్ణం పట్టాదారు పాసు పుస్తకంలో లేకపోవడం, కొన్ని భూములు నిషేధిత జాబితాలో చేరడం, అసైన్డ్ భూములకు పట్టాలు దక్కకపోవడం పైనే ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నాయి. భూ భారతి ద్వారా దరఖాస్తులపై సమగ్ర విచారణ జరిపించి పట్టాదారు పాసు పుస్తకాలను అందజేయాలని రైతులు కోరుతున్నారు.

## భూముల రీసర్వే (మొదటి పేజీ తరువాయి)

అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**రైతు జీవనాధారానికి భరోసా..**

‘భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదు, అది అతని జీవనాధారం. ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్కు భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. తెలంగాణను భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈ రీసర్వే కార్యక్రమం చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుంది’ అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారంగా ఉన్నాయన్నారు. కాలక్రమేణా భూముల విభజనలు, ఉపసంఖ్యలు (సబ్‌డివిజన్లు) పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దులు మారడం వల్ల అనేక ప్రాంతాల్లో భూముల అసలు హద్దులపై స్పష్టత లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం సమగ్ర రీసర్వే చేపడుతోందని తెలిపారు.

**నిజాం కాలం నాటి నక్షాల్లేని గ్రామాల్లో సర్వే వేగవంతం..**

భూ వివాదాల పరిష్కారంలో భాగంగా రాష్ట్రంలో నిజాం కాలం నుంచి నక్షాలు లేని 378 గ్రామాలను గుర్తించామని, వాటిలో ఇప్పటికే 5 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి భూదార్ నెంబర్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. మిగిలిన 373 గ్రామాల్లో కూడా రోవర్స్ వంటి ఆధునిక సాంకేతికతతో సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఇకపై గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ వంటి పాత సర్వే పరికరాలకు పూర్తిగా స్వస్తి పలుకుతున్నామని స్పష్టం చేశారు. డిజిపిఎస్, రోవర్స్, జిఐఎస్, క్యూజీఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతిలో భూముల సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 411 రోవర్స్ కొనుగోలు చేయగా, త్వరలోనే మరో 400 రోవర్స్ కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు.

**ఆధార్ తరహాలోనే ‘భూదార్’**

భూముల రీసర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి ఖచ్చితమైన హద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబర్కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపుగా ‘భూదార్ కార్డులు’ జారీ చేస్తామని చెప్పారు. డిజిపిఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని క్యూజిఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి ‘భూ భారతి’ పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నెంబర్లు ఉండగా, ప్రస్తుతం అవి 2 కోట్ల 29 లక్షలకు పెరిగాయని, రాష్ట్రంలోని అన్ని సర్వే నెంబర్లకు దశలవారీగా భూదార్ నెంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందన్నారు.

**5,520 మంది సర్వేయర్లకు శిక్షణ..**

రీసర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన మానవ వనరులను ప్రభుత్వం సమకూర్చిందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి లైసెన్సులు జారీ చేశామని, భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది సర్వేయర్లను నియమించామని చెప్పారు. రాష్ట్రంలోని రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. భూముల రీసర్వే పూర్తయిన తర్వాత ప్రతి కమతానికి ఖచ్చితమైన సరిహద్దులు, ప్రత్యేక పటాలు సిద్ధమవుతాయని, తద్వారా భూ యాజమాన్యంపై ఎలాంటి వివాదాలకు తావు ఉండదన్నారు. భూ భారతి చట్టం ద్వారా సాగు భూముల రిజిస్ట్రేషన్‌లకు సర్వే పటం తప్పనిసరి చేసిన నేపథ్యంలో, రీసర్వే ద్వారా భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారనున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు.

# 6-0 గోల్స్ తేడాతో ఖతార్‌పై కెనడా విజయం

## హ్యాట్రిక్ గోల్స్ కొట్టిన డేవిడ్




ఫిఫా వరల్డ్‌కప్‌లో కెనడా తొలి విక్టరీ నమోదు చేసింది. టోర్నమెంట్‌కు కోహోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఆ దేశం శుక్రవారం వాన్కోవర్‌లో ఖతార్‌తో జరిగిన మ్యాచ్‌లో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 6-0 గోల్స్ తేడాతో ఖతార్‌పై విజయం సాధించింది. కెనడా ప్లేయర్ జోనాథన్ డేవిడ్ హ్యాట్రిక్ గోల్స్ చేశాడు. ఈ విక్టరీతో కెనడా ఖాతాలో నాలుగు పాయింట్లు వచ్చేశాయి. గ్రూపు బీ నుంచి కెనడా నాకౌట్ దశకు చేరుకునే ఛాన్సు ఉంది. బోస్నియాతో జరిగిన తొలి మ్యాచ్లో గోల్ చేసిన కెనడా ప్లేయర్ సైల్ లారిన్.. వాన్కోవర్ మ్యాచ్లో కూడా ఆ దేశానికి ఫస్ట్ గోల్ అందించాడు. అతను 16వ నిమిషంలో గోల్ చేశాడు. ఆ తర్వాత డేవిడ్ చెలరేగిపోయాడు. 29, 45, 90 నిమిషాల్లో డేవిడ్ హ్యాట్రిక్ గోల్స్ చేశాడు. కెనడా జట్టులో సలిబా, మనాయి ఓజీ కూడా గోల్స్ చేశారు. స్వంత గడ్డపై హ్యాట్రిక్ గోల్స్ కొట్టిన ప్లేయర్గా జోనాథన్ డేవిడ్ నిలిచారు. గతంలో 1966లో ఇంగ్లండ్ ప్లేయర్ జెఫ్ హస్ట్ స్వదేశీ మైదానంలో హ్యాట్రిక్ గోల్స్ చేశాడు.

కెనడా జట్టు భారీ విజయం సాధించినా.. ఆ జట్టుకు ఆనందం లేకుండాపోయింది. మిడ్ఫీల్డర్ ఇస్మాయిల్ కోన్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతను ఆట మధ్యలోనే స్ట్రెచ్చ మైదానాన్ని వీడాల్సి వచ్చింది. ఖతార్ మిడ్ ఫీల్డర్ ఆసిమ్ మడిబో తన కాలితో గట్టిగా తాకడంతో కోన్ ఎడమకాలి ఎముక విరిగిపోయింది. తీవ్రమైన నొప్పితో మైదానంలో కోన్ పడిపోయాడు. కాలి ఎముక విరిగడం వల్ల అతని సర్జరీ చేస్తున్నారు.ఈ ఘటనలో ఖతార్ ప్లేయర్ మడిబోకు రెడ్ కార్డ్ ఇచ్చారు. సుమారు నాలుగు నెలల పాటు కెనడా ప్లేయర్ రెస్ట్ తీసుకోవాల్సి ఉంటుంది.

### కొరియాపై మెక్సికో విజయం

ఫిఫా వరల్డ్‌కప్ కోహోస్ట్ మెక్సికో జట్టు నాకౌట్ దశలోకి ప్రవేశించింది. గ్రూప్ ఏ నుంచి రౌండ్ 32లోకి ఎంట్రీ ఇచ్చింది. దక్షిణ కొరియా దేశంపై 1-0 గోల్స్ తేడాతో మెక్సికో విజయం సాధించింది. దీంతో ఆ జట్టు ఖాతాలోకి ఆరు పాయింట్లు చేరాయి. గడలజరాలో జరిగిన మ్యాచ్లో మెక్సికో ప్లేయర్ లూయిస్ రోమో 50వ నిమిషంలో తన జట్టు తరపున గోల్ చేశాడు. గోల్ కీపర్ కిమ్ సెంగ్ యూ గోల్ అందుకున్న తర్వాత అతనికి ఓ ఫీల్డర్ ఢీకొన్నాడు. దీంతో అతని చేతుల్లోంచి బంతి జారింది. ఆ సమయంలో అక్కడ ఉన్న రోమో అద్భుతమైన రీతిలో గోల్స్ చేశాడు. ఆట 87వ నిమిషంలో దక్షిణ కొరియా ప్లేయర్ చో గు సంగ్కు గోల్ కొట్టే ఛాన్సు వచ్చింది. కానీ రౌల్ రంగేల్ దాన్ని అడ్డుకున్నాడు. స్వదేశీ మైదానంలో ప్రేక్షకుల నుంచి మెక్సికో జట్టుకు పూర్తి మద్దతు లభించింది. 75వ నిమిషంలో మెక్సికో రెండో గోల్ చేసే అవకాశాన్ని తృటిలో మిస్సైంది. ఈ మ్యాచ్లో దక్షిణ కొరియా ఓడినా.. గ్రూపులో పుంజుకునే అవకాశాలు ఉన్నాయి. తొలి మ్యాచ్లో చెక్ రిపబ్లిక్ దక్షిణ కొరియా విజయం సాధించిన విసయం తెలిసిందే. తన తర్వాత మ్యాచ్లో దక్షిణాఫ్రికాతో దక్షిణ కొరియా, చెక్ రిపబ్లిక్తో మెక్సికో పోటీపడనున్నాయి.

# 15 ఏళ్లకే ట్రిపుల్ సెంచరీ


## వైభవ్‌ను మించిన అక్షర

ఐపిఎల్‌లో వైభవ్ సూర్యవంశీ మెరుపులను మరవక ముందే మరో అమ్మాయి ట్రిపుల్ సెంచరీతో రికార్డులు నెలకొల్పింది. పదిహేనేళ్ల వైభవ్ ఆటను తలపించే విధ్వంసంతో 15 ఏళ్ల అక్షర గుప్త ఏకంగా మూడొందలు కొట్టేసింది. తను కూడా బిహార్‌కు చెందిన క్రికెటరే కావడం విశేషం. బిహార్ ఉమెన్స్ అండర్-19 ట్రోఫీలో ట్రిపుల్ సెంచరీతో చెలరేగిన ఈ అమ్మాయి భవిష్యత్ తారగా రికార్డులు నెలకొల్పింది. బిహార్ క్రికెట్లో మరో తార ఆవిర్భవించింది. ఐపిఎల్లో రికార్డు శతకాలు బాదిన వైభవ్ సూర్యవంశీ తరహాలో రెచ్చిపోతూ.. బౌలర్ల భరతం పట్టిన అక్షర గుప్తా ట్రిపుల్ సెంచరీతో రికార్డుల దుమ్ము దులిపింది. 15 ఏళ్ల అక్షర.. 306 పరుగులతో మెరిసింది. బిహార్ అండర్ 19 వన్డే ట్రోఫీలో కేవలం 126 బంతుల్లోనే అక్షర 55 ఫోర్లు, 8 సిక్సర్లతో త్రిశతకం కొట్టేసింది.

2024లో బిహార్ అండర్19 జట్టుకు ఎంపికైన అక్షర 14 ఏళ్లకే కెప్టెన్సీ చేపట్టింది. అంతేకాదు బీసీసీఐ ఒకే గ్రూప్ సీజన్లో నాలుగు మ్యాచ్లు ఆడిన తొలి మహిళా క్రికెటర్గా అక్షర గుర్తింపు సాధించింది. పద్నాలుగేళ్లకే పరిమిత ఓవర్లలో ట్రిపుల్ సెంచరీ కొట్టిన అక్షర.. ఏడాది తిరిగేలో మూడొందల స్కోర్తో సెలెక్టర్లను, క్రికెట్ అభిమానులను తనవైపు తిప్పుకుంది.



# సైన్స్



## విశ్వ ఆవిర్భావంపై కొత్త సమాచారం


అంతరిక్ష పరిశోధనలో మరో ముఖ్యమైన ముందడుగుగా, అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' శాస్త్రవేత్తలు జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్, హబుల్ స్పేస్ టెలిస్కోప్ సహాయంతో విశ్వం ఆవిర్భావానికి సంబంధించిన అత్యంత ప్రాచీన నిర్మాణాలపై కొత్త సమాచారాన్ని సేకరించారు. ఈ రెండు టెలిస్కోపులు కలిసి విశ్వంలో ఇప్పటికీ మిగిలి ఉన్న పురాతన నక్షత్ర సమూహాలను (రెలిక్ స్టార్ క్లస్టర్స్) గుర్తించి వాటి స్థానాలను మ్యాప్ చేయడంలో విజయవంతమయ్యాయి. ఈ పరిశోధన విశ్వం పుట్టుక అనంతరం జరిగిన తొలి పరిణామాలను అర్థం చేసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తోంది. బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం ప్రకారం సుమారు 13.8 బిలియన్ సంవత్సరాల క్రితం విశ్వం ఏర్పడింది. జేమ్స్ వెబ్ టెలిస్కోప్ తన అత్యాధునిక పరారుణ పరిశీలనా సామర్థ్యంతో విశ్వం ప్రారంభ దశల్లో ఏర్పడిన నక్షత్ర సమూహాలను గుర్తించగలిగింది. అదే సమయంలో హబుల్ టెలిస్కోప్ దృశ్య కాంతిలో సేకరించిన పరిశీలనలను అందించింది. ఈ రెండు టెలిస్కోపుల సమాచారాన్ని సమన్వయం చేయడం ద్వారా శాస్త్రవేత్తలు అత్యంత పురాతన నక్షత్ర సమూహాల నిర్మాణం, వయస్సు, పంపిణీని మరింత ఖచ్చితంగా అధ్యయనం చేయగలిగారు. ప్రాచీన నక్షత్ర సమూహాల అధ్యయనం ద్వారా విశ్వ చరిత్రలో ఇప్పటివరకు తెలియని అనేక రహస్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. తొలి నక్షత్రాల జననం మరియు గెలాక్సీల పరిణామక్రమంపై మరింత స్పష్టమైన అవగాహన పొందవచ్చని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## అంగారక గ్రహ వాతావరణ రహస్యాలు ఛేదించిన నాసా



అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' చేపట్టిన మార్స్ అట్మాస్ఫియర్ అండ్ వొలాటైల్ ఎవల్యూషన్ 'మావెన్' మిషన్ అంగారక గ్రహం (మార్స్) అధ్యయనంలో ఒక చారిత్రక మైలురాయిగా నిలిచింది. అంగారక గ్రహ వాతావరణాన్ని ప్రత్యేకంగా అధ్యయనం చేయడానికి రూపొందించిన తొలి మిషన్ అయిన మావెన్, 11 సంవత్సరాలకు పైగా విజయవంతంగా పనిచేసి తన ప్రయాణాన్ని ముగించింది. 2013లో ప్రయోగించిన ఈ వ్యోమనౌక మొదట కేవలం ఒక సంవత్సరం పాటు పనిచేయాల్సి ఉన్నప్పటికీ, అంచనాలకు మించి సేవలందిస్తూ అంగారక గ్రహంపై విలువైన శాస్త్రీయ సమాచారాన్ని సేకరించింది. 2025లో అంగారక గ్రహం వెనుక భాగంలోకి ప్రవేశించిన తర్వాత మావెన్‌తో సంబంధాలు తెగిపోవడంతో మిషన్ ముగిసినట్లు ప్రకటించారు. మావెన్ మిషన్ ప్రధాన లక్ష్యం అంగారక గ్రహ వాతావరణం ఎలా అంతరిక్షంలోకి క్రమంగా కోల్పోయిందో తెలుసుకోవడం. శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం, బిలియన్ల సంవత్సరాల క్రితం అంగారక గ్రహంపై నదులు, సరస్సులు, సముద్రాలు ఉండేవి. అప్పట్లో జీవానికి అనుకూల పరిస్థితులు కూడా ఉండి ఉండవచ్చని భావిస్తున్నారు. అయితే ప్రస్తుతం మార్స్ చల్లని, పొడి, ఎడారి స్వభావం కలిగిన గ్రహంగా మారిపోయింది. ఈ పరిణామానికి కారణాలను గుర్తించడం మావెన్ ప్రధాన ఉద్దేశం. ఈ మిషన్ అంగారక గ్రహపు ఎగువ వాతావరణం, అయానోస్ఫియర్, సూర్యుని ప్రభావాలపై కీలక సమాచారాన్ని అందించింది. ముఖ్యంగా సూర్యుని నుంచి వచ్చే 'సౌర గాలి', సౌర తుఫానులు అంగారక వాతావరణంపై ఎలా ప్రభావం చూపుతున్నాయో మావెన్ విశ్లేషించింది. సౌర తుఫానుల సమయంలో వాతావరణ నష్టం గణనీయంగా పెరుగుతుందని ఈ మిషన్ వెల్లడించింది. సూర్యుని నుంచి వచ్చే శక్తి ప్రభావాన్ని, దానికి అంగారక వాతావరణం చూపే ప్రతిస్పందనను ఒకేసారి కొలవగలిగిన ఏకైక వ్యోమనౌక మావెన్ కావడం విశేషం. మావెన్ సాధించిన మరో ముఖ్యమైన విజయాల్లో అంగారక గ్రహంపై కొత్త రకాల 'అరోరాలు'ల గుర్తింపు ఒకటి. భూమిపై కనిపించే ఉత్తర, దక్షిణ ధ్రువ కాంతుల మాదిరిగానే, శక్తివంతమైన ప్రోటాన్ల ప్రభావంతో అంగారక గ్రహంపై కూడా ప్రత్యేక అరోరాలు ఏర్పడుతున్నాయని మావెన్ గుర్తించింది. అ మావెన్ కేవలం అంగారక గ్రహానికే పరిమితం కాలేదు. ఇది ఇతర ఖగోళ వస్తువులపై కూడా పరిశోధనలు చేసింది.

## వృక్షాలలో విద్యుత్ సంకేతాలు!



వృక్షాల ప్రవర్తనపై ఇటీవల ఏర్పడిన సంచలనాత్మకవాదనలు, వాటిపై వచ్చిన శాస్త్రీయ విమర్శలను వివరిస్తుంది. సూర్యగ్రహణం సమయంలో చెట్లలో విద్యుత్ కార్యకలాపాలు ఎలా మారాయన్న అంశంపై ఒక పరిశోధనా పత్రం ఇటీవల వెలువడింది. ఆపత్రం ప్రకారం, మూడు స్ప్రూస్ చెట్ల మధ్య విద్యుత్ సంకేతాలు గ్రహణ సమయంలో అధ్యయనం చేసి, గ్రహణం మొదలయ్యే ముందే ఈ కార్యకలాపాలు పెరిగాయని గుర్తించినట్లు ఈ అధ్యయనం పేర్కొంది. కాగా, ఈ పరిశోధనను ఒక గౌరవనీయమైన శాస్త్రీయ పత్రిక ప్రచురించడంతో, ఇది నిజమైతే ఎంతో ప్రాధాన్యత కలిగిన విషయమని చాలామంది భావించారు. అయితే శాస్త్రీయ ప్రపంచంలో ప్రచురణ అనేది తుది సత్యానికి ముద్ర వేయడం కాదని, అది విమర్శలు, పునఃపరిశీలనలకు ఆరంభం మాత్రమేనని నిపుణులు గుర్తు చేశారు. కొందరు శాస్త్రవేత్తలు మొక్కల మధ్య సంకేతాల మార్పిడి కొంతవరకు ఉంటుందని అంగీకరిస్తే, మరికొందరు ప్రజాదరణ పొందిన కథనాలు దీనిని అతిశయోక్తిగా చూపిస్తున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో, చెట్లు సూర్యగ్రహణాన్ని ముందుగానే తెలుసుకున్నాయి అన్న వాదన మరింత అసాధారణంగా కనిపించింది. ఈ పత్రానికి ప్రతిస్పందనగా ప్రొఫెసర్ ఏరియల్ నోవోప్లాన్స్కీ, డాక్టర్ హెజీ యిజాక్ తీవ్ర విమర్శలు చేశారు. వారి ప్రధాన వాదన ప్రకారం, చెట్లలో నమోదైన విద్యుత్ సంకేతాలకు సూర్యగ్రహణం కాకుండా ఇతర సహజ కారణాలు ఉండే అవకాశమే ఎక్కువ. చెట్లలో విద్యుత్ కార్యకలాపాలు నిజమే అయినా, వాటిని జ్ఞాపకశక్తి లేదా ముందస్తు స్పందనగా భావించాలంటే అత్యంత బలమైన, పునరావృతమైన ఆధారాలు అవసరం. అడవులు తమ సహజ స్వరూపంలోనే అద్భుతమైనవని, వాటి గొప్పతనాన్ని చూపించడానికి అతిశయోక్తి అవసరం లేదని విమర్శకులు తేల్చి చెప్పారు.

# ప్రజా ఉద్యమాలతో సిపిఐ బలోపేతమే లక్ష్యం

## పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ



**ప్రజాపక్షం/గజ్వేల్ :** ప్రజా ఉద్యమాలతో పార్టీ బలోపేతమే లక్ష్యంగా సిపిఐ శ్రేణులు పని చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో సిపిఐ సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల కౌన్సిల్ సభ్యుల రాజకీయ శిక్షణ శిబిరం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. సిపిఐ ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ కార్యదర్శి బట్టు దయానంద రెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ సీనియర్ నాయకులు వీర్ల ప్రకాష్ రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా పశ్య పద్మ హాజరై ప్రారంభోపన్యాసం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికులు, రైతులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బలమైన విప్లవ పార్టీ అవసరమన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు క్రమశిక్షణతో కూడిన పార్టీ నిర్మాణంతో పాటు ప్రజా సంఘాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేస్తూ ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాజకీయ అవగాహన, సిద్ధాంతపరమైన దృక్పథం, ప్రజా ఉద్యమాల అనుభవం కలిగిన నాయకత్వాన్ని తీర్చిదిద్దడంలో ఇటువంటి శిక్షణ తరగతులు కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టంచేశారు. శిక్షణ శిబిరాల్లో పార్టీ చరిత్ర, మార్క్సిస్టు భావజాలం, భారత కమ్యూనిస్టు ఉద్యమం, సమకాలీన రాజకీయ పరిస్థితులు, ప్రజా ఉద్యమాల నిర్మాణం, పార్టీ విస్తరణ, సభ్యత్వ అభివృద్ధి, ప్రజా సమస్యలపై పోరాటాల నిర్వహణ వంటి అంశాలపై సవివరంగా చర్చలు జరుగనున్నట్లు తెలిపారు. ఈ రాజకీయ శిక్షణ శిబిరాలు పార్టీ బలోపేతానికి, కార్యకర్తల్లో సిద్ధాంతపరమైన అవగాహన పెంపొందడానికి, ప్రజా ఉద్యమాలను మరింత విస్తృతంగా నిర్మించడానికి దోహదపడతాయని పశ్య పద్మ ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి దేశ సంపదను దోచిపెడుతున్నట్లు విమర్శించారు. పేదలు ఆర్థికంగా క్షీణిస్తూ దుర్భర జీవితం గడుపుతుండగా, నిత్యావసర ధరలు పెంచి ప్రజలపై పెనుభారం మోపుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇడి, సిబిఐ వంటి దర్యాప్తు సంస్థలతో బెదిరింపులకు గురిచేస్తు బిజేపీకి అనుకూలంగా మార్చుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ఎస్ఐఆర్ పేరుతో బిజెపి వ్యతిరేక ఓట్లను తొలగించే కుట్రకు తెరలేపినట్లు ఆరోపించారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు తిరగబడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, మెదక్ జిల్లా కార్యదర్శి ఖాలీక్, సంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి రెహ్మాన్, ఆనంద్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కొమ్ముల భాస్కర్, సీపీఐ నాయకులు యెడల వనేశ్, జేరిపోతుల జనార్థన్, పిల్లి రజిని, స్వర్గం రాజేశం, శివలింగు కృష్ణ, గజాభీమకర్ బన్సీలాల్, నర్సింహారెడ్డి, బోనగిరి రుపేష్, సంగెం మధు, రామగళ్ల నరేష్, ఆది రంగారెడ్డి, బొజ్జపురి రాజు, ముంజ గోపి, కర్ణాల చంద్రం, వెంకట రాములు, అశోక్, నర్సింహులు, రాజ గౌడ్, మహేష్, శ్రవణ్ మహిళా సమాఖ్య నాయకులు లక్ష్మి, పద్మ, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.




# ఓటరు లిస్ట్ సవరణలో పాల్గొనాలి




## సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఓటరు లిస్ట్ సవరణ సర్‌లో పాల్గొనాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పార్టీ శ్రేణులను కోరారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ విస్తృత స్థాయి సమావేశం రంజిత్ అధ్యక్షతన జరగగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సర్ ఓటర్ల జాబితా సవరణలో భాగంగా తెలంగాణలో ఈనెల 25 నుండి ప్రారంభమవుతుందన్నారు. డివిజన్, వార్డు గ్రామాల్లో బిఎల్ఎ బూత్ లెవల్ ఏజెంట్లుగా పేర్లు నమోదు చేసుకుని సర్ సర్వేలో పాల్గొనాల్సిందిగా పార్టీ కార్యకర్తలను కోరారు. ఈ మధ్యకాలంలో జరిగిన కొన్ని రాష్ట్రాల ఎన్నికల్లో ఓటర్లను తొలగించే కుట్ర జరిగిందని కావున బిఎల్ఓలకు సహకరించి ప్రతి ఓటును నమోదు చేయించుకునేలా బిఎల్ఎలు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఓటు హక్కును తొలగించడమంటే మనిషి జీవించే హక్కును కాలరాయడమేనన్నారు. జిల్లాల్లో ఓట్ల తొలగింపు ప్రక్రియపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పౌరసత్వం లేకపోతే రేషన్ కార్డు, ఆధార్ కార్డు లభించవని, తద్వారా ఇల్లు, రేషన్ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు పేద ప్రజలు దూరమయ్యే ప్రమాదం ఉందని, ఇది ముఖ్యంగా దళితులు, ఆదివాసీలు పేదవర్గానికి పెద్ద సమస్యగా మారనుందన్నారు. ఓటు హక్కు కోల్పోవడం అంటే కేవలం ఓటు వేసే అవకాశం పోవడం మాత్రమే కాదని, ఇది భవిష్యత్తులో పౌరసత్వాన్ని కూడా కోల్పోయే ప్రమాదానికి దారితీయవచ్చని హెచ్చరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో నిరంతరం ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, సమావేశంలో నాయకులు ఓమయ్య, సురేష్, హన్మాండ్లు, ఫిరోజ్‌అలీ, హన్మంతరావు, సాయిలు, రాధాకుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి..

# ప్రజలపై భారం వేస్తున్న మోదీ ప్రభుత్వం

### సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం /చిగురుమామిడి :** దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, ఆ అప్పుల భారాన్ని, ధరల భారాన్ని మోదీ ప్రజలపై వేస్తున్నాడని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం తమ్మిశెట్టి రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సామాన్య ప్రజలపై రోజురోజుకు పెనుభారం మోపుతుందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి దేశానికి రూ.55 లక్షల కోట్లకు పైగా అప్పులు ఉంటే 12 సంవత్సరాలలో దానికి నాలుగింతలు పెరిగి దాదాపు రూ.214 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసిన మోదీ ప్రభుత్వం ప్రజలపై అడ్డగోలుగా పన్నుల భారం వేస్తుందన్నారు. రాష్ట్రంలోని బిజెపి ఎంపీలు ధరల పెరుగుదలను చూస్తూ ఉన్నారే తప్పా చేసిందేమీ లేదని, డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందని కలలు కంటున్న బిజెపి 12 ఏళ్లలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు డబుల్ చేసిందని, ఇంకా పెరుగుతాయని సంకేతాలు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని, కూలీల పొట్టలు కొడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద కొనుగోలు చేసిన మొక్కజొన్న ధాన్యానికి డబ్బులు వెంటనే చెల్లించాలని వెంకట్‌రెడ్డి కోరారు. మండలంలో పార్టీ ప్రజాసంఘాల నిర్మాణాన్ని బలోపేతం చేయడం కోసం శ్రేణులు పని చేయాలని, సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్న స్వామి, బూడిద సదాశివ, మావురపు రాజు, తేరాల సత్యనారాయణ, ముల్కనూర్ ఉప సర్పంచ్ పైడిపల్లి వెంకటేశ్, వార్డు సభ్యురాలు రాకం అంజవ్వ, మహిళా సమాఖ్య నాయకురాలు కయ్యం సుజాత, వివిధ గ్రామాల శాఖ కార్యదర్శులు, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న

# ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలి

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్

### డిఇఒ ఆఫీస్ ముందు తరాజులో నోట్ల కట్టలు, పుస్తకాలతో నిరసన



**ప్రజాపక్షం/కరీంనగర్ :** అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు చేపట్టాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు, ప్రచారం నిర్వహిసున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకుండా వారికి వత్తాసు పలుకుతున్నారనీ, అధిక ఫీజుల వసూలు, పుస్తకాలు, యూనిఫామ్ లు విక్రయించే స్కూళ్లను సీజ్ చేయాలని, ఫీజుల నియంత్రణ చట్టం, విద్యా హక్కు చట్టం అమలు చేయాలని మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ అధ్వర్యంలో కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు శుక్రవారం తరాజులో నోట్ల కట్టలు, పుస్తకాలతో వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో, నగరంలో ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారం చేస్తూ అక్షరాలతో లక్షల రూపాయలు దోపిడీ చేస్తున్నారని, బీటెక్ ఫీజుల కంటే ఎల్‌కెజి ఫీజులే అధికంగా ఉన్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధం గా టెక్నో, ఈ టెక్నో, ఒలంపియాడ్, వరల్డ్ అని హోర్డింగ్స్ పాఠశాలు ప్రచారం చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికే అనేక పాఠశాలలో, పాఠశాలల ఆవరణలోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అమ్ముతున్నారని, ఫీజుల నియంత్రణ, మౌలిక వసతుల కల్పన లేదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ అధికారులే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లకు వత్తాసు పలుకుతున్న విద్యాశాఖ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, అనుమతి లేని పాఠశాల పేర్లు బహిర్గతం చేయాలని లేని పక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మణికంఠరెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు నునవత్ శ్రీనివాస్‌నాయక్, లద్దునూరి విష్ణు, కసిరెడ్డి సందీప్ రెడ్డి, జ్యోష్ణ, అనోష్, బోయినీ విష్ణు, నాగుల జ్ఞానేశ్వర్, నవీన్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రూట్లలో అదనపు బస్సులు ఆర్‌టిసి ఎండి గ్రీన్ సిగ్నల్

మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి నుండి వివిధ ప్రాంతాలకు వెళ్లే అన్ని రూట్లలో ప్రజల సౌకర్యార్థం అదనపు బస్సులు నడుపుటకు ఆర్టీసీ ఎండీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. తెలంగాణ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డిని ఆయన పోచంపల్లి బ్యాంకు చైర్మన్ తడక రమేష్ లతో కలిసి వివిధ బస్ రూట్ల కు సంబంధించి అదనపు బస్సులు కేటాయించాలనీ ప్రయాణికులను ఎలాంటి ఇబ్బందులు జరగకుండా సమయానుకూలంగా బస్సులు నడపాలని విజ్ఞప్తి చేశారు. ప్రతినిత్యం బీబీనగర్ ఏమ్స్‌కు హాస్పిటల్‌కి, వందలాది మంది ప్రయాణికులు పరీక్షల నిమిత్తం వెళ్తూ ఉంటారని ఉప్పల్ టు వయా బీబీనగర్ పోచంపల్లి, యాదగిరిగుట్ట టు వయా బీబీనగర్ పోచంపల్లి బస్సుల సర్వీస్ ల పెంచాలని ప్రజలు పడుతున్న అవస్థలను దృష్టిలో ఉంచుకొని వినతి పత్రాన్ని సమర్పించారు. ఎండి వెంటనే స్పంది స్తూ ఒకటి రెండు రోజుల్లో బస్సుల పునరుద్ధరింపజేసి యధావిధిగా బస్ సర్వీస్ లో కొనసాగుతాయని తెలిపినట్లు చెప్పారు. ఆర్టీసీ తక్షణమే చొరవ చూపిన ఆర్టీసీ ఎండీకి మున్సిపల్ చైర్మన్ కృతజ్ఞతలు తెలుపుతూ రవాణా సౌకర్యాలకు త్వరలోనే పరిష్కారం చూపుతారని ప్రజలకు తెలిపారు.

## ప్రైవేట్ పాఠశాలల అక్రమాలపై కఠిన చర్యలు

లేకపోతే ప్రత్యక్ష ఆందోళనలు తప్పవు: ఎఐఎస్ఎఫ్ హెచ్చరిక



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారికి (డీఈఓ) శుక్రవారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని అనేక ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా విస్మరించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని,విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఆర్థిక భారం మోపుతూ విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా పాఠశాలల ఆవరణలోనే పాఠ్యపుస్తకాలు,యూనిఫాంలు,డైరీలు విక్రయిస్తూ విద్యను వ్యాపారంగా మార్చుతున్నారని విమర్శించారు.అర్హతలు లేని ఉపాధ్యాయులతో బోధన నిర్వహించడం వల్ల విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రైవేట్ పాఠశాలల అక్రమాలపై విద్యాశాఖ అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు,నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యశ్వంత్,జిల్లా కమిటీ సభ్యులు రమావత్ శ్రీకాంత్,కళ్లెం అరవింద్ పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాల పట్టివేత :ఒకరి అరెస్ట్



**ప్రజాపక్షం/నూతనకల్ :** మండలంలోని పెదనెమిల ఎక్స్ రోడ్డు వద్ద మండల పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించగా 65 ప్యాకెట్ల నకిలీ పత్తి విత్తనాలను పట్టుబడ్డాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గుండెపూడి గ్రామానికి చెందిన బోడపట్ల ఏకస్వామి అనే వ్యక్తి తన టిఎస్26 5651 హీరోగ్లామర్ మోటార్ సైకిల్‌పై అనుమానాస్పదంగా అరుణోదయ అనే పేరుతో గల లేబుల్ కలిగిన 65 ప్యాకెట్ల పత్తి విత్తనాలు (ఒక్కొక్కటి సుమారు 450 గ్రాములు) గల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. విత్తనాల విక్రయానికి వినియోగించినట్లు భావిస్తున్న ఒక మొబైల్ ఫోన్‌ను, మోటార్ సైకిల్‌ను, ఒక టాటా ఏసి వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న విత్తనాలను పరీక్షల నిమిత్తం సంబంధిత అధికారులకు అప్పగించడంతోపాటు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## డిండి ద్వారా ఆయకట్టుకు నీరు

ఎంఎల్ఏ బాలునాయక్

**ప్రజాపక్షం/డిండి :** డిండి ప్రాజెక్ట్ ఆయకట్టు చివరి ఎకరా వరకు పూర్తి స్థాయిలో వానాకాలం పంటకు సాగునీరు అందిస్తామని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం ఇరిగేషన్ అధికారులతో కలిసి డిండి ప్రాజెక్ట్ ద్వారా ఆయకట్టు రైతాంగానికి సాగు నీటిని విడుదల చేశారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డిండి రిజర్వాయర్ నుండి విడుదల చేసిన నీటితో డిండి మండల పరిధిలోని ఆయకట్టు సుమారు 20వేల ఎకరాల్లో వరి సాగు జరుగునున్నట్లు తెలిపారు. సాగునీరు అందుబాటులోకి రావడంతో రైతులు వానాకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. రైతులు నీటిని సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ నాగార్జునరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ రవి, దామోదర్‌రావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనొద్దీన్, శేఖర్‌రెడ్డి, శైలేష్, విజేందర్‌రెడ్డి, శ్రీను, శశిధర్‌రెడ్డి, లక్పతి, లక్ష్మీ , రేఖ్యానాయక్, కుర్మారెడ్డి, రుక్మారెడ్డి, గోపాల్, బాలకృష్ణ, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రోగులకు మెరుగైన చికిత్స

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండి హాస్పటల్‌కు వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డులు, ఇన్‌పేషెంట్, అవుట్‌పేషెంట్ విభాగాలను ఆయన స్వయంగా పరిశీలించారు. వార్డులలోని రోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్, ఆర్ఎమ్ఓ, వివిధ విభాగల హెచ్ఓడిలతో సమావేశమై రోగులకు అందుతున్న వైద్య సేవలపై ప్రత్యేకంగా చర్చించారు. జనవరి నెల నుండి మే నెల వరకు ఆసుపత్రికి దాదాపు 1,12,000 కంటే ఎక్కువ అవుట్ పేషెంట్లకు, అలాగే 25వేలకు పైగా ఇన్ పేషెంట్లకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ప్రోగ్రాం కింద ఆసుపత్రిలో మోకాలి మార్పిడి, ఇతర ఆర్థోపెడిక్ శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రేడియాలజీ, గైనకాలజీ విభాగాల సేవలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ముఖ్యంగా ఇక్కడి మాత శిశు కేంద్రంలో గైనకాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రసవాల సంఖ్య పెరిగినట్లు వెల్లడించారు. ఆసుపత్రికి వచ్చే రోగులందరికి ఉచితంగా నాణ్యమైన వైద్యంతోపాటు మందులను కూడా అందిస్తున్నామని స్పష్టం చేశారు. క్యాన్సర్ బాధితుల కోసం ఆసుపత్రిలో ప్రత్యేకంగా యూనిట్‌ను ఏర్పాటు చేసి వారికి కీమోథెరపీతోపాటు కార్పోరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దాదాపు 58 మంది క్యాన్సర్ రోగులు ఈ సేవల ద్వారా లబ్ధిపొందుతున్నారని వివరించారు. ఆసుపత్రి ఆధునీకరణలో భాగంగా నూతనంగా నిర్మించిన మాతా శిశు సంరక్షణ బ్లాక్ భవన నిర్మాణం పూర్తయిందని, దానికి సంబంధించిన మిగిలిన ఎక్విప్‌మెంట్, ఇతర పనులను త్వరలోనే పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని ప్రకటించారు. అలాగే దీని పక్కనే నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నూతన ప్రధాన భవన పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయని, వీటిని వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిపార్టుమెంట్ ఇంజనీర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ఇన్‌పేషెంట్లకు వైద్యంతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓలు గీతావాణి, ప్రశాంతి, డాక్టర్స్ మనీషా, సతీష్, ఉపేందర్ సింగ్, మున్సిపల్ కమీషనర్ హన్మంత రెడ్డి, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# యాప్ సాంకేతిక సమస్యలతో సర్వే ఆలస్యం

మిర్యాలగూడ నక్ష సర్వే 50శాతం ,డేటా ఎంట్రీ 10 శాతం పూర్తి :కలెక్టర్

**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లాలో పైలట్ పద్ధతిన చేపట్టిన మిర్యాలగూడ మున్సిపల్ నక్ష సర్వే 50 శాతం పూర్తయిందని,డేటా ఎంట్రీ 10 శాతం పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ రాష్ట్ర సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్‌కు తెలిపారు.32వ వార్డులో 1552 ప్రాపర్టీల వివరాలు పూర్తి చేసినట్లు ఆయన వివరించారు.శుక్రవారం రాష్ట్ర సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు,అదనపు కలెక్టర్లు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్లతో నక్ష సర్వే తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తినందున సర్వే ఆలస్యం అవుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.లైసెన్స్‌డ్ సర్వేయర్లు సర్వేకు సంబంధించి సమ్మతి ఇచ్చినందున ఈ నెల 20 లోగా వారి నుంచి సమ్మతి తీసుకొని గెజిట్ నోటిఫికేషన్ ప్రచురిస్తామని కలెక్టర్ చెప్పారు.అంతకుముందు సీసీఎల్ఏ లోకేష్ కుమార్ మాట్లాడుతూ నక్ష సర్వేను వేగవంతం చేయాలని, సర్వేకు సంబంధించిన సామగ్రినంతా సీఎస్ఆర్ కింద సమకూర్చుకోవాలని సూచించారు. సాదా బైనామాకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను నెలాఖరు లోపు పరిష్కరించాలని, అలాగే రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను సైతం పరిష్కరించాలన్నారు.భూభారతి కింద 85 వేల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని,వాటిని కూడా పరిష్కరించడంపై జిల్లా కలెక్టర్లు దృష్టి సారించాలని చెప్పారు.వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



నీట్ యుజీ-2026 రీ ఎగ్జామినేషన్ పకడ్బందీగా నిర్వహించాలి

ఈనెల 21న నిర్వహించనున్న నీట్ యూజీ2026 రీ ఎగ్జామినేషన్‌ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నీట్ 2026 రీ ఎగ్జామినేషన్ నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆదేశాల మేరకు నీట్ (యూజీ)2026 రీ ఎగ్జామినేషన్‌ను ఈనెల 21న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:15 వరకు నిర్వహిస్తామని తెలిపారు.ఈ విడత 15 నిమిషాలు అదనపు సమయం ఇచ్చారని, దివ్యాంగులకు 65 నిమిషాలు అదనపు సమయం ఇస్తారని,అంటే సాయంత్రం 6:20 వరకు రాసుకోవచ్చని చెప్పారు.అన్ని సెంటర్లకు సీఆర్పీఎఫ్ బలగాలను కేటాయించామని తెలిపారు.నల్లగొండకు 15 మందిని కేటాయించగా, మొత్తం 7 కేంద్రాలు ఉండగా,కేంద్రానికి ఇద్దరు చొప్పున నియమించారన్నారు. 21న జిల్లా కేంద్రంలోని అన్ని జిరాక్స్ కేంద్రాలను మూసి ఉంచాలి.

## పలివెల పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

**ప్రజాపక్షం/నల్లగొండ:** మునుగోడు మండలం పలివెల గ్రామ పంచాయతీకి చెందిన గ్రేడ్4 పంచాయతీ కార్యదర్శి ఎస్‌జె మనసాను జిల్లా కలెక్టర్ (పంచాయతీ విభాగం) బి.చంద్రశేఖర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.అధికారిక ఉత్తర్వుల ప్రకారం, పలివెల గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న సమయంలో గ్రామ పంచాయతీ రికార్డుల నిర్వహణ,నవీకరణలో నిర్లక్ష్యం వహించడంతో పాటు విచారణ అధికారికి కొన్ని రికార్డులు సమర్పించలేదని ఆరోపించారు.అలాగే నకిలీ రసీదు పుస్తకాలు సృష్టించి,ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు జారీ చేసి హౌస్ ట్యాక్స్ వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ అంశాలపై షోకాజ్ నోటీసు జారీ చేసినప్పటికీ నిర్దేశిత సమయంలో వివరణ సమర్పించకపోవడంతో ఆమెపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.ప్రస్తుతం ఆమె చందూరు మండలం సిర్దేపల్లి గ్రామ పంచాయతీలో పనిచేస్తూ ప్రసూతి సెలవులో ఉన్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.సస్పెన్షన్ కాలంలో ఆమె మండల కేంద్రంలోనే ఉండాలని, సంబంధిత అధికారుల అనుమతి లేకుండా ప్రధాన కేంద్రాన్ని వీడరాదని ఆదేశించారు.మునుగోడు,చందూరు ఎంపీడీవోలు సంబంధిత అధికారులకు అవసరమైన చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## కోదాడలో 'మెప్మా' నిధుల దుర్వినియోగంపై విచారణ

సనా, దుర్గభవాని సంఘాల నిధుల దుర్వినియోగం

బాధ్యులపై పోలీసు కేసులు

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ మున్సిపాలిటి పరిధిలోని మెప్మా విభాగంలో కొన్ని స్లమ్ లెవల్ పెడరేషన్లు, స్వయం సహాయక సంఘాలు, సంబంధిత వ్యక్తుల మధ్య ఆర్థిక లావాదేవిల్లో అవకతవకలు జరిగినట్లు అందిన ఫిర్యాదుల మేరకు సమగ్ర విచారణ నిర్వహించినట్లు మెప్మా సూర్యాపేట జిల్లా పథక సంచాలకులు తెలిపారు. విచారణ సందర్భంగా సంబంధిత లెక్కల పుస్తకాలు, బ్యాంకు తీర్మాణ పుస్తకాలు, రుణ పంపిణి వివరాలు, సభ్యుల వాంగ్మూలాలు తదితర రికార్డులను పరిశీలించగా సమాఖ్య నిధుల వినియోగంలో నిబంధనల ఉల్లంఘనలు, లోపాలు జరిగినట్లు నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో సమాఖ్య నిధులను రక్షించడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం, సభ్యుల విశ్వాసాన్ని పునరుద్దరించడం, భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిరోధించేందుకు తగిన చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. విచారణలో భాగంగా సనా స్వయం సహాయక సంఘం, దుర్గభవాని స్వయం సహాయక సంఘానికి సంబంధించిన రుణ నగదును నిబంధనలకు విరుద్ధంగా వినియోగించి ఆర్థిక అక్రమాలకు పాల్పడిన వ్యక్తులపై పోలీసు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే సంబంధిత మొత్తాల రికవరి కోసం అవసరమైన చర్యలను ప్రారంభించినట్లు తెలిపారు. అదే విధంగా సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలోని కాశింపేట, రాంకోటి తండా ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న రిసోర్స్ పర్సన్ సమాఖ్య కార్యక్రమాల నిర్వహణ, సభ్యులతో సమన్వయం, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందున వారిని విధుల నుంచి తొలగించినట్లుగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాధనం, సంఘాల నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం, నిబంధనల పాటింపుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, భవిష్యత్‌లో కూడా ఇటువంటి ఫిర్యాదులపై కఠిన చర్యలు కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల పవార్ స్పష్టం చేశారు.

## సురక్షిత పట్టణంగా మార్చడానికి ప్రాధాన్యం

సూర్యాపేట జిల్లా ఎస్పి కె. నరసింహ్మ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** జిల్లా కేంద్రాన్ని అత్యంత సురక్షిత పట్టణంగా మార్చడమే మా ప్రాధాన్యత అని జిల్లా ఎస్పి కె. నరసింహ అన్నారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన 20 సిసి కెమెరాలను ఆయన ప్రారంభించి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను వేధించే వారిపై, ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం పాఠశాలలు, విద్యాసంస్థలు ప్రారంభమైనందున, విద్యార్థినుల భద్రత పట్ల అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పోలీస్ సేవలను ప్రజలకు మరింత సులభతరం చేసేందుకు సరికొత్త విధానాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజల నుండి ఏదైనా ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు నేరుగా బాధితుల ఇళ్లకు వెళ్లి ఫిర్యాదులు స్వీకరించడంతోపాటు అక్కడికక్కడే కేసులు నమోదు చేసి తక్షణ సహాయం అందిస్తున్నారని స్పష్టం చేశారు. దీని వల్ల బాధితులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, వారి ఇంటి వద్దకే పోలీసు సేవలను చేరవేస్తున్నామని వివరించారు. అంతకు ముందు వార్షిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించి క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది నిర్వహించిన కవాతును పరిశీలించిన ఆయన వారి యూనిఫామ్స్, కిట్లను తనిఖీ చేశారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి, స్టేషన్‌లోని వివిధ రకాల కీలక రికార్డులను, శాంతిభద్రతల నిర్వహణ ఫైళ్లను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఫిర్యాదులు, కేసులు పెండింగ్ ఉంచకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి ప్రసన్న కుమార్, సిఐ వెంకటయ్య, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ మగ్దూం అలీ, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, ఎస్ఐలు ఏడుకొండలు, మహేందర్, శివతేజ, సందీప్, వెంకన్న, రహీముద్దీన్, ఏఎస్ఐ శంకర్, స్టోర్ ఆర్ఎస్ఐ అఖిల్, డిసిఆర్‌బి సిబ్బంది ఎస్ఐ యాకూబ్, ఏఎస్ఐ అంజన్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శేఖర్ రెడ్డి, సిసి సందీప్ పాల్గొన్నారు.



## ఘోర రోడ్డు ప్రమాదం

ముగ్గురు మృతి... మరోముగ్గురికి తీవ్రగాయాలు

ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి శరత్‌చంద్ర పవార్

**ప్రజాపక్షం/నందికొండ:** పెద్దవూర మండలం రామన్నగూడెం స్టేజ్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పరిశీలించారు.ఈప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా,మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్పి ప్రమాద పరిస్థితులను పరిశీలించి,ప్రమాదానికి దారితీసిన కారణాలు, వాహనాల స్థితిగతులు, రహదారి పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఘటనకు సంబంధించిన అన్ని వివరాలను సేకరించి, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.ఈ ప్రమాదంలో పల్నాడు జిల్లా ముప్పాల మండలం కాకర్లపాలెం గ్రామానికి చెందిన కాకర్ల థామస్య (51),ప్రకాశ్ రావు (35),అలాగే వరంగల్ ప్రాంతానికి చెందిన ఎస్ఎల్‌బీసీ సైట్ ఇంజినీర్ సాయికుమార్ (20) మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.అతివేగం, సీట్‌బెల్ట్ లేకుండా ప్రయాణించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగానే ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## ఎసిబి వలలో సర్వే శాఖ అధికారి

రూ.35 వేల లంచం డిమాండ్..రూ.15 వేలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఎసిబి



**ప్రజాపక్షం/నల్లగొండ:** జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన ట్రాప్‌లో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్‌డిఓ) కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జి.పవన్ కుమార్ చిక్కాడు. అధికారిక విధులకు సంబంధించిన పని చేయడానికి ఫిర్యాదుదారుడి నుంచి రూ.35 వేల లంచం డిమాండ్ చేసి,అందులో భాగంగా రూ.15 వేలు స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఏసీబీ విడుదల చేసిన ప్రెస్ నోట్ ప్రకారం,ఫిర్యాదుదారుడి తల్లి,అత్తకు చెందిన భూములకు సంబంధించి సర్వే రిపోర్టు జారీ చేయడానికి పవన్ కుమార్ రూ.35 వేల లంచం కోరాడు.ఈక్రమంలో డిమాండ్ చేసిన రోజునే ముందస్తుగా రూ.20 వేల లంచం తీసుకున్నట్లు విచారణలో వెల్లడైంది.అనంతరం మిగిలిన రూ.15 వేల కోసం ఒత్తిడి చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.ఫిర్యాదు ఆధారంగా పక్కా ప్రణాళిక రూపొందించిన ఏసీబీ నల్లగొండ రేంజ్ అధికారులు నల్లగొండ జిల్లా కలెక్టరేట్ సమీపంలో ట్రాప్ నిర్వహించారు. ఫిర్యాదుదారుడి నుంచి రూ.15 వేల నగదు స్వీకరిస్తున్న సమయంలో అధికారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం నిర్వహించిన పరీక్షల్లో లంచం తీసుకున్నట్లు నిర్ధారణ కావడంతో నిందితుడి వద్ద నుంచి ఆమొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు.నిందితుడిని అరెస్టు చేసి నాంపల్లిలోని ప్రత్యేక ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచ నున్నట్లు తెలిపింది.

## డ్రైనేజీల శుభ్రతపై ప్రత్యేక దృష్టి

ఫ్రైడే- డ్రై డే కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట మండలం మసాయిపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడేడ్రై డే కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి, వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూడాలని, పాత సామగ్రి , ఇతర ఉపయోగించని వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల లోని కిచెన్ షెడ్, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను నివారించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సక్రమంగా తొలగింపు, డ్రైనేజీల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి మనోహర్, ఎంపీడీవో, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి

ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/రామన్నపేట :** వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా రామన్నపేట మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ 'ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత మొక్కలు నాటడం మాత్రమే కాదు, వాటిని సంరక్షించడం కూడా ఎంతో ముఖ్యం' అని అన్నారు. భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణం అందించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. రాహుల్ గాంధీ గారి జన్మదినం , విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేశారు. అనంతరం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీరేశం పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్బుక్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే, వారి విద్యాభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులు మంచి లక్ష్యాలతో ముందుకు సాగి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. యువత సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని, సేవా భావంతో ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రెండు నెలల బాలుడిని.. హత్య చేసిన కసాయి తండ్రి

### మిర్చి కాంపౌండ్‌లో దారుణం



ప్రజాపక్షం/నిజామాబాద్ : కన్నత ం్రడే కాలయముడిగా మారిన ఘ టన నిజామాబాద్‌లో చోటు చేసుకుంది. రెండున్నర నెలల తన కొడుకుని నగరంలోని రైల్వేట్రాక్ సమీపంలో హత్య చేసిన అమానుష ఘటన నగరంలో కలకలం రేపింది. నగరంలోని మిర్చికాంపౌండ్‌లో నివాసముండే ప్రియాంకయువరాజ్ దంపతులకు బాబు జన్మించగా ఈ బాబు తనకు పెట్టలేదని అనుమానంతో యువరాజ్ నిత్యం భార్యను వేధించేవాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి నగరంలోని రై ల్వేట్రాక్ పక్కకు బాబును తీసుకొచ్చి కత్తితో పొడిచి హత్య చేశాడు. రైల్వేట్రాక్ పక్కన బాలుడి మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే 1వ పి ఎస్ పోలీసులకు సమాచారమందించారు. స్పందించిన ఎస్‌హెచ్‌ఓ రఘుపతి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు. రైల్వే ట్రాక్‌పై గుర్తించిన బాలుడి మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## పకడ్బందీగా భూధార్ సర్వే

### రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ కుమార్



ప్రజాపక్షం / నిర్మల్ : భూధార్ సర్వేను పకడ్బందీగా నిర్వహించి, భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, జిల్లాల్లో భూధార్ సర్వే చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సర్వేయర్లను ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సాధా భైనామా దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, అలాగే భూ భారతి దరఖాస్తులను నిర్ణీత 60 రోజుల గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, భూధార్ సర్వే నిర్వహణకు అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని, సాధా భైనామా దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో ఏలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డి.ఆర్.ఓ. రాథోడ్ రమేష్, ఏడి ల్యాండ్ సర్వేయర్ నరసింహమూర్తి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన : ఎస్ఐ సతీష్



ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై సిహెచ్.సతీష్ కోరారు. శుక్రవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో శ్రీవిద్య సాయి పాఠశాలలో విద్యార్థుల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి మాట్లాడారు.విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిస కావద్దన్నారు. డ్రగ్స్ అలవాటుగా మారితే వారి జీవితాలు నాశనమవుతాయన్నారు. గంజాయి, డ్రగ్స్ సరఫరా విక్రయం, సేవించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా విక్రయాలు వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసుశాఖకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్త వినియోగంపై అవగాహన

ప్రజాపక్షం/నిజాంపేట్ : నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచి అంజమ్మ కార్యదర్శి మమత ఆధ్వర్యంలో తడి చెత్త పొడి చెత్త ప్లాస్టిక్ వినియోగం పై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామంలో వీధుల గుండా చిత్తరాన్ని నిర్వహించకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు సూచించారు. మంచినీటి సమస్య, 4 రకాల తడి, పొడి చెత్త సీసం లాంటి వస్తువులను ప్లాస్టిక్ వస్తువులపై నాలుగు రకాల డస్ట్ బుట్టలతో ప్రజలకు ఏ విధంగా వినియోగంచుకోవాలో అలాగే పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ నాతీ లక్ష్మగౌడ్, సిద్ద రాములు, వార్డు మెంబర్ రహీం, సనామాద్, శ్రీనివాస్, అజయ్, నర్సాగౌడ్, అంగన్‌వాడి టీచర్ మంజుల, వి ఎ ఒ నాగరాణి, పరిశుద్ధ కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/రామాయంపేట: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ఎంపీ రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మెదక్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈసందర్బంగా మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షులు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రజల హక్కుల కోసం నిరంతరం పరితపిస్తున్న నాయకుడు రాహుల్‌గాంధీ అని కొనియాడారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు చేపట్టిన భారత్ జోడో యాత్ర దేశ రాజకీయాల్లో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించిందని గుర్తు చేశారు. రాబోయె రోజుల్లో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు రాహుల్‌గాంధీ నాయకత్వం అవసరం అన్నారు. పేదలు, నిరుద్యోగులు, రైతుల గొంతుకగా మారిన రాహుల్‌గాంధీ మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు పుట్టి సందీప్, దేవుని రంజిత్, గుగ్లోతు రవినాయక్, కోఅప్షన్ సభ్యులు దేమె యాదగిరి, గౌస్, పార్టీ నాయకులు పోచమ్మల గణేష్, దాకి స్వామి, చింతల స్వామి, దేవుని రాజు, దేవుని నర్సింలు, భూమ రమేష్, సాల్మన్ రాజు, విప్లవ్, పచ్చంటి రాముతో పాటుపాల్గొన్నారు.



## ఇసుక మాఫియా... నిలిచిన ఇందిరమ్మ ఇళ్ళు





ప్రజాపక్షం/నిర్మల్ : కూడు, గుడ్డ తర్వాత మనిషికి అత్యంత ప్రాధాన్యమైనది సొంత గూడు, సమాజనంలో నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయాలనే ఉన్నత ఆశయంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ళు పథకం నిర్మల్ జిల్లాలో ఇసుక ఆసురుల లాభదాహానికి బలైపోతోంది. ఒకవైపు సిమెంట్, ఇనుము వంటి భవన నిర్మాణ సామాగ్రి ధరలు మార్కెట్లో అమాతం పెరిగిపోతుండగా, మరోవైపు ఇసుక ధరలు ఊహించని రీతిలో ఆకాశాన్ని తాకడంతో లబ్ధిదారులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారు. పేదల ఆశలపై అక్రమార్కులు పంజా విసురుతుంటే, జిల్లా యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

### పోలీసుల పేరుతో సాకులు

### రూ.3 వేల ధర రూ.9 వేలకు పరుగు

గత నెల రోజుల క్రితం వరకు జిల్లాలో ఒక ట్రాక్టర్ ఇసుక ధర మూడు వేల రూపాయల పరిధిలో సామాన్యులకు అందుబాటులో ఉండేది. కానీ ప్రస్తుతం అదే ఒక ట్రిప్పు ఇసుక ధర ఏకంగా 9 వేల రూపాయలకు చేరుకోవడం గమనార్హం. ఇసుక సరఫరాదారులు ఇసుక దొరకడం లేదంటూ క్షేత్రస్థాయిలో కృత్రిమ కొరతను సృష్టిన్నారు. ఇసుక తోలితే పోలీసులు పట్టుకుంటున్నారు. కేసులు పెడుతున్నారు అంటూ రకరకాల సాకులు చెపుతూ, లోపాయికారిగా అక్రమ వసూళ్ళను సాగిస్తూ పేదల నుండి అడ్డగోలుగా డబ్బులు దండుకుంటున్నారు. ఇప్పటికే అప్పులు సప్పులు చేసి చేతిలో ఉన్న కొద్దిపాటి సొమ్ముతో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులు, ఈ అమానవీయ ధరలను భరించలేక పనులను పునాదుల స్థాయిలోనే నిలిపివేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒక ట్రాక్టర్ ఇసుకకు తొమ్మిది వేల రూపాయలు చెల్లించాల్సి వస్తే, ఇక ప్రభుత్వం ఇచ్చే అరకోర సాయం పునాదులకే సరిపోదని లబ్ధిదారులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రకటనల ఆర్భాటమే తప్ప, క్షేత్రస్థాయిలో శూన్యం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఇస్తామని, ఇందిరమ్మ ఇళ్ళతో పేదల రాత మారుస్తామని ప్రకటనల ఆర్భాటాలు చేయడం తప్ప క్షేత్రస్థాయిలో గృహ నిర్మాణానికి అవసరమైన కనీస వనరులను సమకూర్చడంలో పూర్తిగా విఫలమైందని లబ్దిదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇల్లు నిర్మించుకోవడానికి అత్యంత ప్రాథమిక వనరు అయిన ఇసుకే అందుబాటు ధరల్లో లేకపోతే, ఇక ప్రభుత్వ పథకాల ప్రయోజనం ఎవరికి చెందుతుందని వారు పాలకులను ప్రశ్నిస్తున్నారు. పేదల అవసరాలను, నిస్సహాయతను కొందరు వ్యాపార అవకాశంగా మార్చుకొని, అక్రమ లాభాల కోసం ఇసుక మాఫియాగా ఏర్పడి దోపిడికి పాల్పడుతున్నారని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పేదల గృహ నిర్మాణ అవసరనాలను కొందరి ధనార్జన సాధనంగా మార్చడం సిగ్గుచేటని జిల్లా ప్రజలు మండిపడుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణంలో నిమగ్నమైన లబ్దిదారులు, భవన నిర్మాణ కార్మికులు జిల్లా యంత్రాంగం తక్షణమే ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల కోసం ప్రభుత్వమే రీచ్‌ల నుండి ప్రత్యేక పాసులు జారీ చేయాలని, లేదా నిర్దేశిత డిపోల ద్వారా రాయితీ ధరలపై ఇసుకను నేరుగా లబ్దిదారులకే సరఫరా చేయాలని, అప్పుడే నిలిచిపోయిన పనులు మళ్ళీ ముందుకు సాగుతాయని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రతిష్టాత్మకంగా భావించే ఇందిరమ్మ ఇళ్ళ పథకం ఇలా మాఫియా దందాలకు బలైపోతే అది ముమ్మాటికీ పాలనా వైఫల్యానికే నిరద్శనంగా మిగిలిపోతోంది.

## జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ



ప్రజాపక్షం/మెదక్ : మెదక్ జిల్లా న్యాయస్థానంలో పరిధిలో ఈ నెల 20 తేదీన ఉదయం 10 గంటలకు జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయశాఖ చైర్పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజీ పడదగిన కేసులన్నీ రాజికుదురుకొని సంతోషంగా ఉండాలన్నారు. ప్రతి మనిషిలో క్షేమ గుణం కలిగి ఉండాలన్నారు. రాజి కుదురుచుకుంటే మానసిక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. భార్యాభర్తలు తగాదాలను పడితే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి రాజకీయం ద్వారా వారి భవిష్యత్తు బాగుంటుందన్నారు. మెదక్ జిల్లాలో నేటి వరకు సుమారు 3వేల కేసులు రాజీ కుదిర్చినట్లు తెలిపారు. రేపు మెగా జాతీయ లోక్ అదాలత్ కేసులను పరిష్కరిస్తామన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యే లక్ష్యం

### కలెక్టర్ భవేశ్‌మిశ్రా ఆకస్మిక తనిఖీ

ప్రజాపక్షం/దిలావర్‌పూర్: ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వసతి గృహాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా స్పష్టం చేశారు. శుక్రవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ అకస్మాత్తుగా సందర్శించి, అక్కడ అందుతున్న విద్యా బోధన, వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలకు చేరుకున్న కలెక్టర్ మొదటగా కార్యాలయ రికార్డులను ఉపాధ్యాయులు సిబ్బంది హాజరు పట్టికలను నిశితంగా పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సంస్కరణలు విద్యార్థులకు ఏ మేరకు చేరుతున్నాయో తెలుసుకోవడానికి ఈ తనిఖీ నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ నేరుగా తరగతి గదుల్లోకి వెళ్ళి విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును గమనించిన ఆయన, విద్యార్థుల విద్యా ప్రమాణాలను స్వయంగా పరీక్షించేదుకు బ్లాక్ బోర్డుపై కొన్ని ప్రశ్నలు రాసి సమాధానాలు అడిగారు. గణితం, ఆంగ్లం, సైన్స్ సబ్జెక్టుల్లో విద్యార్థుల నైపుణ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు తడబడకుండా సమాదానాలు చెప్పడంతో కలెక్టర్ వారిని ప్రత్యేకంగా అభినందించారు.కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా సామాజిక అంశాలు, వర్తమాన పరిణామాలు, జనరల్ నాలెడ్జ్ పై పట్టు సాధించాలని విద్యార్థులకు హితవు పలికారు. బాలికలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, పట్టుదలతో చదివి అనుకున్న స్థానాలకు చేరుకోవాలని, ఉపాధ్యాయులు బోధించే ప్రతి అంశాన్ని శ్రద్ధగా నోట్ చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో గానీ, హాస్టల్‌లో గానీ నీటి సమస్య విద్యుత్ సరఫరా లేదా మరేదైన ఇబ్బంది ఎదురైతే భయపడకుండా వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని, వాటిని తక్షణమే పరిష్కరిస్తామని విద్యార్థులకు కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఆ తర్వాత వసతీ గృహ ముదాయాన్ని పరిశీలించిన కలెక్టర్, స్టోర్ రూములోకి వెళ్ళి అక్కడ నిల్వ ఉంచిన బియ్యం, కందిపప్పు, వంట నూనెలు, నిత్యావసర సరు కుల నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. అలాగే కిచెన్ షెడ్‌ను సందర్శించి, కూరగాయలు, తాజాగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందికి కలెక్టర్ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఏజెన్సీల నుండి వచ్చే సరుకులు నాణ్యతగా ఉంటేనే లోపలికి అనుమతించాలని, కుళ్ళిన కూరగాయలు లేదా తక్కువ రకం వస్తువులను ఉపయోగిస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. , అందువల్ల మెనూ ప్రకారం ప్రతీరోజు పౌష్టికాహారం రుచికరమైన భోజనం అందించాల ని, వంట చేసే ప్రదేశాన్ని వంట పాత్రలను అత్యంత పరిశుభ్రంగా ఉంచుకోవాలని వార్డెన్, వంట సిబ్బందిని ఆదేశించారు. మధ్యాహ్న బోజన సమయంలో విద్యార్థులతో కలిసి కలెక్టర్ భవేశ్‌మిశ్రా నేలపై కూర్చొని సహపంక్తి భోజనం చేశారు. వడ్డించిన అన్నం, పప్పు కూరలను స్వయంగా రుచి చూశారు.

## నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

### కలెక్టర్ ప్రతీఖ్ జైన్

ప్రజాపక్షం/సంగారెడ్డి : జిల్లాలో ఈ నెల 21 ఆదివారం మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు నిర్వహించనున్న నీటీ(యూజీ) 2026 పరీక్షను పారదర్శకంగా ప్రశాంతంగా సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 9 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2,924 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని ఆయన వెల్లడించారు. పరీక్షా నిర్వహణలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సంబందిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) జారీ చేసిన మార్గదర్శకాలను తప్పని సరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.

### అభ్యర్థులు వెంట తీసుకురావల్సినవి

ఎన్‌టీఏ వెబ్‌సైట్ నుంచి డౌనోలోడ్ చేసుకున్న ఆడ్మిట్ కార్డు, ఆధార్‌కార్డు (పాస్‌పోర్ట్) స్టూడెంట్ ఐడి వంటి ఒరిజనల్ ఫోటో గుర్తింపు కార్డు, రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు, ఒక పోస్ట్ కార్డ్ సైజ్ ఫోటో, పారదర్శక ( ట్రాన్స్ పరెంట్ ) నీటి బాటిల్ మాత్రమే,

### పాటించవలసిన సూచనలు

ఆడ్మిట్ కార్డులో పేర్కొన్న గేట్ క్లోజింగ్ సమయం ( మధ్యాహ్నం 1.30 గంటలు) కంటే ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి , ఓఎంఆర్ షీట్ హాజరు పట్టికపై సంతకాలు చేయాలి, పరీక్షాకేంద్రంలో ఏన్‌టీఏ అందించే బ్లాక్ పాయింట్ పెన్ మాత్రమే ఉపయోగించాలి

### నిషేధిత వస్తువులు

స్వంత పెన్నులు , పెన్సిలు ,రబ్బరు తీసుకురావద్దు, ఓఎంఆర్‌పై సీట్‌పై అనవసర గుర్తులు చేయరాదు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి రు మాలు, మొబైల్ పోన్ ఏ రకమైన గడియారం, బెల్ట్ అభరణాలు ( ఉంగరాలు, గొలుసులు ,చెవిపోగులు, మొదలైనవి) ఎలక్ట్రానిక్ ,కమ్యూనికేషన్ పరికరాలు, పెన్సిల్, రబ్బరు పార్సనర్ కేక్షన్ ఫ్లూయిడ్ వంటి వస్తువులను తీసుకురావద్దు, పై పేర్కొన్న వస్తువులలో ఏదైన అభ్యర్థి వద్ద ఉన్నట్లు



గుర్తిస్తే అతడిని ,ఆమెను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షా గదిలో మొబైల్ ఫోన్ ,ఇతర నిషేదిత వస్తువులు కలిగి ఉన్నట్లు తేలితే అది తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనగా పరిగణించబడుతుంది. అలాంటి సందర్భంలో అభ్యర్థి అభ్యర్థిత్వం రద్దు చేయబడటంతోపాటు భవిష్యతులో నిర్వహించే పరీక్షలకు కూడా అనర్హుడిగా ప్రకటించబడతారు. అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రం చిరునామనామాను ముందుగానే దృవీకరించుకుని పరీక్షా రోజున సమయానికి కేంద్రానికి చేరుకునేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నీట్ (యూజీ) 2026 పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు తల్లిదండ్రులు ,అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

ప్రజాపక్షం/రాంచంద్రాపురం : పటాన్‌చెరు నియోజవకర్గ పరిధిలోని భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరష్కారానికి కట్టుబడి ఉన్నామని పటాన్‌చెరు శాసన సభ్యుడు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తెల్లాపూర్ లో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర భవన ,ఇతర నిర్మాణ రంగాల కార్మికుల సంఘం తెల్లాపూర్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.పటాన్చెరు నియోజవకర్గంలో రియల్ ఎస్టేట్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని ,ఈ నేపథ్యంలో భవన నిర్మాణ రంగ కార్మికుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం కోసం అతిత్వరలో స్థలం కేటాయిస్తానని హామి ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లోనూ తగు ప్రాదాన్యత కల్పిస్తామని హామి ఇచ్చారు. అసోసియేషన్ తరపున ప్రతి కార్మికుడు గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాములుగౌడ్, సీనియర్ నాయకులు మల్లారెడ్డి శ్రీశైలం , దయాకర్, శ్రీపాల్‌రెడ్డి నాగరాజు, సాగర్, హర్ష, ఇంద్రారెడ్డి సంఘం అద్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.




## సిఎంసి మెడికల్ కళాశాలను... భంగపర్చేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు





ఐఎంఎస్‌ఆర్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ షణ్ముగం

ప్రజాపక్షం/నిజామాబాద్ : ఐఎంఎస్‌ఆర్, సిఎంసి యాజమాన్యంపై కొందరు వ్యక్తులు చేస్తున్న తప్పుడు, నిరాధార ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఐఎంఎస్‌ఆర్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ షణ్ముగం మహాలింగం తెలిపారు. సిఎంసి మెడికల్ కళాశాల ప్రతిష్టను భంగపర్చేందుకు ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 200 కోట్ల పెట్టుబడితో కళాశాల ప్రారంభించేదుకు ప్రయత్నిస్తే దురుద్దేశ్యపూర్వకంగా ఐఎంఎస్‌ఆర్ సంస్థపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఇంటిగ్రేటెడ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షణ్ముగం మహాలింగం మీడియా సమావేశంలో మాట్లాడారు. డిచ్‌పల్లి మండలం సుద్దపల్లిలోని సిఎంసి మెడికల్ కళాశాల వ్యవహారంలో ఇరువర్గాల మధ్య జరుగుతున్న వివాదాలను వివరించారు. క్యాంపస్‌లో జరిగిన ఘటనల నేపథ్యంలో ఇప్పటికే ప్రత్యేక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయకపోవటంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఎఫ్‌ఐఆర్ నెం. 176/2026 ద్వారా సిఎస్‌ఐ సంస్థ ప్రతినిధులైన విమల్ సుకుమార్, దయానంద్, ప్రసాద్ నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనివాస్‌తో పాటు మరో ఇద్దరిపై ఈనెల 11న కేసు నమోదైనట్లు తెలిపారు. సంస్థ ప్రతిష్టను దెబ్బ తీ యాలనే ఉద్దేశ్యంతో అసత్య ఆరోపణలు చేస్తూ తనపై డిచ్‌పల్లి పిఎస్‌లో మరోసారి తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. అనుభవం, వనరులు ఐఎంఎస్‌ఆర్‌కు సమృద్ధిగా ఉన్నాయని, బయటి వ్యక్తుల సాయం అవసరం లేదన్నారు. అక్టోబర్ 20 24 నుండి సిఎస్‌ఐ టీఏ మెదక్ డయాసిస్‌తో కుదిరిన అవగాహన ఒప్పందం మే రకు సిఎంసి క్యాంపస్‌లో పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు, సమాజ సేవలను ప్రజలకు వివరించటంతోసంస్థపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తెలియజేస్తున్నామని వివరణనిచ్చారు.

## పెద్దమ్మతల్లి దయతో... పల్లెలు పచ్చగా ఉండాలి

### ఎమ్మెల్యే రోహిత్ రావు

ప్రజాపక్షం/పాపన్నపేట: పెద్దమ్మతల్లి కరుణాకటాక్షాలతో సమృద్ధిగా వర్షాలు కురిసి పల్లెలు పచ్చగా కళకళలాడాలని, రాష్ట్రం సిరిసంపదలు, సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు ఆకాంక్షించారు. శుక్రవారం మండల పరిధిలోని కోడుపాక గ్రామంలోని పెద్దమ్మతల్లి ఆలయ రెండో వార్షికోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన బోనాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే రోహిత్ రావు, రాష్ట్ర ప్రజలకు ఆయురారోగ్యాలు కలగాలని, రైతన్నలు పంటలతో కళకళలాడుతూ ఆనందంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురిసి వ్యవసాయం అభివృద్ధి చెందితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు. కోడుపాక గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బోనాల వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ గౌడ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్ గౌ డ్, ప్రశాంత్ గౌడ్, భూమయ్య, ఖలీం, సంగమేష్, శివయ్య, రాములు,ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



హీరో కిరణ్ అబ్బవరం 'చెన్నై లవ్ స్టోరీ' మూవీ నుంచి మరో సెన్సేషనల్ సాంగ్ రాబోతోంది. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన రెండు సాంగ్స్ 'తొలి ప్రేమం తోపు కాదే, 'వదలనే..' సూపర్ హిట్ అయ్యాయి. ఇప్పుడు మూడవ పాట 'జిగితార' రిలీజ్ చేశారు.



# ఇండస్ట్రీ సపోర్ట్ చెయ్యడం లేదు

## ప్రభాస్‌కు విజ్ఞప్తి చేసిన స్పిరిట్ నిర్మాత నర్సమ్మ



పాన్ ఇండియా హీరో ప్రభాస్ మాకు మీరే దిక్కు ఆస్తులు అమ్మి 'స్పిరిట్' ఇస్ నాట్ వన్ సినిమా తీసి సర్వం కోల్పోయాం. పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలా మా మీద రెండు లీగల్ నోటీసులు పంపించి సినిమా రిలీజ్ ఆపేసారు. మాతో మాట్లాడితే వేరే టైటిల్ పెట్టుకుని మా సినిమా రిలీజ్ చేసుకునేవాళ్ళం. రిలీజ్ చెయ్యడానికి ఊరిలో ఒకరిని డబ్బులు అడిగాం అప్పుడు డబ్బులు ఇస్తాను అన్నవాళ్లు కూడా భయపడి ఇవ్వలేదు. ఊరిలో పరువు పోయింది. మా ఫ్యామిలీ రోడ్డున పడిపోయాం. ప్రభాస్ మమ్మలను మీరే ఆదుకోవాలి. మీకోసం టైటిల్ మార్చుకోడడానికి మేము సిద్ధం గానే ఉన్నాము. మమ్మలను సంప్రదించకుండా టి సిరీస్ సంస్థ అధినేత భూషణ్ కుమార్ రెండు లీగల్ నోటీసులు పంపారు. అడిగి ఉంటే మేము టైటిల్ మార్పుకు ఒప్పుకునే వాళ్ళం. ఒక రైతు ఫ్యామిలీ సినిమా తీస్తే మాకు వచ్చిన టైటిల్ వివాదంకి సినిమా ఇండస్ట్రీ ఎటువంటి సపోర్ట్ చెయ్యడం లేదు. ప్రభాస్‌పై, సందీప్ రెడ్డి వంగాపై అభిమానంతో ఈ విజ్ఞప్తిని చేస్తున్నాను. మీరు చేస్తున్న స్పిరిట్ సినిమా నిర్మాతలు అయిన టి సిరీస్ సంస్థ అధినేత భూషణ్ కుమార్ తరఫున, మా 'స్పిరిట్ ఈజ్ నాట్ వన్' చిత్రాన్ని విడుదల చేయకూడదని, దాని ప్రచార కార్యక్రమాలు నిలిపివేయాలని కోరుతూ మాకు లీగల్ నోటీసు పంపబడింది.మా స్పిరిట్ ఈజ్ నాట్ వన్ చిత్రం యైత్ వండర్ బ్యాన్ప నిర్మించబడింది. ఈ చిత్రానికి మీరు సూట్ మొదలు పెట్టక ముందు సంవత్సరంలోనే మాకు సెన్సార్ సర్టిఫికేట్ లభించింది. చిత్రానికి సంబంధించిన ఇంటర్వ్యూలు కూడా ఇచ్చాము. గత నెలలో చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించి, వంగా గారి మేనేజర్ వారికి అందించి అనంతరం మాకు లీగల్ నోటీసు పంపించారు.కాబట్టి, దయచేసి మా పరిస్థితిని అర్థం చేసుకుని, మాకు సానుకూలంగా స్పందించి, 'స్పిరిట్ ఈజ్ నాట్ వన్' చిత్రాన్ని విడుదల చేసుకునే అవకాశాన్ని కల్పించగలరని, మాది చినమీ స్పిరిట్ సినిమా రిలీజ్ ని వాయిదా వేసుకోవాలి అని చేతులు జోడించి ప్రభాస్ ని, సందీప్ రెడ్డి వంగాని వేడుకుంటున్నాను అని నిర్మాత నరసమ్మ తెలిపారు.

# 'మారెమ్మ' జూలైలో రిలీజ్



మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ 'మారెమ్మ'తో హీరోగా బిగ్ స్క్రీన్ పై అడుగుపెడుతున్నారు. ఈ చిత్రంతో మంచాల నాగరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మయూర్ రెడ్డి బండారు మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'మారెమ్మ' ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్, ఫస్ట్ సింగిల్ 'బావ బావ' సాంగ్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న ఈ సినిమా జూలైలో రిలీజ్ కు సిద్ధం అవుతోంది. ఈసారి బోనాల జాతర థియేటర్లలో దుమ్ములేపబోతున్నాయ్ అంటూ మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్ డివైన్ వైబ్ తో అందరినీ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ ప్రశాంత్ అంకిరెడ్డి అందించగా, సంగీతాన్ని ప్రశాంత్ ఆర్ విహారి సమకూర్చారు. ఎడిటర్గా దేవ్ రాథోడ్, ఆర్ట్ డైరెక్టర్‌గా రాజు కుమార్ మురుగేసన్ పని చేస్తున్నారు. మాధవ్ సరసన దీపా బాలు హీరోయిన్ గా నటించిన ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో వినోద్ కుమార్, వికాస్ వశిష్ట, దయానంద్ రెడ్డి, వి ఎస్ రూపా లక్ష్మి నటించారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఉమేష్ విలాసాగరం, యాక్షన్ డైరెక్టర్: మాడి గొండ నటరాజ్, కొరియోగ్రాఫర్ : సాగ్గి సాగర్, సాహిత్యం: మిట్టపల్లి సురేందర్, కమల్ ఎస్లావత్.

# తిరుపతిలో 'చెన్నై లవ్ స్టోరీ' మ్యూజికల్ ఫెస్ట్



హీరో కిరణ్ అబ్బవరం 'చెన్నై లవ్ స్టోరీ' మూవీ నుంచి మరో సెన్సేషనల్ సాంగ్ రాబోతోంది. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన రెండు సాంగ్స్ 'తొలి ప్రేమం తోపు కాదే, 'వదలనే..' సూపర్ హిట్ అయ్యాయి. ఇప్పుడు మూడవ పాట 'జిగితార' రిలీజ్ చేశారు.. ఈ నెల 20న తిరుపతిలో మ్యూజికల్ ఫెస్ట్ నిర్వహిస్తున్నారు. భారీ స్థాయిలో ఈ ఈవెంట్ నిర్వహించబోతున్నారు. మెలొడీ బ్రహ్మ మణిశర్మ మ్యూజిక్ లోని మ్యాజిక్ ను లైవ్ లో చూసేందుకు ఈ మ్యూజికల్ ఫెస్ట్ లో పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు పాల్గొనబోతున్నారు. 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాలో శ్రీ గౌరి ప్రియ హీరోయిన్ నటిస్తోంది. 'కలర్ ఫొటో', 'బేబి' వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో ఈ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్‌పై ఎస్ కెఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందించగా రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం 'చెన్నై లవ్ స్టోరీ' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ఫుల్ స్వింగ్ లో జరుగుతున్నాయి. జూలైలో ఈ చిత్రాన్ని గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. కిరణ్ అబ్బవరం సరసన శ్రీ గౌరి ప్రియ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రానికి ఆర్ట్ భాస్కర్ ముదావత్, ఎడిటర్ సంతోష్ నాయుడు, డిఓపి విశ్వాస్ డేనియల్, పాటలు అనంత్ శ్రీరామ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ విశాల దాట్ల, లైన్ ప్రొడ్యూసర్ శ్యామ్ ప్రసాద్ మేక.



# యాక్షన్ నేపథ్యంలో కొత్త సినిమా ప్రారంభం

ఆల్మైటి క్రియేషన్స్ ప్రొడక్షన్స్ నెంబర్ 1 చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభం అయ్యింది, వాల్లాల రమేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై హీరో, హీరోయిన్లపై క్లాప్ కొట్టారు. రేవంత్, ఆద్య శర్మ హీరో హీరోయిన్ గా నటిస్తున్న సినిమాకు నిర్మాత విడిగేపల్లి కృష్ణ మోకిలా. విష్ణు మొలకలు నక్షత్ర, కాకర్లముడి రామకృష్ణ కో ప్రొడ్యూసర్స్, కథ స్క్రీన్ ప్లే దర్శకత్వం రామ్ భరదరం.లవ్, ఎమోషన్స్ తో కూడిన యాక్షన్ సినిమా ఇది. యూత్ ను ఫ్యామిలీస్ ను ఆకట్టుకొనేలా తీయ్యాబోతున్నారు దర్శకుడు రామ్ భరదరం. సింగపూర్ లో అద్భుతమైన లొకేషన్స్ లో ఈ సినిమా సాంగ్స్ ను చిత్రీకరించబోతున్నారు అలాగే హైదరాబాద్, చీరాల లో టాకి పార్ట్ తీయబోతున్నారు.


ఈ సినిమాకు ప్రసాద్ ఈదర కెమెరామెన్, రఘు కుంచె సంగీతం అందిస్తున్నారు, మాటలు మరుదూరి రాజా, ఎడిటర్ నందమూరి హరి, ఫైట్స్ అవినాష్.

# జయకృష్ణ 'శ్రీనివాస మంగాపురం'



ఆర్‌ఎక్స్ 100, మంగళవారం చిత్రాలను అందించిన దర్శకుడు అజయ్ భూపతి, జయ కృష్ణ ఘట్టమనేనిని తెలుగు చిత్రసీమకు పరిచయం చేస్తూ 'శ్రీనివాస మంగపురం' తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంతో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. సీనియర్ నటుడు మోహన్ బాబు విలన్ పాత్రలో నటిస్తున్నారు. పి. కిరణ్ నిర్మాణంలో అశ్వినీ దత్ సమర్పిస్తున్న ఈ చిత్రం విడుదలకు ముస్తవాలుతోంది. ఇప్పటివరకు విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమా పాత్రలు, ప్రపంచాన్ని పరిచయం చేయగా, తాజా టీజర్ మాత్రం పూర్తిగా యాక్షన్, ఆటిట్యూడ్తో ఆకట్టుకుంది. జయకృష్ణ ఘట్టమనేని కాన్ఫిడెంట్ గా విలన్స్ ని సవాల్ చేస్తూ, భారీ యాక్షన్ సన్నివేశాల్లో అలరించారు. టీజర్ చివర్లో సూపర్ స్టార్ కృష్ణకు నివాళిగా రూపొందించిన సన్నివేశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, భావోద్వేగాన్ని పెంచింది. ఈ టీజర్తో జయకృష్ణను మాస్ యాక్షన్ హీరోగా ప్రజెంట్ చేశారు. అజయ్ భూపతి ఓ కమర్షియల్ ఎంటర్టైనర్‌కు కావాల్సిన అన్ని అంశాలను ఈ చిత్రంలో జోడించారు. భారీ స్థాయిలో తెరకెక్కించిన యాక్షన్ ఎపిసోడ్స్ సినిమాటోగ్రఫర్ జయకృష్ణ అందించిన విజువల్స్ తీసుకొచ్చాయి. జివి ప్రకాష్ కుమార్ అందించిన ఎనర్జిటిక్ బ్యాగ్రౌండ్ స్కోర్ టీజర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది.ఈ చిత్రానికి మాధవ్ కుమార్ గుల్లపల్లి ఎడిటర్‌గా, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, రియల్ సతీష్ యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు.'శ్రీనివాస మంగాపురం' విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నారు.

# ఆంధ్రలో అనంత పద్మనాభ స్వామి రథయాత్ర




మన సంస్కృతి, మూలాలను వచ్చే జనరేషన్‌కు పరిచయం చేయడానికి చేస్తున్న ప్రయత్నమే అనంత పద్మనాభ స్వామి రథయాత్ర. అభిషేక్ నామ దర్శకత్వంలో తెరకెక్కించిన నాగబంధం సినిమాకు సంబధించిన అనంత పద్మనాభ స్వామి రథయాత్ర ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో కొనసాగుతోంది. ఈ సినిమాలో హీరోగా విరాట్ కర్ణ, నభా నటేష్ హీరోయిన్ గా నటిస్తోంది. ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలో , ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జూలై 3న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రచార యాత్రను కొనసాగిస్తున్నారు. ఆనంత పద్మనాభ స్వామి వారి రథ యాత్రని తిలకించడానికి జనం పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. ఈ యాత్రలో సినిమాలోని నటినటులు కూడా పాల్గొంటున్నారు. కర్నూలు నుంచి హైదరాబాద్ వరకు ఈ రథయాత్ర కొనసాగుతుంది. ప్రతి ఒక్కరూ ఈ రథోత్సవంలో పాల్గొని స్వామి వారి ఆశీర్వాదాలు పొందాలని కోరుకుంటున్నామని ప్రొడ్యూసర్ నిషిత నాగిరెడ్డి చెప్పారు. అనంత పద్మనాభ స్వామి యాత్ర ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ప్రొడ్యూసర్ కిషోర్ అన్నపురెడ్డి తెలిపారు.

# చీకోటి ప్రవీణ్‌ను విచారించిన సిట్ అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో శుక్రవారం మరో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు విచారణలో భాగంగా బిజెపి నేత చికోటి ప్రవీణ్‌ను బంజారాహిల్స్ లోని సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించి, ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. విచారణ అనంతరం బయటకు వచ్చిన చికోటి ప్రవీణ్ మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తన ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందంటూ గతంలోనే తాను డిజిపికి ఫిర్యాదు చేశానని గుర్తుచేశారు. టాస్క్ ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్‌రావు ఈ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో అత్యంత కీలక పాత్ర పోషించారని నేరుగా ఆరోపించారు. కేవలం కొందరివే కాకుండా, ఏకంగా 2 వేలకు పైగా ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేశారని అన్నారు. ఈ కేసు వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పెద్ద తలకాయల నిజాలు బయటకు రావాలంటే నిందితులకు వెంటనే 'నార్కో అనాలసిస్ టెస్ట్' చేయాలని ప్రవీణ్ డిమాండ్ చేశారు. అలాగే రాధాకిషన్‌రావు కూడబెట్టిన అక్రమ ఆస్తులపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలన్నారు. ఒకవేళ ఇక్కడి అధికారులు గనుక పట్టించుకోకపోతే.. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఇడి, సిబిఐలకు లేఖ రాస్తానని హెచ్చరించారు.

## వాట్సాప్‌లో పాఠశాల విద్యా సేవలు..

# డిజిటల్ మస్కట్‌గా పాలపిట్ట ....

డిజిటల్ పాలనలో తెలంగాణ ప్రజాప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది.

ప్రజాపక్షం/హైదరాబాద్: వాట్సాప్ ద్వారా అన్ని పాఠశాలల సమాచారం ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు, విద్యార్థులకు అందనున్నాయి. 'మీసేవ 'సహకారంతో వాట్సాప్ ద్వారా ఇకపై స్కూల్ అప్‌డేట్స్‌ను నేరుగా ఫోన్‌కు చేరనున్నాయి. హైదరాబాద్‌లోని ఎల్.బి స్టేడియంలో జరిగిన కార్య క్రమంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి 'ఈ సేవల'ను అధికారికంగా ప్రారంభించారు. ఈ వి నూత్న కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల విద్యకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం, సేవలు, ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను నేరుగా వాట్సాప్ ద్వారా పొందనున్నారు. విద్యా పురోగతి, పరీక్షల సమాచారం, విద్యా సామగ్రి పంపిణీ, స్కాలర్‌షిప్, పాఠశాల కార్యక్రమాలు, ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాల వంటి అంశాలపై సకాలంలో సమాచారం అందుబాటులోకి రానుంది. త్వరలోనే మరిని సేవలు అం దుబాటులోనికి రానున్నాయి. యూనిఫాములు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ వివరాలు, విద్యార్థుల హాజరు సమాచారం,ప్రీమెట్రిక్ స్కా5లర్‌షిప్ దరఖాస్తులు, మధ్యాహ్న భోజన పథకం వివరాలు ,ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాలు,క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాల సమాచారం,రెసిడెన్షియల్ పాఠశాలల సంక్షేమ కార్యక్రమాల వివరాలు అందుబాటులోనికి రానున్నాయి. అలాగే విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయ సేకరణ కూడా చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా రాష్ట్ర పక్షి 'పాలపిట్ట'ను డిజిటల్ మస్కట్‌గా పరిచయం చేశారు. పాలపిట్ట యానిమేషన్ వీడియోల ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులకు ముఖ్యమైన సమాచారం, అవగాహన సందేశాలు, వీడియోలు వాట్సాప్‌లో పంపించనున్నారు. అయితే రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దు ద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ ,కమ్యూనికేషన్స్ శాఖకు చెందిన ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ మీసేవ వి భాగం, పాఠశాల విద్యా శాఖతో కలిసి డిజిటల్ సేవలను అభివృద్ధి చేశారు.







# వందేళ్ల నష్టం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులు పొన్నంప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్,అజారుద్దీన్‌తో కలిసి గురుకుల విద్యార్థులకు 'యంగ్ ఇండియా స్టూడెంట్ కిట్స్'ను పంపిణీ చేశారు. అనంతరం 'అన్న అక్క మెటార్‌షిప్ కార్యక్రమాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో గవర్నర్ శివప్రతాప్ శుక్లా 'డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ' చేయించారు. అనంతరం సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యా శాఖకు మంత్రి లేడంటూ కొందరు మాట్లాడుతున్నారని, విధ్వంసమైన విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే ఆ శాఖను తన వద్దనే పెట్టుకున్నానని వివరించారు. ప్రీ ప్రైమరీ విధానాన్ని ప్రవేశపెట్టి, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను పునరుద్ధరిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డు పెట్టాల్సి వస్తుందని ఎవ్వరూ కలలో కూడా ఊహించి ఉండబోరని, ఆరుట్ల పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో అలాంటి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించామని ఆయన చెప్పారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించి దేశానికే ఆదర్శంగా తెలంగాణను నిలపబోతున్నామన్నారు. ఎఐ అనే తుఫాన్ భూతంతో కోట్లాదిమంది వైట్ కాలర్ ఉద్యోగులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని, అందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బ్లూ కాలర్ జాబ్స్ వైపు దృష్టి సారించిందన్నారు. తెలంగాణ విద్యార్థులకు ఇంగ్లీష్ తో పాటు జర్మనీ, జపాన్ భాషను కూడా నేర్పిస్తున్నామన్నారు. విద్యా అభివృద్ధికి రూ. 26,600 కోట్ల నిధులను ప్రభుత్వం ఖర్చు చేస్తోందని, ఈఖర్చును తాము ఖర్చుగా భావించడం లేదని, భవిష్యత్ తరాల కోసం పెడుతున్న పెట్టుబడిగా భావిస్తామన్నారు.

**వికసిత్ భారత్‌కు మద్దతుగానే తెలంగాణ రైజింగ్...**

కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా, మద్దతగా తెలంగాణ రైజింగ్ 2047 పేరుతో ముందుకు సాగుతున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి పదును పెట్టి గొప్ప వాళ్లుగా తీర్చిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సాంఘీక సంక్షేమ గురుకులాల విద్యార్థులు వైద్యులుగా, ఐఎఎస్‌లుగా, ఐపిఎస్‌లుగా, రాజకీయ నాయకులుగా ఎదగాలన్నారు. భారతదేశ రేపటి భవిష్యత్ నేటి తరగతి గదుల్లోనే ఉందని, తలరాతను మార్చేది చదువు ఒక్కటేనని, అందరూ చదువుకుని రాణించాలని, అందుకు ఏం కావాలన్నా ప్రభుత్వం సమకూర్చేందుకు సిద్ధంగా ఉందని సూచించారు. తెలంగాణ రాష్ట్రాన్ని విద్య, స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని సిఎం చెప్పారు. తెలంగాణ భాషా ప్రయుక్త రాష్ట్రంగానో, పాలన సౌలభ్యం కోసమో ఏర్పడిన రాష్ట్రం కాదని, 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, ఆత్మ బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని సిఎం గుర్తు చేశారు.

**పెద్ద ఎత్తున సంస్కరణలను ప్రవేశపెడితే అవాకులు, చవాకులు పేలుతున్నారు : భట్టి విక్రమార్క**

రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున సంస్కరణలు చేపడుతుంటే, ప్రతిపక్ష నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. అభివృద్ధి చెందుతున్న తెలంగాణను చూసి, ప్రపంచంతో పోటీ పడుతున్న విద్యార్థులను చూసి అభినందించాల్సింది పోయి, విమర్శలు చేయడం వారి సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమన్నారు. విద్య కిట్ల పంపిణీ కార్యక్రమం ఇందిరమ్మ ప్రభుత్వానికి అత్యంత ప్రియమైనదని, ఇది నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా కిట్లను అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వాల తరహా మొక్కుబడిగా కాకుండా, ప్రజాధనంలోని ప్రతి పైసా కు జవాబుదారీతనంతో ఈ వస్తువులను విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మ ణ్, అజారుద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. విద్య, క్రీడలు, ఉద్యోగాలు అన్ని రంగాల్లో తెలంగాణ విద్యార్థులు దేశవ్యాప్తంగా తమ ప్రతిభను చాటాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

# వాన చినుకు జాడేదీ?

(మొదటి పేజీ తరువాయి)

భారీ వర్షాలు నమోదు కాలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 79 మండలాలకు 43 మండలాల్లో భారీ లోటు (60 శాతం నుంచి 99 శాతం), 27 మండలాల్లో లోటు (20 శాతం నుంచి 59 శాతం). 9 మండ లాల్లోనే సాధారణ (19 శాతం అధికం, 19 శాతం మైనస్) వర్షపాతం నమోదైంది. దీంతో వానాకాలం సాగు కోసం విత్తనాలు సిద్ధం చేసు కున్న రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. తగినంత తేమ లేకపోవడంతో విత్తనాలు వేయడానికి ముందుకు రావడం లేదు. వర్షాల లేమితో వ్యవసాయ పనులు మందగిస్తున్నాయి. సాధార ణంగా ఈ సమయానికి పత్తి, మొక్కజొన్న, కంది సాగు ప్రారంభం కావాల్సి ఉన్నా అనేక ప్రాం తాల్లో రైతులు వేచి చూస్తున్నారు. మరో వారం రోజుల పాటు గణనీయమైన వర్షాలు లేకుంటే ఖరీఫ్ సాగు విస్తీర్ణంపై ప్రభావం పడే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. రానున్న రోజులలో ఎల్ నినో ప్రభావంతో ముప్పు ఉంటుందని, ప్రస్తుతం రుతుపవనాల మంద గమనానికి అదే కారణమని అధికారులు చెబుతున్నారు.రాష్ట్రంలో పలు జిల్లాలపై ఎల్ నినో ప్రభావం ఉంటుందని కేంద్రం తెలిపింది.పలు జిల్లాల్లో గ్రౌండ్ వాటర్ లెవల్స్ ఇప్పటికే భారీగా పడిపోయాయి. రుతుపవనాల రాకకు ముందే దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్న రైతులు.. ఒకట్రెండు రోజులు కురిసిన వర్షాలకు విత్తనాలు కూడా వేశారు. కానీ ఆ తర్వాత రుతుపవనాలు ముఖం చాటేయడంతో వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.ఒకవైపు వర్షాలు లేకపోవడం, మరోవైపు భూగర్భ జలాలు అడుగంటడం, రిజర్వాయర్లలో వాటర్ లెవెల్స్ కనీస స్థాయికి పడిపోవడం.. వీటన్నింటి నేపథ్యంలో ఈసారి రైతుల్లో అయోమయం నెలకొన్నది.

# భారీ ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇండ్ల స్థలాల కోసం, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ఏండ్ల తరబడి పేదలు పోరాడుతూనే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించేందుకు స్థలం లేక, పక్కా ఇల్లు లేక, దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితి దాపురించిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్లస్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, కానీ ఇంకా రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. పేదలకు, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సిపిఎం జిల్లా నాయకులు ఎం. చుక్కయ్య అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు, కర్రె బిక్షపతి, జి.ప్రభాకర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు మంద సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, మండల కార్యదర్శి ఎన్. అశోక్ స్టాలిన్, కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మ ణ్, మునిగాల బిక్షపతి, నేదునూరి రాజమౌళి, జక్కు రాజు గౌడ్, వేల్పుల సారంగపాణి, బత్తిని సదానందం, రాజ్ కుమార్, గుంటి రాజేందర్, రాసమల్ల దీన, సంజయ్, సిపిఎం జిల్లా నాయకులు బొట్ల చక్రపాణి, వీరన్న, మంద సంపత్,దీప, గౌడుగు వెంకట్, భాను నాయక్, కె.లింగయ్య, గుమ్మడి రాజుల రాములు, ఓరుగంటి సాంబయ్యగాదె రమేష్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

మరోచోట రక్షణశాఖకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి షరతు విధించినట్లు సమాచారం. కొద్దిరోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్‌ను కలిసి గాంధీ సరోవర్ ప్రాజెక్టు ప్రాముఖ్యతను వివరించారు. మూసీ, ఈసీ నదుల సంఘమ ప్రాంతంలో జాతీయ సమైక్యత, మహాత్మా గాంధీ విలువలకు ప్రతీకగా ఈ ప్రాజెక్టును నిర్మించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం రక్షణశాఖకు చెం దిన భూముల బదలాయింపునకు సహకరించాలని కోరారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టులో మహాత్మా గాంధీ సిద్ధాంతాల ప్రచారానికి ప్రత్యేక విజ్ఞాన కేంద్రం, ధ్యాన గ్రామం, చేనేత ప్రచార కేంద్రం, మ్యూజియం, శాంతి విగ్రహం, ప్రజా వినోద స్థలాలు, నదీ ఘాట్లు తదితర సదుపాయాలను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. ఇక కేంద్ర రక్షణశాఖ అనుమతులు లభించడంతో పాటు ప్రాజెక్టు కోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియను అధికారులు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి పనులు మరింత వేగంగా ముందుకు సాగే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతం హైదరాబాద్ నగరంలోనే ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా మారనుంది.

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు**

మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా హైదరాబాద్ నగరంలోని బాపూ ఘాట్ వద్ద తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు పనులను చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేయడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు, భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు అనుమతి లభించడం, తెలంగాణ ప్రభుత్వ విజన్ లక్ష్యాలను సాధించడంలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మూసీ నది సమగ్ర పునరుజ్జీవనం, నదీ తీర ప్రాంతాల అభివృద్ధి, అలాగే ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే పర్యావరణ, చేపడుతున్న చర్యలకు ఈ నిర్ణయం మరింత బలాన్ని చేకూరుస్తుందని సిఎం తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా మూసీ నది పరివాహక ప్రాంతం పర్యావరణపరంగా పునరుజ్జీవం పొందడమే కాకుండా ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రజా స్థలాలు, సాంస్కృతిక కేంద్రాలు, పర్యాటక ఆకర్షణలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, భారత సైన్యం అందిస్తున్న సహకారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ 'ఎక్స్' వేదికగా ఒక ట్విట్ చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com